# నినాదం
TELANGANA
నిఖార్సైన జర్నలిజం

బుధవారం, ఫిబ్రవరి 5, 2025 | సంపుటి - 21 | సంచిక 140 | వెల - 7 | పేజీలు -12 + 8

Published from Hyderabad and Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vi–jayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Anantapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam




## పవిత్ర తీరం.. పారిశుద్ధ్యం అధ్వానం

- కంపు కొడుతున్న కాళేశ్వర జలం
- చెత్తశుద్ధిపై లోపించిన చిత్తశుద్ధి
- మూడు రోజుల్లో మహా కుంబాభిషేకం
- రెండు నెలల్లో సరస్వతీ పుష్కరాలు
- అసౌకర్యానికి భక్తుల అసహనం

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/ మహాదేవపూర్ (నినాదం):

04



# వివరణ ఇవ్వండి..

### 10 మంది ఎమ్మెల్యేలకు అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు

- పార్టీ మారిన ఎమ్మెల్యేలను లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని కోరిన అసెంబ్లీ సెక్రటరీ
- సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నోటీసులు

పార్టీ మారిన ఎమ్మెల్యేకు షాక్ తగిలింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ అయ్యాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలకు అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. పార్టీ ఫిరాయింపులపై లిఖిత పూర్వక సమాధానం చెప్పాలని నోటీసుల్లో పేర్కొన్నారు.



**హైదరాబాద్, నినాదం:**

పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని సుప్రీంకోర్టును బీఆర్ఎస్ ఆశ్రయించిన విషయం తెలిసిందే. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నాలుగు నెలల్లో చర్యలు తీసుకోవాలని గతంలోనే తెలంగాణ హైకోర్టు ఆదేశించింది.

02

## వీడియోలు చూపి బ్లాక్‌మెయిల్

### యువతి వద్ద రూ.2.53 వసూలు

### హైదరాబాద్‌లో హాస్టల్ నిర్వాహకుడి అరాచకం

**అమరావతి, నినాదం:**

హైదరాబాద్‌లో హాస్టల్ నిర్వాహకుడి అరాచకం బయటపడిరది. వీడియోలతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి బెదిరింపులకు పాల్పడిన సంఘటన వెలుగు చూసింది. యువతి న్యూడ్ వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డాడు. అంతే కాదు యువతిని బెదిరించి ఏకంగా రూ.2.53 కోట్ల వరకు వసూలు చేశాడు.

4

## అక్రమ వలసదారులపై ఉక్కుపాదం



వెతికి పట్టుకొని మరీ దేశం దాటిస్తున్న ట్రంప్

మిలిటరీ విమానంలో పలువురు భారతీయుల తరలింపు

4

## పెరుగుతున్న క్యాన్సర్ మరణాలు



ధూమపానం, గుట్కాలతో వస్తున్న వ్యాధులు

వాటికి దూరంగా ఉండడమే మేలంటున్న వైద్యులు

4


## అంతరిక్షంలోనే చిక్కుకున్న సునీతా విలియమ్స్



భూమ్మీదకు తెచ్చే ప్రయత్నంలో మరింత ఆలస్యం

# బీసీలకు 42% సీట్లు

### బిసిలకు పథకాల్లో లబ్ది చేకూర్చాలన్నదే లక్ష్యం



- దేశంలోనే తొలిసారిగా కులగణన సర్వే చేపట్టాం

## తెలంగాణలో బీసీలు 46.25% ఎస్సీలు 17.43%, ఎస్టీలు 10.45 %,

- విపక్ష పార్టీలు ఇందుకు సిద్ధంగా ఉన్నాయా చెప్పాలి
- నివేదికను అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన సిఎం రేవంత్ రెడ్డి
- కులగణన సర్వేపై రాజకీయాలు చేయొద్దన్న మంత్రి పొన్నం
- సర్వేపై సభలో వాడీవేడి చర్చ
- కులగణనకు కేబినేట్ ఆమోదం
- అన్ని రాష్ట్రాల్లో ఈ డిమాండ్ వస్తుంది
- సర్వేలో పాల్గొనని ప్రతిపక్ష పార్టీ నేతలు
- భూముల వివరాలు ఇవ్వాల్సి వస్తుందని బాయ్‌కాట్
- సిఎం రేవంత్ రెడ్డి కామెంట్స్

### 1.12 కోట్ల కుటుంబాల వివరాలు సర్వే

దాదాపు 50 రోజుల పాటు సర్వే జరిగింది. గ్రామాల్లో 66.39 లక్షల కుటుంబాలు, పట్టణాల్లో 45.15 లక్షల కుటుంబాల్లో సర్వే నిర్వహించాం. రాష్ట్రంలో మొత్తంగా 1.12 కోట్ల కుటుంబాల వివరాలు సర్వే చేశాం. సర్వే ప్రకారం ఎస్సీలు 61,84,319 (17.43 శాతం), బీసీలు (ముస్లిం మైనారిటీ మినహా) 1,64,09,179 (46.25 శాతం), ఎస్టీలు 37,05,929 (10.45 శాతం), ముస్లిం మైనారిటీలు 44,57,012 (12.56 శాతం) మంది ఉన్నారు. ఈ నివేదికను సంక్షేమ విధానాల తయారీకి వినియోగిస్తాం. జనగణన కంటే



02

**హైదరాబాద్,ఫిబ్రవరి4(నినాదం):**

బిసి కులగణన సర్వేపై తెలంగాణ అసెంబ్లీలో వాడీ వేడి చర్చ జరిగింది. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు చేసిన ఆరోపణలను సీఎం రేవంత్‌రెడ్డి తిప్పికొట్టారు. భారాస నేతలు సర్వేలో ఎందుకు పాల్గొనలేదని నిలదీశారు. ఇలా పాల్గొనని నేతలకు సభలో మాట్లాడే అర్హత లేదన్నారు. వారికి మైక్ ఇవ్వొద్దని స్పీకర్‌ను కోరారు. 'కులగణన సర్వే 50 రోజులు జరిగితే .. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు పద్మారావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌నగర్ భాజపా ఎంపీ డీకే అరుణ సర్వేలో పాల్గొనలేదు. సర్వేలో భూమి వివరాలు చెప్పాలని ఫామ్‌లో ఒక కాలమ్ ఉంటే.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఎవరూ సమాచారం ఇవ్వలేదు.



### చింతపండు నవీన్‌పై డీజీపీకి ఫిర్యాదు

**హైదరాబాద్, (నినాదం):**

ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నపై రెడ్డి సంఘాల నేతలు డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఇటీవల వరంగల్ బీసీ బహిరంగ సభలో రెడ్డిలను తీవ్ర పదజాలంతో దూషించారని, వెంటనే నవీన్ పై చర్యలు తీసుకోవాలని కోరారు. నవీన్ కు రేవంత్ రెడ్డి ఎమ్మెల్సీ సీటుతో భిక్ష పెట్టారన్నారు.తమ ఓట్లు పనికిరావని ఎన్నికల సమయంలో ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. బీసీల కోసం పోరాడటంలో తప్పులేదు కానీ తమ కులాన్ని దూషించడం ఎందుకని రెడ్డి సంఘాల నేతలు మండిపడ్డారు.

4

### నేనే మిమ్ములను కలుసుకుంటా

నన్ను కలిసేందుకు ఎవరూ రావద్దు

అభిమానులకు నటుడు జూనియర్ ఎన్టీఆర్ వినతి



### టీజీపీఎస్సీ గ్రూప్- -1 ఫలితాలకు లైన్ క్లియర్

- రెండు కేసులను కొట్టేసిన సుప్రీంకోర్టు

**హైదరాబాద్, నినాదం:**

టీజీపీఎస్సీ గ్రూప్ 1 మెయిన్స్ ఫలితాలకు మార్గం సుగమ మైంది. ఈ ఫలితాల విడుదలకు అడ్డుగా ఉన్న రెండు కేసులను సుప్రీంకోర్టు కొట్టేసింది. దీంతో వచ్చే 10, 12 రోజుల్లోనే గ్రూప్ 1 మెయిన్స్ ఫలితాలను విడుదలకానున్నాయి. ఈ మేరకు టీజీపీఎస్సీ కసరత్తు చేస్తుంది. జీవో 29ను సవాలు చేయడంతోపాటు వికలాంగుల రిజర్వేషన్ అంశాలపై పలువురు గ్రూప్ 1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. దానిపై టీజీపీఎస్సీ కేవియట్ పిటిషన్ దాఖలు చేయగా.. ఇటీవల అత్యున్న ధర్మాసనం విచారణ జరిపి అభ్యర్థుల పిటిషన్లను కొట్టివేసింది.

### ఎన్నికల సంఘం పకడ్బందీ ఏర్పాట్లు

హ్యాట్రిక్ గెలుపు కోసం ఆప్ పోరాటం

హ్యాట్రిక్ గెలుపు కోసం ఆప్ పోరాటం



02

**న్యూఢిల్లీ, నినాదం:**

బుధవారం ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహించనున్నారు. ఢిల్లీ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది.

# వికసిత భారత్ మా దృఢసంకల్పం

### ఆ లక్ష్యం దిశగా పయనిస్తున్నాం



రాష్ట్రపతి ప్రసంగం 'వికసిత్ భారత్' లక్ష్యంపై దేశ దృఢసంకల్పాన్ని పునరుద్ఘాటించిందని ప్రధాని మోడీ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం తమలో ఆత్మ విశ్వాసం నింపిందని, మరోసారి తమ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు ప్రజలకు కృతజ్ఞతలని చెప్పారు.

02

- రాష్ట్రపతి ప్రసంగంలో ఇదే స్పష్టం చేశాం
- రాబోయే 25 ఏళ్ల కాలానికి ప్రజల్లో విశ్వాసం పాదుకొల్పాం
- తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేయడం లేదు
- కొందరు సెల్ఫీలు దిగుతూ.. అద్దాల మేడల్లో ఉంటారు
- ప్రతి రూపాయి గ్రామానికి చేరుకునేలా చూస్తున్నాం
- రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి మోడీ సమాధానం

# బీసీలకు 42% సీట్లు

**మొదటిపేజీ తరువాయి**

3.54 కోట్ల మంది సర్వేలో పాల్గొంటే.. ఎమ్మెల్యేలు, ఎంపీలు అందరూ భూముల వివరాలు ఇచ్చారు. కానీ, భూముల వివరాలు అడగ్గానే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు భయపడి సర్వేలో పాల్గొనలేదు' అని అన్నారు. గత ప్రభుత్వం సమగ్రసర్వే నివేదికను ఎందుకు బయటపెట్టలేదోచెప్పాలన్నారు. దానిని పబ్లి క్డొమైన్‌లో ఎందుకు పెట్టలేదన్నారు. ఆనాడు అధికా రికంగా అసెంబ్లో ఎందుకు పెట్టలేదని బిఆర్‌ఎస్‌ను నిలదీసారు. ఇదే సందర్భంలో రిజర్వేషన్లకు రాజ్యాంగ సవరణ అవసరం కనుక అసెంబ్లీలో తీర్మానం చేసినా లాభం లేదన్నారు. అందుకే పార్టీ పరంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పక్షాన బీసీలకు 42శాతం సీట్లు ఇస్తాం అని ప్రకటించారు. అన్ని పార్టీలు దీనికి కట్టుబడి ఉంటాయా అని ప్రశ్నించారు. రాజకీయాల్లో బీసీలకు మేం 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తాం. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడి నుంచి మాట తీసుకున్నా. అన్ని పార్టీలు బీసీలకు 42శాతం సీట్లు ఇవ్వాలి. కులగణన సర్వే డేటాను సంక్షేమ పథకాల విధానాల తయారీకి వాడతాం. 1931 నుంచి ప్రతి పదేళ్లకు ఓసారి జన గణన చేపట్టారు. 2014లో నరేంద్రమోదీ ప్రధాని అయిన తర్వాత ఇప్పటివరకు జనగణన జరగలేదు. 2021 నుంచి ఇప్పటి వరకు సర్వే చేయకుండా వది లేశారు. దీనిపై బిజెపి నేతలు ప్రధాని మోడీపై ఎందుకు ఒత్తిడి చేయడం లేదన్నారు. బలహీనవర్గా లకు వారి హక్కులు ఇవ్వడం భాజపాకు ఇష్టం లేదు. ప్రధాని మోదీ .. బలహీనవర్గాలకు ఏదైనా సాయం చేయాలనుకుంటే 2021లో లెక్కించాల్సిన జనాభాను ఇంతవరకు ఎందుకు చేయలేదని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య, రాజకీయ, కులగణన సర్వే నివేదికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా నివేదికలోని అంశాలను సీఎం వివ రించారు. 'రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి కులగణన సర్వే చేయాలని ఫిబ్రవరి 2024లో నిర్ణయం తీసుకున్నాం. కర్ణాటక, బిహార్ సహా వివిధ రాష్ట్రాల్లో జరిగిన సర్వేలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాం. సర్వే నిర్వహించే విధానాలపై వివిధ సంఘాలు, మేధావుల అభిప్రాయాలు తీసుకున్నాం.

### రాష్ట్రంలో ఉన్న ప్రతి ఇంటికీ స్టిక్కర్ అంటించాం.

ఒక ఎన్యుమరేటర్ రోజుకు 10 ఇళ్లకంటే ఎక్కువ ఇళ్లలో సర్వే చేయలేదు. 8 పేజీలతో ఉన్న ప్రశ్నపత్రంలో సమగ్ర వివరాలు నమోదు చేశాం. 76 వేల మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు 36 రోజుల పాటు పనిచేసి డేటా క్రోడీకరిం చారు. మొత్తంగా రూ. 125 కోట్లు ఖర్చు చేసి సర్వే ద్వారా సమగ్ర వివరాలు సేకరించాం. మేం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే సర్వే చేయించాం' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సర్వే ఆధారంగా ఆయా కులాల వారికి న్యాయం చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ సర్వే దేశానికే దిక్సూచిగా నిలు స్తుందని అభిప్రాయపడ్డారు. 'భవిష్యత్‌లో చేప ట్టబోయే కార్యక్రమాలకు ఈ సర్వే రోడ్‌మ్యాప్‌లా పనిచేస్తుంది. భావితరాలకు న్యాయం చేయడానికి సమగ్రంగా వివరాలు సేకరించాం. బలహీనవర్గాలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి ఉంది. బీసీలకు న్యాయం చేసేందుకు చేపట్టాల్సిన పథ కాలపై విపక్షాలు సూచనలు చేయాలి' అని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. అంతకు ముందు

సమగ్ర కులగణన, ఎస్సీ వర్గీకరణ నివేదికలకు తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ హాల్లో సుమారు 2 గంటలపాటు క్యాబినెట్ భేటీ కొన సాగింది. ఈ నివేదికలను మధ్యాహ్నం 2 గంటలకు అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. క్యాబినెట్ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 'దేశంలో మొదటిసారి కులగణన చేసి చరిత్ర సృష్టించాం. పకడ్బందీగా సర్వేచేసి సమాచారం సేకరించాం. కులగణన, ఎస్సీ వర్గీకరణకు రోడ్ మ్యాప్ తెలంగాణ నుంచి ఇస్తున్నాం. కులగణన విషయంలో ప్రధానిపైనా ఒత్తిడి పెరుగుతుంది. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో పాటు మంత్రివర్గ ఉప సంఘం, ఏకసభ్య కమిషన్ సిఫార్సుల ప్రకారం ముందుకెళ్తాం. ప్రతిపక్ష నేత సభకు రావాలి కదా! ప్రధాన ప్రతిపక్షానికి బాధ్యత, చిత్తశుద్ధి లేదని వ్యాఖ్యానించారు.

### కులగణనకు కేబినేట్ ఆమోదం

సమగ్ర కులగణన, ఎస్సీ వర్గీకరణ నివేదికలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా క్యాబినెట్ భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. ఈ రోజు దేశ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ నిర్ణయంతో ప్రధాని మీద ఒత్తిడి పెరుగుతుందన్నారు. అన్ని రాష్ట్రాల్లో కులగణన చేయాలనే డిమాండ్ రానుందన్నారు. భవిషత్తులో ఈ రోజు తాము ప్రవేశపెట్టే డాక్యుమెంట్ రిఫరెన్స్ తీసుకోవాల న్నారు. 2011 జనాభా లెక్కల తర్వాత మళ్లీ తామే చేశామన్నారు. 2014 లెక్కలు ఎక్కడ ఉన్నాయో చేసిన వాళ్లే చెప్పాలన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కులగణన చేయడం లేదన్నారు. కులగణన వల్ల 76 శాతం బీసీ, ఎస్సీ, మైనార్టీలకు న్యాయం జరుగుతుంద న్నారు. కులగణన చేసి చరిత్ర సృష్టించామ న్నారు. పకడ్బందీగా సర్వే చేసి సమాచారం సేకరించామని చెప్పారు. ప్రధాన ప్రతిపక్షానికి బాధ్యత లేదని ముఖ్యమంత్రి సీరియస్ అయ్యారు. బీఆర్‌ఎస్‌ను తాము పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. ప్రతిపక్ష నేత సభకు రావాలి కదా అని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల మీదా ఆయన రియాక్ట్ అయ్యారు. కోర్టు ఆదే శాలతో బీసీ రిజర్వేషన్లపై కమిషన్ వేశామ న్నారు. కోర్టు ఆదేశాల మేరకు కమిషన్ డెసిషన్ తీసుకుంటుందని పేర్కొన్నారు.

### కులగణన సర్వేలో పాల్గొనని ప్రతిపక్ష పార్టీ నేతలు

కులగణన, ఎస్సీ వర్గీకవరణపై తెలంగాణ అసెంబ్లీలో చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సామాజిక కులగణన సర్వేలో అనేక మంది ప్రముఖులు పాల్గొనలేదని అసెంబ్లీలో తెలిపారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకం ఇంటింటి సర్వే చేస్తే కొందరు ప్రముఖులు ఈ సర్వేలో పాల్గొనలే దన్నారు. సర్వేలో పాల్గొనని వారు ఎవరెవరో పేర్లతో సహా సభ ముందు పెట్టారు సీఎం. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు, మాజీ మంత్రులు కల్వకుంట్ల తారకరామారావు, తన్నీరు హరీష్ రావు, సికిం ద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివా సరెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ సర్వేలో పాల్గొనలేదని అన్నారు. ఇదే విషయంపై పలువురిని అడిగితే 'నువ్వు ఇచ్చిన సర్వేలో ఐదో పేజీలో భూమి వివరాలు అడిగాం. ఒక్క దెబ్బకు ఎవరూ సమాచారం ఇవ్వలేదు' అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మూడు కోట్ల 54 లక్షల మంది సర్వేలో పాల్గొంటే ఇక్కడున్న ఎమ్మెల్యేలు, మంత్రులంతా వివరాలు ఇచ్చారని తెలిపారు. కానీ భూముల వివరాలు అడిగినం



దుకే కొందరు సర్వేలో పాల్గొనకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇంత ముఖ్యమైన చర్చలో తప్పుడు నివేదకలు తీసుకు వచ్చి రచ్చ చేస్తున్నారని మండిపడ్డారు. మేము చెప్పిన ప్రకారం 15 శాతం ఓసీలు ఉంటే, ఓసీలు 21శాతం అంటూ తప్పుడు లెక్కలు చెబు తున్నారన్నారు. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం బీసీ జనాభా 51 శాతం అని.. మేం చేసిన సర్వే ప్రకారం బీసీ జనాభా 56 శాతంగా ఉందన్నారు. సర్వేపై అపోహలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. పాయల్ శంకర్ అపోహలు సృష్టించేలా మాట్లాడుతున్నారని వ్యాఖ్యలు చేశారు. 1930 నుంచి ప్రతీ పది సంవత్సరా లకు జనాభా లెక్కలు చేశారని తెలిపారు. 2014లో నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యత స్వీక రించక ఈరోజు వరకు జనాభా లెక్కలు చేయడం లేదని అన్నారు. బలహీన వర్గాలకు వారి హక్కులు ఇవ్వడం బీజేపీ ఇష్టం లేని కారణంగా జనాభా లెక్కలు చేయడం లేదని విమర్శించారు. స్వాతంత్య్ర వచ్చాక 70 సంవ త్సరాలు కొనసాగిన జనాభా లెక్కల పక్రియ మోదీ ప్రధాని అయ్యాక ఎందుకు జరగడం లేదని నిలదీశారు. 2024లో చేపట్టిన ఈ లెక్కలే.. అధికారిక లెక్కలని స్పష్టం చేశారు. ప్రభుత్వం అధికారికంగా సేకరిస్తున్న సమాచా రాన్ని ప్రజాప్రతినిధులుగా ఉండే పక్కదారి పట్టించి... వివరాలు ఇవ్వకుండా సభలో తప్పుడు లెక్కలు చూపుతున్నారని మండిపడ్డారు. సర్వలో పాల్గొనని ఎమ్మెల్యేలు సర్వేలో పాల్గొని వివరాలు ఇవ్వాలన్నారు. ఇన్ని సంవత్సరాలు ఆలస్యమైనప్పటికీ ఇప్పటికైనా బలహీన వర్గాల కోసం పనిచేద్దామని అన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## మా ఇంట్లో రేవంత్‌రెడ్డి ఫొటో లేదు

**ఇంకా కేసీఆర్ ఫొటోనే ఉంది**

**హైడ్రా తీరుపై మరోసారి మండిపడ్డ దానం నాగేందర్**

హైదరాబాద్ : ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రాపై పలు సందర్భాల్లో నోరువిప్పారు. హైడ్రా వల్ల పేదల జీవితాలు ఆగం అవుతు న్నాయని, పిల్లల పుస్తకాలు, సామగ్రి బయటపడేయడంతో బాధకలుగుతుందని అప్పట్లో ఆవేదన వ్యక్తం చేశారు. అయితే తాజాగా మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. "నేను పోలీసులతో, హైడ్రా విషయంలో కాంప్రమైజ్ అయ్యే ప్రసక్తే లేదు. మా ఏరియాకు వస్తే ఊరుకునేది లేదని రంగనాథ్‌కు చెప్పిన. పేదల ఇండ్లను కూలుస్తాం అంటే ఊరుకోను. అవసరమైతే జైలుకు పోతా కానీ కాంప్రమైజ్ కాను. నా ఇంట్లో వైఎస్, కేసీఆర్ ఫొటోలు ఉన్నాయి. రేవంత్ రెడ్డి ఫోటో ఇంకా రాలేదు" అంటూ దానం నాగేందర్ వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడీ వ్యాఖ్యలు సొంత పార్టీలో పెను సంచలనంగా మారాయి. అధికార పార్టీలో ఉండి ప్రభుత్వానికి వ్యతిరేకంగా దానం వ్యవహరిస్తున్న తీరుపై పార్టీ నేతలు కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే చింతల్ బస్తీ కూల్చివేతలకు సంబంధించి దానం వ్యవహారతీరును పరిశీలిస్తామని టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ తెలిపారు. తాజాగా మరోసారి అధికారులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలతో పాటు రేవంత్ రెడ్డి ఫోటో విషయంలో ఆయన తీరుపై కాంగ్రెస్ పెద్దల నుంచి రియాక్షన్ ఎలా ఉంటుందో చూడాలి. కాగా.. ఆపరేషన్ రోప్‌లో భాగంగా ఇటీవలకాలంలో చింతల్‌బస్తీలో అక్రమ నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు గుర్తించి కూల్చివేతలు చేపట్టారు. స్థానికుల సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న ఎమ్మెల్యే.. అధికారులపై విరుచుకుపడ్డారు. నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడి నుంచి ఇక్కడికి బతకాడానికి వచ్చి.. ఇక్కడే ఉన్న మమ్మల్ని బతకనివ్వరా అంటూ ప్రశ్నించారు. వెంటనే కూల్చివేతలను నిలిపివేయా లంటూ ఎమ్మెల్యే దానం నాగేందర్ హెచ్చరించడంతో అధికారులు అక్కడి నుంచి వెను దిరిగారు. కానీ దానం చేసిన మాస్ వార్నింగ్ సంచలనం రేపింది.

## కులగణన లెక్కలపై సమగ్ర చర్చ జరగాల్లి

**మండలిలో బిఆర్‌ఎస్ నేతలు కవిత, చారిల డిమాండ్**

**చర్చ అనంతరం మండలి నిరవధికంగా వాయిదా వేసిన గుత్తా**

హైదరాబాద్ :

తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం సందర్భంగా ఉభయ సభల్లో కులగణన , ఎస్సీ వర్గీకరణ అంశాలపై చర్చ జరిగింది. ఈ చర్చలో శాసనమండలిలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత, శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మాట్లాడారు. మధుసూదనాచారి మాట్లాడుతూ, కులగణన లెక్కలపై సమగ్ర చర్చ జరగా ల్సిన అవసరం ఉందని, తమకు ఈ విషయంలో తగిన అవకాశం ఇవ్వాలని కోరారు. ఆయన చెప్పిన ప్రకారం, ఈ డేటా వివరాలు ఇప్పటివరకు అందరికీ అందుబా టులో లేవని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో బీసీలకు అనేక హామీలు ఇచ్చి అధికారం లోకి వచ్చిందని, కానీ ప్రభుత్వం కొంత కాలయాపన చేశిందని విమర్శించారు. అటు, కోర్టు జోక్యం చేసుకున్న తర్వాత కులగణన జరగిందని ఆయన వెల్లడిరచారు. కులగణనపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారని, కానీ ప్రస్తుతం జరుగుతున్న సర్వేను కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు అభివర్ణించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుటుంబ సర్వే నిర్వహించినప్పుడు, దానికి విదేశాల్లోని తెలంగాణవారు కూడా పాల్గొన్నారని కవిత గుర్తుచే శారు. కానీ, ఇప్పుడు చేసిన సర్వేలో బీసీ జనాభా 20 లక్షల మేర తగ్గినట్లు ఆరోపించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆ డేటాను బయట పెట్టే అంశాన్ని ఆశించామని, కానీ అసెంబ్లీలో మంత్రి మాట్లాడుతూ, ఈ డేటాతో ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవాలని ఉద్దేశించింది అనే ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఏమీ ప్రకటించలేదని ఆమె వ్యాఖ్యానించారు. కవిత, బీసీలకు హామీలను పటిష్టంగా అమలు చేస్తారా అని ప్రశ్నించారు. ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం చెప్పినట్లు కులగణనలో ఓసీల జనాభా పెరిగిందని, మిగతా కులాల జనాభా ఎందుకు తగ్గిందని ప్రశ్నించారు. ఈ సందర్భంగా, కులగణనపై కొనసాగుతున్న చర్చలు, ప్రభుత్వం తీసుకునే చర్యలు ఇంకా స్పష్టతకు రాలేదు. అయితే.. ఈ క్రమంలోనే తెలంగాణ శాసనమండలిని మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నిరవధిక వాయిదా వేశారు.




# వికసిత భారత్ మా ధృడసంకల్పం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి4(నినాదం):**

**రాష్ట్రపతి ప్రసంగం 'వికసిత్ భారత్' లక్ష్యంపై దేశ దృఢసంకల్పాన్ని పున రుద్ఘాటించిందని ప్రధాని మోడీ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం తమలో ఆత్మవిశ్వాసం నింపిందని, మరోసారి తమ ప్రభుత్వాన్ని ఎన్నుకు న్నందుకు ప్రజలకు కృతజ్ఞతలని చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి పధ్నాలుగు సార్లు సమాధానం ఇచ్చే అదృష్టాన్ని దేశ ప్రజలు తనకు ఇచ్చారని, ఇందుకు తాను ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు.**

పార్లమెంటులో రాష్ట్రపతి చేసిన ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి లోక్‌సభలో ప్రధాని సమాధానమిస్తూ, 'మనం 2025లో ఉన్నారు. ఒకర కంగా 21వ శాతాబ్దంలో 25 శాతం ముగిసిపోయింది. 20వ శతాబ్దంలో స్వాతంత్య్ర తరువాత, 21వ శతాబ్దంలో 25 ఏళ్లలో ఏం జరిగిందనేది కాలమే చెబుతుంది. రాష్ట్రపతి ప్రసంగాన్ని జాగ్రత్తగా గమనిస్తే, రాబోయే 25 ఏళ్లలో, వికసిత్ భారత్ దిశగా ప్రజల్లో విశ్వాసం పాదుకొలపే దిశగా పనిచేయనున్నాం. వికసిత్ భారత్ లక్ష్యాన్ని రాష్ట్రపతి ప్రసంగం ప్రతిబింబించింది. సరికొత్త ధీమాను కల్పిస్తూ, సామాన్య ప్రజానీకానికి స్ఫూర్తిగా నిలిచిందని మోదీ అన్నారు. 'గరీబీ హటోవా' నినాదంపై మాట్లాడుతూ. ప్రభుత్వం తప్పుడు హామీలు ఇవ్వదని, ప్రజలకు నిజమైన అభివృద్ధిని అందిస్తుందని ప్రధాని అన్నారు. ఇంతవరకూ పేదలుకు 4 లక్షల గృహాలు ఇచ్చామని, గతంలో మహిళలు బహిర్భూమి సిస్టమ్ లేక అవస్థలు పడవారని, ఎవరైతే అన్ని సౌకర్యాలు ఉన్నారో వారికి ఇలాంటి అవసరాలు అర్థం కావని పరోక్షంగా ప్రతిపక్ష కాంగ్రెస్‌కు చురకలు వేశారు. పేదల కోసం 12 కోట్లకు పైగా మరుగుదొడ్లు నిర్మించామని అన్నారు. గత ఐదు దశాబ్దాలుగా 2కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని చెప్పారు. అంకితభావంతో పథకాలు అమలు చేసినప్పుడే ఇలాంటి మార్పు సంభవమని అన్నారు. పేదల గురించి ఉత్తుత్తి హామీలు తాము ఇవ్వమని, అభివృద్ధి చేసి చూపిస్తామని చెప్పారు. పేదలు, సామాన్య ప్రజలు, మధ్యతరగతి సవాళ్లను అవగాహన చేసుకుని, వాటిని అధిగమించేలా చేసేందుకు కట్టుబడి ఉంటామని చెప్పారు.

'ప్రజల సొమ్ము ప్రజల చేతికే' అనేది మా నినాదం. డిజిటల్ సాంకేతికత ద్వారా పారదర్శకత పెంచాం. పది కోట్ల నకిలీ ఖాతాలను గుర్తించి తొలగించాం. ఇథనాల్ బ్లెండిరగ్ ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేశాం. గతంలో తరచూ రూ.లక్షల కోట్ల అవినీతిపై రోజూ వార్తలు వచ్చేవి. గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలే లేవు. మా హయాంలో మౌలిక వసతుల కల్పనపై భారీగా వెచ్చించాం. కేంద్రంలో పదేళ్లుగా అవినీతి లేకపోవడంతో జనం లాభపడ్డారు. ఆయుష్మాన్ భారత్, జన్ ఔషధి కేంద్రాల ఏర్పాటుతో రోగులకు ఎంతో మేలు జరిగిం



దన్నారు. మా హయాంలో ప్రతి రూపాయిని ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నాం. ప్రజల డబ్బును మేం అద్దాల మేడలు నిర్మించడానికి ఉపయో గించలేదు.. దేశాభివృద్ధికి వినియోగించాం. ప్రపంచ గేమింగ్ రాజధా నిగా భారత్ తయారవుతోంది. మే అధికారంలోకి రాకముందు ఎల్‌ఈడీ బల్బు ధర రూ.400 ఉండేది. మా ప్రభుత్వం రాగానే ఎల్‌ఈడీ బల్బును రూ.40కే పంపిణీ చేశాం. దీని ద్వారా దేశ ప్రజలకు రూ.20వేల కోట్లు ఆదా అయింది. మా పాలన బాగుండటం వల్లే మళ్లీ గెలుస్తున్నాం. హరి యాణాలో మూడోసారి అధికారంలోకి వచ్చాం. మహారాష్ట్రలోనూ తిరిగి అధికారంలోకి వచ్చాం'అని ప్రధాని వివరించారు. అలాగే ప్రధాని తన ప్రసంగంలో రాహుల్ గాంధీ, కేజీవ్రాల్‌పై పరోక్ష విమర్శలు గుప్పించారు. రాష్ట్రపతి ప్రసంగం బోరింగ్‌గా ఉందంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను పరోక్షను ప్రస్తావిస్తూ, పేదల గుడిసెల్లో ఫోటో సెషన్లతో సరదాగా గడిపేవారికి పార్లమెంటులో పేదల గురించి మాట్లాడుతూ చేసే ప్రసంగాలు బోర్‌గానే ఉంటాయని అన్నారు.

కొందరు నాయకులు విలాసవంతమైన షవర్లు కోరుకుంటా రని, తమ ప్రభుత్వం మాత్రం ప్రతి ఇంటికి నీళ్లు ఇవ్వడంపై దృష్టిసారి స్తుందని కేజీవ్రాల్ విలాసవంతమైన శీష్ మహల్ పై పరోక్ష విమర్శలు గుప్పించారు. ఢల్లీనుంచి రూపాయి పంపితే గ్రామలకు 16 పైసలే చేరు తోందని గతంలో ఒక ప్రధాని వాపోయారని, ఢల్లీనుంచి గల్లీ వరకూ అప్పట్లో అదే పరిస్థితి ఉండేదని ప్రధాని అన్నారు. అయితే ఇప్పుడు ఢల్లీ నుంచి రూపాయి పంపితే గ్రామానికి రూపాయి అందుతోందని, నగదు బదిలీతో నేరుగా ప్రజలకే సొమ్ము అందుతోందని వివరించారు. ప్రధాని ప్రసంగిస్తున్నంత సేపు అధికారపక్షం సభ్యులు చప్పట్లతో అభినందించారు.



## వివరణ ఇవ్వండి..

అయినప్పటికీ ఎలాంటి పురోగతి లేకపోవడంతో బీఆర్‌ఎస్ పార్టీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిపై అనర్హత వేటు వేయాలంటూ ఇప్పటికే బీఆర్‌ఎస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ వేసింది. ఎమ్మెల్యేలపై నాలుగు నెలల్లో చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ ఈ వ్యవహారం ముందుకు జరగ లేదు. దీంతో బీఆర్‌ఎస్ పార్టీ సుప్రీంలో పిటిషన్ వేసింది. మొదట తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని బీఆర్‌ఎస్ పిటిషన్ వేసింది. ఆ తరువాత మరొక ఏడుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని సుప్రీంకోర్టును ఆశ్రయించింది బీఆర్‌ఎస్. అయితే వీటన్నింటినీ కలిపి ఒకేసారి విచారణ చేస్తామంటూ.. ఈ కేసు విచారణను సుప్రీం కోర్టు ఈనెల 10కి వాయిదా వేసింది. ఓ వైపు కోర్టులో విచారణ జరుగుతుండగానే.. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కూడా కోరింది బీఆర్‌ఎస్. దీనిపై స్పందించిన స్పీకర్.. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చారు. లిఖితపూర్వకంగా సమాధానాలు చెప్పాలంటూ నోటీసుల్లో పేర్కొన్నారు.

## టీజీపీఎస్సీ గ్రూప్-1 ఫలితాలకు లైన్ క్లియర్

దీంతో గ్రూప్ 1 ఫలితాల విడుదలకు అన్ని అడ్డంకులు తొలగినట్లైంది. తెలంగాణ రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఐసెట్ 2025 నోటిఫికేషన్ మార్చి 6న విడుదల కానుంది. ఈ మేరకు ఉన్నత విద్యా మండలి వెల్లడిరచింది. నోటిఫికే షన్ విడుదల తర్వాత మార్చి 10 నుంచి దరఖాస్తులు స్వీకరన చేపడతారు. టీజీ ఐసెట్ సెట్ కమిటీ సమావేశాన్ని సోమవారం మాసాబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో నిర్వహించగా.. ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఐసెట్‌కు మే 3 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇక ఐసెట్ పరీక్షలు జూన్ 8, 9 తేదీల్లో ఆన్‌లైన్‌లో జరగనున్నాయి. 2025-26 విద్యా సంవత్సరానికి ఎంఈ, ఎంటెక్, ఎం ఫార్మసీ వంటి పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్ పీజీఈ సెట్ నోటిఫికేషన్ మార్చి 12న విడుదల చేసేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తుంది. మార్చి 17నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం అవుతాయి. సోమవారం కూకట్‌పల్లిలోని జేఎన్టీయూలో నిర్వహించిన సెట్ కమిటీ సమావేశంలో ఈ మేరకు షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా పీజీఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఏ అరుణకుమారి, కో కన్వీనర్ ప్రొఫెసర్ బీ రవీంద్రారెడ్డి పీజీఈసెట్ షెడ్యూల్‌ను విడుదల చేశారు.



## నేడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు

ఢిల్లీలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని మొత్తం 1.56 కోట్ల మంది ఓటర్లు బుధవారం తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఢల్లీలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని మొత్తం 1.56 కోట్ల మంది ఓటర్లు రేపు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఫిబ్రవరి 8న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడిరచనున్నారు. మొత్తం ఎన్నికల పక్రియ ఫిబ్రవరి 10 తో ముగియనుంది. ఢల్లీలోని 70 నియోజకవర్గాల్లో 58 జనరల్ సీట్లు కాగా.. మరో 12 ఎస్సీ రిజర్వ్‌డ్ సీట్లు. మొత్తం 1.56 కోట్ల మంది ఓటర్లలో 83.49 లక్షల మంది పురుష ఓటర్లు కాగా.. 71.74 లక్షల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వారిలో 20 నుంచి 29 ఏళ్ల వయస్సు గల యువ ఓటర్ల సంఖ్య 25.89 లక్షలుగా ఉంది. 18 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల తొలిసారి ఓటేసే వారి సంఖ్య 2.08 లక్షలు. ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక అవసరాలు ఉన్న వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు ప్రకటించారు. పీడబ్ల్యూడీ వర్గం నుంచి 79,430 మంది ఓటర్లు ఉన్నారు. ఇక 100 సంవత్సరాలు దాటిన ఓటర్ల సంఖ్య 830 గా ఉంది. 85 ఏళ్ల వయస్సు దాటిన ఓటర్లు 1.09 లక్షల మంది ఉన్నారు. ఢల్లీలో ట్రాన్స్‌జెండర్ ఓటర్ల సంఖ్య 1,261 గా ఉంది. ఈ ఎన్నికల్లో మరోమారు అధికారం దక్కించుకుని హ్యాట్రిక్ కొట్టాలని ఆప్ భావిస్తోంది. బిజెపి దీటుగా ప్రచారం నిర్వహించింది. కాంగ్రెస్ కూడా ఒంటరి పోరాటం చేస్తోంది. తృణమూల్, సమాజ్‌వాది పార్టీలు ఆప్‌కు మద్దతుగా నిలిచాయి.

## నేనే మిమ్ములను కలుసుకుంటా

**హైదరాబాద్, నినాదం:**

తనపై అభిమానులు చూపిస్తున్న ప్రేమకు ఎన్టీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. తనను కలుసుకోవడానికి పాదయాత్రల్లాంటివి చేయొద్దని వారికి విజ్ఞప్తి చేశారు. వారి ఆనందమే కాదు సంక్షేమం కూడా తనకు ముఖ్యమన్నారు. తనను కలుసుకోవాలని ఎదురుచూస్తున్న అభిమానుల ఆసక్తిని అర్థం చేసుకుని.. త్వరలో వారి కోసం ఓ సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.ఆ సమావేశానికి సంబంధించి పోలీసుల అనుమతి, అధికారులతో సమన్వయం, శాంతి భద్రతల సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇందుకు కొంత సమయం పడుతుందని, అప్పటి వరకు అభిమానులు ఓపికగా ఉండాలని ఎన్టీఆర్ కోరారు. సంబంధిత స్టేట్‌మెంట్‌ను ఎన్టీఆర్ టీమ్ విడుదల చేసింది. కుప్పం నుంచి పాదయాత్ర చేసి హైదరాబాద్‌లో పలువురు ఫ్యాన్స్ ఎన్టీఆర్‌ను ఇటీవల కలిసిన సంగతి తెలిసిందే. సినిమాల విషయానికొస్తే.. 'దేవర'తో గతేడాది విజయాన్ని అందుకున్న ఎన్టీఆర్ ప్రస్తుతం 'వార్ 2'తో బిజీగా ఉన్నారు. ఇందులో హృతిక్ రోషన్ మరో హీరో. 'కేజీయఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్‌తో ఎన్టీఆర్ ఇప్పటికే ఓ సినిమా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ యాక్షన్ మూవీకి 'ఎంటర్ ది డ్రాగన్', 'ఎన్టీఆర్ ది డ్రాగన్' లాంటి పేర్లను టైటిల్‌గా పెట్టే ఆలోచనలో చిత్ర బృందం ఉందని ఇటీవల వార్తలొచ్చాయి. ఇందులో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా ఎంపికైనట్టు సమాచారం. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ సినిమాని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## ఉపాధిహామీలో 1.55 కోట్ల మంది కార్మికుల తొలగింపు

**న్యూఢిల్లీ, నినాదం:**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉన్న వారిలో 2022-24 మధ్యకాలంలో 1.55 కోట్ల మంది కార్మికుల పేర్లను తొలగించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడిరచింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయమంత్రి కమలేశ్ పాసవాన్ లోక్‌సభలో ఈ విషయాన్ని వెల్లడిరచారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 86,17,887 మంది, 2023-24లో 68,86,532 మంది కార్మికుల పేర్లను తొలగిం చినట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. రెండేళ్లలో మొత్తంగా 1,55,04,419 మంది కార్మికుల పేర్లను తొలగించామన్నారు. నకిలీ, తప్పుడు జాబ్ కార్డులు, గ్రామాల నుంచి కార్మికుల కుటుంబాలు తరలిపోవడం లేదా సంబంధిత గ్రామాలను పట్టణా లుగా వర్గీకరించడం తదితర అంశాలు ఇందుకు కారణంగా చెప్పారు.

# డీలర్లకు దొడ్డురకం... సొసైటీలకు సన్నరకం?

## అధిక ధరలకు అమ్మకాలు ▪ చోద్యం చూస్తున్న అధికారులు

**కోదాడ, ఫిబ్రవరి 4 (నినాదం):**

రబీ సీజన్ లో వ్యవసాయ సాగుముమ్మరంగా సాగుతుంది. ప్రస్తుతం పంటలకు అవసరమైన యూరియా రైతులకు అందుబాటులో ఉంచి నాణ్యత విషయంలో 'మాయ' చేస్తున్నారు. తక్కువ నాణ్యత గల యూరియాను సొసైటీలకు అంటగట్టి నాణ్యతగల యూరియాను డీలర్లకు ఇవ్వడంలో మాయాజాలం నెలకొంది. కంపెనీలు, అధికారులు, డీలర్లు కుమ్మక్కై నాణ్యతగల యూరియాను బ్లాక్ మార్కెట్కు తరలించి భవిష్యత్తులో సొమ్ము చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యూరియా మాయ కొన్నేండ్లుగా సాగుతున్నా అధికారులు చోద్యం చూడడం వెనుక అనుమానాలు కలిగిస్తున్నాయి.యూరియాలో సగం మార్క్ ఫైడ్ కు కేటాయించగా సగం డీలర్లకు కేటాయిస్తారు.ఉమ్మడి నల్లగొండ జిల్లా మార్క్ఫెడుకుకు ఇప్పటివరకు 31,342.635 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. ఇది సగం మాత్రమే మిగిలిన సగం. అంటే 31.342,685 మెట్రిక్ టన్నులు డీలర్లకు వచ్చింది. ఇందులో నల్లగొండ జిల్లాలో 10691.28 మెట్రిక్ టన్నులు, సూర్యాపేట జిల్లాకు 12.456,855 మెట్రిక్ టన్నులు, యాదాద్రి భువనగిరి జిల్లాకు 5,467,28 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది.

### అందుబాటులో యూరియా...

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో యూరియా అందుబాటులో ఉంది..ఇందులో అన్ని రకాల కంపెనీల యూరియా ఉంది..నల్లగొండ జిల్లాలో '70వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటివరకు 60వేల మెట్రిక్ టన్నులు వచ్చింది. ఇందులో డీలర్లకు, పీఏసీఎస్ సొసైటీలకు, ఎస్డీసీఎంఎస్ సొసైటీ, ఏఆర్ఎస్కెఎల్కు చెందిన 129 సొసైటీలకు 45వేల మెట్రిక్ టన్నులు అందచేశారు. ఇంకా 15వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉండగా 10వేల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉంది. సూర్యాపేట జిల్లాలో60వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ఇప్పటి వరకు 50వేల మెట్రిక్ టన్నులు వచ్చింది. ఇందులో 68 సొసైటీలకు 33వేల మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణి చేయగా ఇంకా 17వేల మెట్రిక్ టన్నులు మిగిలి ఉంది. ఇంకా 10వేల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో 25,282 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా 18540 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. ఇందులో 9049 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు విక్రయించారు. ఇంకా 9,491 మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సింది.




### అధిక ధరలకు విక్రయాలు - పట్టించుకోని అధికారులు...

యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నా అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దొడ్డురకం యూరియాను సరఫరా చేసే కోరమండల్, ఐపీఎల్, విస్కో, క్రిస్కో లాంటి యూరియాను డీలర్లకు అందిస్తున్నారు. ఆ యూరియా బస్తా ధర రూ.266 ఉండగా రూ.330 వరకు కిందిస్థాయి గ్రామీణ సబీలర్లకు విక్రయిస్తున్నారు. వారు అదనంగా రూ.30 కలిపి రూ.336కు తగ్గకుండా విక్రయిస్తున్నారు. దీంతో ఒక్క బస్తాకు రూ.100 పెంచి విక్రయిస్తున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ఫర్టిలైజర్ షాపులలో అధిక ధరలకు యూరియా అమ్ముతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. ఎమ్మార్పీ కంటే అదనంగా పెంచి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటనలకే పరిమితం అయ్యారు. డీలర్ల వద్ద కొనుగోలు చేస్తే ఎలాంటి రశీదులు కూడా ఇవ్వడం లేదు.కనీసం బిల్ బుక్కుల్లో నమోదు చేయడం లేదు. దీని ద్వారా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఆధారాలు దొరకకుండా జాగ్రత్తలు పడుతున్నారు. దీంతో ఎమ్మార్పీ ధరలకే యూరియాను విక్రయిస్తున్నారని నివేదికను ఉన్నతాధికారులకు అందజేయటంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్పీక్. ఆర్ఎఫ్సీఎల్ రామగుండం, క్రిస్కో, ఐపీఎల్, పీపీఎల్ లాంటి కంపెనీల సన్నరకం యూరియాను సొసైటీలకు అందజేస్తున్నారు. ఆ సొసైటీల ద్వారా రైతులకు బలవంతంగా అంటగడుతున్నారు. కోదాడ డివిజన్లో సొసైటీలకు దొడ్డు రకం యూరియాను సరఫరా చేయాలని ఎమ్మెల్యే ఆదేశించినా కొంతమేరకు మాత్రమే దొడ్డురకం యూరియాను సొసైటీలకు అందజేశారు. ఎక్కువ మొత్తం సన్నరకం యూరియానే సొసైటీల ద్వారారైతులకు అంటగడుతున్నారు.

### అలాంటిదేమీ లేదు : శ్రవణ్ కుమార్,జిల్లా వ్యవసాయాధికారి...

యూరియా కేటాయింపు విషయంలో ఎలాంటి తేడాలను చూపించడం లేదు. దొడ్డురకం, సన్నరకం యూరియాలో ఒకేరకంగా 46 శాతం నైట్రోజన్ ఉంటుంది.
ఏ రకం యూరి యాను వాడినా ఫలితం ఒకే రకంగా ఉంటుం ది. డీలర్లకు దొడ్డురకం యూరియా ఇవ్వడం అవాస్తవం. డీలర్లు యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. విక్రయించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటాం.

# భూమి లేని రైతులకు ఋణమాఫీ అవకాశం కల్పించాలి



**నర్సంపేట, ఫిబ్రవరి 4(నినాదం):**

భూమి లేని రైతులను గుర్తించి వారికి రుణమాఫీ అవకాశం కల్పించాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సలీంకి మంగళవారం ద్వార జిల్లా కలెక్టర్ వినతి పత్రం అందించారు. అనంతరం ప్రజాసంఘాల నాయకులు బట్టు సాంబయ్య, బొట్ల నరేష్ లు మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలలో పట్టా పాస్ బుక్ ద్వారా వివిధ బ్యాంకులో క్రాఫ్ట్ లోన్ పొంది రైతులు ఇటీవల కాలంలో అనారోగ్య సమస్య, రైతుల కూతుర్ల వివాహం అవసరం నిమిత్తం, ఇతర కారణాలతో భూమి అమ్ముకొనడం జరిగిందన్నారు. ప్రభుత్వం కల్పించిన రెండు లక్షల రుణమాఫీ ప్రక్రియలో రెండు లక్షల లోపల ఉన్న భూమిలేని నిరుపేద రైతులను గుర్తించి వారికి రుణమాఫీ చేసి వారి కుటుంబాలను ఆదుకోవాల్సిందిగా తాసిల్దార్ ద్వారా జిల్లా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో కొయ్యడ కుమార్ స్వామి, బొట్ల సాంబయ్య, బొట్ల నరేష్, రవి, సుధాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రెండవరోజు ఉత్సాహంగా పోలీస్ క్రీడలు



**భూపాలపల్లి, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్):**

జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ స్టేడియంలో జరుగుతున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు, పోలీసు క్రీడలు రెండవ రోజు అయినా మంగళవారం ఉత్కంఠ గా ఉత్సాహంగా జరిగాయి. మంగళవారం జ్యుడిషరి వర్సెస్ జెన్కో కు జరిగిన క్రికెట్ మ్యాచ్ లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నారాయణ బాబు, ఎస్పి కిరణ్ ఖరే, జెన్కో చీఫ్ ఇంజనీర్ Ch.ప్రకాశ్, న్యాయ మూర్తులు, జయరాం రెడ్డి, రామ చంద్ర రావు, అఖిల, పాల్గొని ఆటగాళ్లను ఉత్సాహపరిచారు.

**IN THE COURT OF THE HON'BLE VII ADDL. SENIOR CIVIL JUDGE: CITY CIVIL COURT: AT HYDERABAD.**
E.P.No. 66 OF 2016
in
O.S.No. 636 OF 2009
**Between:-**
M/s.Margadarsi Chit Fund P Limited ...Decree Holder
AND
Mr.A.Laxman & Others.. ....Judgment Debtors
To
Mr.S.R.Jaisimha, S/o. S.Ramulu, R/o. H.No.2-2-1146/30, New Nallakunta, Tilak Nagar, Hyderabad.
JDR.No.3
**TO WHOMSOEVER IT MAY BE CONCERN**
In the above mentioned E.P., the below mentioned property is brought for Sale to realize the Decree Debt of Rs.7,41,143/- Auction is going to be held on 17/02/2025 at Court premises at 10.30 A.M., Therefore, whoever is interested in purchasing the property can attend and participate in bid which is opened to one and all.
**SCHEDULE OF PROPERTY BELONGING TO JDR.No.3 Mr.SILIVERU JAISIMHA REGISTERED VIDE PARTITION DEED No. 1550/2008, Dt:24.04.2008.**
All that the Northern side portion premises No.2-2-1146/30, admeasuring 45.33 Sq. Yds with a plinth area of 408 Sq.Ft., marked with Red Colour/AC sheet Roof Situated at New Nallakunta, Hyderabad and within the following boundaries:-
North Other Portion of 2-2-1146/30
South Road, East : Neighbour's
West Neighbour's
The terms and conditions of the sale may be ascertained from the Bailiff of the said Court.
**(BY ORDER OF THE COURT)**
**R.CHAKRADHAR, ADVOCATE,**
**H.No.6-1-295/1, PADMARAO NAGAR, HYDERABAD.**

**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: R.R.DIST**
**S.O.P. No; 32 OF 2024**
**Between;**
DUDDU RAVINDER VIKAS ...Petitioner
AND
M/S MORGAN STANLEY AND OTHERS ...Respondents
To,
ALL CONCERNED
Defendant no;3
Sir/s,
Please take notice that the petitioner have filed the above case for succession OP of Late.S.Saritha W/O D.R.Vikas D/O S.Satyanarayana who died on 26-5-2024 and the Honorable Court has posted the above O.P to 12-2-2025. If any person/s has any objection for granting such relief may appear before the said court at 10:30A.M., either in person or through an Advocate, and put forth their objections, if any failing which the matter will be decided in your absence, as per law.
**//BY ORDER OF THE COURT//**
Sd/-
D.R.VISHAL
ADVOCATE
H.No:3-5-179/A,
LAXMINAGAR, PICKET,
SECUNDERABAD-26
MOB NO: 9000345143

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda
**ఫిల్మ్‌నగర్ బ్రాంచ్**
డోర్ నెం. ఎ-33, ఫిల్మ్‌నగర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500096,
ఫోన్ నెం. 040-23551464, ఇ-మెయిల్: vjjubi@bankofbaroda.co.in

**సంక్షిప్త వాహన ఇ-వేలము ప్రకటన**
దిగువ తెలియజేయబడిన రుణగ్రహీతల వైఫల్యము కారణముగా పార్టీలచే అమలు చేయబడిన కుదువ ఒప్పందం ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ, దిగువ తెలియజేసిన కుదువ పెట్టబడిన మోటార్ వాహనమును బ్యాంక్ వారు తిరిగి స్వాధీనము చేసుకోవడమైనది/జప్తు చేయడమైనది మరియు అట్టి వాహనమును "ఏది ఎక్కడ ఏలా ఉన్నదో అది అక్కడ అలా" మరియు "ఏది ఏలా ఉన్నదో అది అలా" ప్రాతిపదికన వేలము వేయబడును.

| క్ర. సం. | రుణగ్రహీత పేరు & చిరునామా/రుణ ఖాతా నెం. | మొత్తం బకాయి | వాహనము వివరణ | రిజర్వు ధర | బయానా |
|---|---|---|---|---|---|
| 1. | శ్రీ గుండా రాజేష్ తండ్రి గుండా నర్సింహులు, ఇం.నెం. 16-110/ఎ/1, వాసవి కాలనీ, రామాంతాపూర్, అంబర్‌పేట్, హైదరాబాద్-500013. ఖాతా నెం. 75780600000443 | మొత్తం బకాయిలు: రూ. 13,50,000/- + వడ్డీ + ఇతర అనుషంగిక ఖర్చులు వగైరా (రికవరీ ఏవైన ఉంటే అది తీసివేయగా) | Reg. No. TS 08 HD 6655 Chassis No. MALC841FLLM220519C Engine No. D4FALM999575 Vehicle Details: HYUNDAI VERNA DSL 1.5 SX(O) FIERY RED | రూ. 6,50,000/- (రూపాయలు ఆరు లక్షల యాభై వేలు మాత్రమే) | రూ. 65,000/- (రూపాయలు అరవై ఐదు వేలు మాత్రమే) |
| | | | | కనీస బిడ్డు పెంపుదల మొత్తం: రూ. 5,000/- (రూపాయలు ఐదు వేలు మాత్రమే) | |

ఖాతా పేరు: న్యూ ఇంటర్మీడియటరీ అకౌంట్, ఖాతా నెం. 75780015181219, IFSC కోడ్ BARB0VJJUBI, బ్యాంక్ & బ్రాంచ్ పేరు: బ్యాంక్ ఆఫ్ బరోడా, ఫిల్మ్‌నగర్ బ్రాంచ్.
ఆన్‌లైన్ విధానం ద్వారా వాహనము వేలము: https://bob.auctiontiger.net/ఇ-వేలము తేది/రోజు/సమయం: 07.03.2025, శుక్రవారము మ. 02.00 గం.ల నుండి సా. 04.00 గం.ల వరకు, బిడ్ దాఖలు కొరకు ఆఖరి తేది: 06.03.2025, గురువారము సా. 04.00 గం.లలోగా, ఔత్సాహిక కొనుగోలుదారులు/బిడ్డర్లు వాహనమును తేది: 05.03.2025, బుధవారము ఉ. 10.00 గం.ల నుండి సా. 05.00 గం.లలోగా (శ్రీ సాయి రాం పార్కింగ్, హస్తినాపురం, నాగార్జున సాగర్ రోడ్డు, హైదరాబాద్, ఫోన్ నెం. 7989276446 పార్కింగ్ యార్డు వద్ద తనిఖీ చేసుకొనవచ్చును). ఆన్‌లైన్ వేలం ప్రాసెస్ కొరకు అధీకృత అధికారి, ఫోన్ నెం. +91 8367788240 వారిని సంప్రదించవలెను.
**ఇ-వేలము అమ్మకము యొక్క నియమనిబంధనలు:**
1) ఎటువంటి కారణము తెలపకుండా అన్ని లేదా కొన్ని ఆఫర్(లు) లేదా బిడ్(లు)లను స్వీకరించవచుటకు లేదా తిరస్కరించుటకు బ్యాంక్ ఆఫ్ బరోడా వారికి పూర్తి హక్కులు కలవు. 2) ఎటువంటి కారణము తెలపకుండా ఇ-వేలమును నిర్వహించటకు/వాయిదావేయుటకు/రద్దుచేయుటకు బ్యాంక్ ఆఫ్ బరోడా వారికి పూర్తి హక్కులు కలవు. 3) అధీకృత అధికారి తెలిపిన సమాచారం మేరకు వాహనముపై ఎటువంటి ఇతర భారములు లేవు అయినప్పటికీ ఔత్సాహిక బిడ్డర్లు వాహనముపై తాకట్టు రుణములు, టైటిల్‌కు సంబంధించి వారంతటా వారే క్షుణ్ణంగా విచారించుకొని & తనిఖీ చేసుకొని & తృప్తి చెందవలెను (వివరణాత్మక నియమనిబంధనల కొరకు https://bob.auctiontiger.net కు రిఫర్ చేయవలెను).
తేది: 05.02.2025, ప్రదేశం: హైదరాబాద్ — సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

**శేషాద్రి ఇండస్ట్రీస్ లిమిటెడ్** CIN: L17291TG2009PLC064849
నమోదిత కార్యాలయం : 6వ అంతస్తు, సూర్యా టవర్స్, 105, ఎస్.పి. రోడ్, సికింద్రాబాద్- 500003, ఫోన్ నెం.91-40-27843333, వెబ్‌సైట్ : www.sheshadri.in, ఇ-మెయిల్ ఐడి : info@sheshadri.in
**31.12.2024 నాటికి త్రైమాసికపు మరియు తొమ్మిది నెలల ముగింపు కొరకు ఆడిట్ కాని ఆర్థిక ఫలితాల స్టేట్‌మెంట్ నమూనా** రూ.లక్షలలో

| వివరములు | త్రైమాసికపు ముగింపు | | | తొమ్మిది నెలల ముగింపు | | సం॥ ముగింపు |
|---|---|---|---|---|---|---|
| | 31-12-2024 (ఆడిట్ కానివి) | 30-09-2024 (ఆడిట్ కానివి) | 31-12-2023 (ఆడిట్ కానివి) | 31-12-2024 (ఆడిట్ కానివి) | 31-12-2023 (ఆడిట్ కానివి) | 31-03-2024 (ఆడిట్ అయినవి) |
| ఆపరేషన్స్ నుండి మొత్తం ఆదాయం (నికరం) | 873.69 | 1,001.79 | 406.19 | 2,557.45 | 1,942.23 | 2,877.05 |
| నికర లాభము/ (నష్టం) ప్రస్తుత కాలమునకు (పన్నుకు పూర్వము మినహాయించబడిన మరియు/ లేదా అసాధారణ ఐటమ్స్) | 160.11 | 122.74 | (192.83) | 223.91 | (403.13) | (378.42) |
| నికర లాభము/ (నష్టం) ప్రస్తుత కాలమునకు పన్నుకు పూర్వము (మినహాయింపు మరియు / లేదా అసాధారణ ఐటమ్స్ తరువాత) | 160.11 | 122.74 | (179.40) | 223.91 | (219.84) | (237.02) |
| నికర లాభము/(నష్టం) ప్రస్తుత కాలమునకు పన్నుల తరువాత (మినహాయింపు మరియు / లేదా అసాధారణ ఐటమ్స్ తరువాత) | 160.11 | 122.74 | (179.40) | 223.91 | (219.84) | (252.90) |
| ప్రస్తుత కాలమునకు మొత్తం సమగ్ర ఆదాయము (లాభం/ (నష్టం) కలిగియున్నది ప్రస్తుత కాలమునకు (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత)) | 160.11 | 122.74 | (179.40) | 223.91 | (219.84) | (252.90) |
| ఈక్విటీ షేర్ క్యాపిటల్ | 495.96 | 495.96 | 495.96 | 495.96 | 495.96 | 495.96 |
| రిజర్వులు (క్రితం సంవత్సరం బ్యాలెన్స్ షీట్‌లో చూపినట్లుగా రిజర్వు రీవాల్యుయేషన్ మినహాయించి) | | | | | | |
| ఒక్కొక్క షేర్‌కు ఆదాయములు (వార్షికం కానిది) | | | | | | |
| బేసిక్ (రూ.లలో) : | 3.23 | 2.47 | (3.62) | 4.51 | (4.43) | (5.10) |
| డైల్యూటెడ్ (రూ.లలో) : | 3.23 | 2.47 | (3.62) | 1.29 | (0.82) | (5.10) |

**గమనిక :** పైన తెలిపిన విధంగా త్రైమాసికపు ముగింపు ఆర్థిక ఫలితాల వివరణాత్మక నమూనాను సెబి (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015లోని రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్‌ఎక్స్ఛేంజ్‌లో దాఖలు చేసినారు. ఆడిట్‌కానీ త్రైమాసికపు ఆర్థిక ఫలితాల పూర్తి నమూనా కంపెనీ వెబ్‌సైట్ (www.sheshadri.in) మరియు స్టాక్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్ అనగా (www.bseindia.com) వద్ద కూడా లభించును.
బోర్డు డైరెక్టర్ల తరపున మరియు కొరకు
శేషాద్రి ఇండస్ట్రీస్ లిమిటెడ్
జితేందర్ కుమార్ అగర్వాల్
మేనేజింగ్ డైరెక్టర్
(DIN: 00041946)
ప్రదేశం: హైదరాబాద్
తేది: 04.02.2025

# బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో చట్టం చేయాలి

- డెడికేటెడ్ కమిషన్ రిపోర్ట్ పై మేధావులతో మీటింగ్ జరపాలి
- కులగణనపై ప్రభుత్వం తొందరపాటు చర్యలొద్దు
- సర్వే లెక్కలను ప్రజలకు బహిర్గతం చేయాలి : బీసీ రిజర్వేషన్లు పెంచాలి
- బీసీ సంఘం రాష్ట్ర నాయకులు సిరికొండ శ్రీనివాస్ ప్రజాపతి

**కోదాడ, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్):**



బీసీ రిజర్వేషన్లను పెంచేందుకు తమిళనాడు తరహాలో ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి తీర్మానం కాకుండా చట్టంచేసి కేంద్ర ప్రభుత్వానికి, పార్లమెంటుకు నివేదించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు సిరికొండ శ్రీనివాస్ ప్రజాపతి డిమాండ్ చేశారు. బీసీ కుల గణన సర్వేపై కోదాడ పట్టణంలోని త్రివేణి డిగ్రీ కళాశాల ఆవరణలో బీసీ నాయకులతో కలిసి సమా వేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభు త్వం సేకరించిన కులగణన లెక్కలను తక్షణమే ప్రజల ముందు బహిర్గతం చేయాలని సూచించారు. కుల గణన లెక్కలపై బీసీ సంఘాలు, మేధావులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మంత్రివర్గ ఉప సంఘం అంటూ హడావిడి చేస్తూ గందరగోళ స్థితిలో నిర్ణయాలు తీసుకోవ ద్దని, ఎలాంటి న్యాయపరమైన చిక్కులు రాకుండా చట్టపరమైన అవరోధాలు తలెత్తకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. పార్లమెంటుకు నివే దించే బీసీ కులగ ణన జనాభా లెక్కలు శాస్త్రీయ బద్ధంగా, న్యాయబద్ధంగా శాసన ప్రక్రియ ద్వారా పకడ్బందీగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కులగణనపై మంత్రివర్గ ఉప సంఘం ఇప్పటివరకు ఎవరితోనూ చర్చిం చలేదని, బీసీ సంఘాలు, బీసీ మేధావులు, న్యాయ నిపుణులతో చర్చించకుండా మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయాలు ఎలా తీసుకుంటుందని ప్రశ్నించారు. తమిళనాడు తరహాలోనే వ్యవహరించి రిజర్వేషన్లకు కావాల్సిన అన్ని ప్రక్రియ లను సంపూర్ణంగా అమలు చేసే దిశగా వెళ్లాలని, లేనిపక్షంలో ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ ఇచ్చిన ప్రకారం 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన ప్రక్రియను ప్రారంభించడం హర్షనీయమని ఆ కుల గణన నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేస్తేనే బీసీ వర్గాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో బీసీ, ఎస్సీ సంఘం నాయకులు బెల్లం కొండ కాశయ్య గౌడ్, మద్దుల సత్యనారాయణ యాదవ్, దార్ల గోవర్ధన్

# బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించిన స్కోప్ స్వచ్ఛంద సంస్థ




**చౌటుప్పల్,ఫిబ్రవరి 4(నినాదంన్యూస్):**

చౌటుప్పల్ మండలంలోని ఎస్ లింగోటం పరిధిలోని వివిధ పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికుల పిల్లలను స్కోప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. బడిబయట ఉన్న పిల్లలను గుర్తించిన స్కోప్ సంస్థ వారి తల్లిదండ్రులతో మాట్లాడి బడిలో చేర్పించుటకు డిసిపియు చైల్డ్ లైన్ వారి సహాయంతో లింగోటం ప్రాథమిక పాఠశాలలో 18 మంది పిల్లలను చేర్పించారు. వారు ఎన్ని రోజులు ఉంటే అన్ని రోజులు పాఠశాలలో చదువుకునే విధంగా పాఠశాల ఉపాధ్యాయులు తో మాట్లాడారు. బడి బయట బాలలను తీసుకొచ్చి బడిలో చేర్పించడం హర్షనీయమని అన్నారు. బాల కార్మికుల నిర్మల కోసం పనిచేస్తున్న స్కోప్ సంస్థకు ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో డి సి పి యు , స్కోప్ ఆర్గనైజర్ జిల్లా కోఆర్డినేటర్, చైల్డ్ లైన్, స్కోప్ సోషల్ మొబిలైజర్ బి. నరసింహ రాజు ప్రధానోపాధ్యాయురాలు ఉమా , టీచర్స్ పాల్గొన్నారు.

# కుంభాభిషేకానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదు

## అధికారులకు కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాలు

**భూపాలపల్లి ఫిబ్రవరి 4 (నినాదం):**



కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం కాళేశ్వరంలో ఈ నెల 7వ తేది 9వ తేదీ వరకు నిర్వహించనున్న కుంభాభిషేకం మహోత్సవాలకు విచ్చేయు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో కుంభాభి షేకం మహోత్సవాలు నిర్వహణపై దేవాదాయ, పంచాయతి రాజ్, విద్యుత్, వైద్య, ఇరిగేషన్, పోలీస్, అగ్నిమాపక, ఆర్టీసీ, సమాచార శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం బస్టాండ్ నుండి గోదావరి నది వరకు, బస్టాండ్ వద్ద గల దేవస్థానం ఆర్చి గేటు నుండి శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం ముందుగల ఆర్చ్ గేట్ వరకు, దేవస్థానం బయట ఆవరణ మొత్తం ప్రత్యేక స్వీపర్లను నియమించి ప్రతిరోజు పారి శుద్య కార్యక్రమాలు చేపట్టాకని సూచించారు. కుంభాభిషేకం జరుగు (3) రోజులు ప్రధాన ఘాట్, విఐపి ఘాట్ వరకు మొత్తం ప్రత్యేక పారిశుద్ధ్య కార్మికులను నియమించి పరిశుభ్రత పనులు చేపట్టాలని ఆదేశించారు. 5వ తేదీ నుండి పారిశుద్ధ్య కార్యక్రమాలు ప్రారంభించాలని తెలిపారు. మహదేవపూర్ నుండి కాళేశ్వరం వరకు రహదారిపై ప్రమాదకరముగా ఉన్న గుంతలను పూడ్చాలని సూచించారు. 7 నుండి 9 వ తేదీ వరకు 3 రోజులు అత్యవసర వైద్య సేవలు నిమిత్తము అన్ని సదుపాయములతో కూడిన మెడికల్ క్యాంపు పాత దేవస్థానం కార్య నిర్వహణ అధికారి కార్యాలయంలో ముందు ఏర్పాటు చేయాలని చెప్పారు. గోదావరి నది వద్ద, దేవస్థాన ప్రాంగణములో భక్తులకు మంచినీటి వసతికి గాను ఆర్.ఓ. వాటర్ డ్రమ్ముల ద్వారా మంచినీటి సౌకర్యాలు కల్పన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 9వ తేదీ ఉదయం 10.42 గంటలకు కుంభాభిషేకం చేయుటకు పీఠాధిపతులు, వేద పండితులు, విఐపిలు గోపురాల పైకి, ప్రధాన దేవాలయముల పైకి వెళ్లాల్సి ఉన్నదని ఆ సమయంలో రద్దీ తో భక్తులకు ఇబ్బంది కలుగకుండా ప్రత్యేక బందోబస్తు నిర్వహించాలని సూచించారు. మత్స్య శాఖ ద్వారా గోదావరినది వద్ద 10 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని స్పష్టంచేశారు. ప్రమాదకరమైన స్థలాలను గుర్తించి ప్రమాద హెచ్చరికల ఎర్ర జెండాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అగ్నిమాపక వాహనము ద్వారా నీటితో ఆలయ 4 గోపురములు శుద్దీకరణ చేయాలన్నారు.. నీటి పారుదల శాఖ గోదావరి నదిలో డేంజర్ జోన్లను గుర్తించి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ ద్వారా కుంబాభిషేకం జరుగు 3 రోజులు వివిధ ప్రాంతముల నుండి కాళేశ్వరమునకు ప్రత్యేక ఆర్.టి.సి.బస్సుల సౌకర్యము ఏర్పాటు చేయాలన్నారు. కుంబాభిషేకం జరుగు 3 రోజులు కాళేశ్వరము గ్రామమునకు మరియు దేవాలయమునకు 24 గంటలు నిరాతంకముగా విద్యుత్ సౌకర్యము కల్పించాలని సూచించారు. ప్రత్యాన్మయ సరఫరాకు ఏర్పాటు చేయాలని తెలిపారు. దేవాలయాన్ని వైద్యుద్దీకరణ లైటింగ్ ఏర్పాటు చేయాలని, పోస్టర్స్ ,కరపత్రములు, ఆహ్వాన పత్రికలు, ఫ్లెక్సీలు ద్వారా ప్రచారం చేయాలని పేర్కొన్నారు. భక్తులకు అన్నదానం, విధులు నిర్వహించే సిబ్బందికి, వాలంటీర్లకు భోజన, వసతి సౌకర్యాలు కల్పించాలని దేవాలయ అధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ పరిసర ప్రాంతములలో టెంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అదనపు అర్చక సిబ్బందిని ఏర్పాటు చేయాలని, పీఠాధిపతులను ఆహ్వానించాలని సూచించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఏఎస్పి బోనాల కిషన్, డిపిఓ నారాయణ రావు, విద్యుత్ శాఖ ఎస్ ఏ మల్హార్ నాయక్, వైద్యాధికారి డా మధు సూధన్, డిపిఆర్ఓ శ్రీనివాస్, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్, పీఆర్ ఈ ఈ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ప్రహద్ రాథోడ్, ఎంపిడిఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మహిళ ప్రాంగణం విద్యార్థినులకు ప్రత్యేక అభినందనలు: జిల్లా కలెక్టర్

## జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు విద్యార్థినులు కృషి చేయాలి :ముజమ్మిల్ ఖాన్

**ఖమ్మం (నినాదం న్యూస్):**



ఎం.పి.హెచ్.డబ్ల్యూ. ఫలితాలలో రాష్ట్ర, జిల్లా స్థాయిలలో అద్భుత ప్రదర్శన కనబర్చిన మహిళా ప్రాంగణ విద్యార్థినులకు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఎం.పి. హెచ్.డబ్ల్యూ (మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్) పరీక్షా ఫలితాల విడుదల నేపథ్యంలో రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంకులను సాధించిన ఖమ్మం మహిళా ప్రాంగణ విద్యార్థినులు మంగళవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ను కలిసారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఎం.పి.హెచ్. డబ్ల్యూ (మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్) పరీక్షలలో ఫస్ట్ ఇయర్ మొదటి పది ర్యాంకులలో 1,6,8,10 స్టేట్ ర్యాంకులు, రెండవ సంవ త్సరం సంబంధించి రాష్ట్ర స్థాయిలో స్టేట్ 2 నుంచి 12 ర్యాంకులను, అలాగే జిల్లా స్థాయిలో మొదటి పది ర్యాంకులను మొదటి, రెండవ సంవత్సరం ఖమ్మం మహిళా ప్రాంగణం విద్యార్థినులకు వచ్చాయని మహిళా ప్రాంగణం మేనేజర్ వేల్పుల విజేత జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎం.పి. హెచ్. డబ్ల్యూ (మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్) పరీక్షలలో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. విద్యార్థినులు జీవితంలో మరింత ఉన్నత స్థానానికి ఎదగడం లక్ష్యంగా పెట్టుకోవాలని అన్నారు. మనం చదివిన కోర్సుల ద్వారా ఏ పోటీ పరీక్షలకు హాజరు కావచ్చు, ఏ రంగాలలో ఎదగవచ్చు విద్యార్థినులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రభుత్వ రంగంతో పాటు ఇతర ఉద్యోగ అవకాశాలను సైతం విద్యార్థినులు పరిశీలించి వాటిని చేపట్టేందుకు ముందుకు రావాలని అన్నారు. మన చదువుకు ఎటువంటి అవకాశాలు అందుబాటులో ఉన్నాయి తెలుసుకొని వాటి సాధన దిశగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. లభించిన ఉద్యోగాన్ని చేస్తూనే సాయంత్రం కొంత సమయం అదనపు కోర్సులు చదివి జీవితంలో మరింత ఎదిగేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి రోజు సాయంత్రం కొంత సమయం క్రీడలకు కేటాయించాలని, ఆ దిశగా విద్యార్థినులకు అవసరమైన సదుపాయాలను సిబ్బంది కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎం.పి.హెచ్. డబ్ల్యూ మొదటి సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో మొదటి, 6వ, 8వ, 10వ ర్యాంకు విద్యార్థినిలు జె.పావని, ఎం.శ్రావణి, డి.సంధ్యావిక, బి.కల్పన లను, అలాగే రెండవ సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకు నుండి 10వ ర్యాంకు పొందిన విద్యార్థినులు మనీలా, ప్రమీల రాణి, బి.రచన, పి.శాంతి ప్రియ, బి.శిరీష, బి.ఇందు, జె. ఎస్తేరు, డి.సాయి కుమారి, ఆర్. శైలజ లను జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. జిల్లా కలెక్టర్ ను కలిసిన వారిలో మహిళా ప్రాంగణం మేనేజర్ వేల్పుల విజేత, నాగసరస్వతి, స్పందన, హిమబిందు, మల్లిక, విజయ్ కుమార్, సుకన్య, మౌనిక, లాలయ్య, దుర్గా రావు, విద్యార్థినులు, తదితరులు ఉన్నారు.



## అవినీతి వ్యతిరేక పోరాటం పేరుతో
# వంచించిన కేజ్రీవాల్ !

అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఉద్యమంలో చేరి..ఆయనకు తానే ఏకలవ్య శిష్యుడిగా ప్రచారం చేసుకుని.. రాజకీయాల్లోకి వచ్చిన ఓ ఐఆర్ఎస్ అధికారి అరవింద్ కేజ్రీవాల్..అవినీతి మరకలతో ఇప్పుడు మరోమారు తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. అవినీతి చుట్టూ కేజ్రీవాల్ అల్లుకు పోయారు. అవినీతికి వ్యతిరేకంగా జన లోక్‌పాల్ బిల్లుకోసం అన్నాహజారే నేతృత్వంలో జరిగిన ఉద్యమమే ఆమ్ ఆద్మీ పార్టీ పుట్టుకకు దారితీసింది. ఢిల్లీ వీధుల్లో ఒకప్పుడు ఆప్ సంచలనంగా మారింది. ఆప్ టోపీలు ధరించి హమ్ ఆమ్ ఆద్మీ హూం.. అనేవారు. అవినీతిపై పోరాటాలు చేశారు. సామాజిక సమస్యలపై నృత్య రూపకాలు ప్రదర్శిస్తూ ప్రజలను ఆకట్టుకునేవారు. సామాన్య ప్రజలకోసం ఇంతగా ఆలోచించిన పార్టీ లేదని, అవినీతి అంతం ఆవాలంటే ఆప్ రావాలన్న పార్టీగా గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యమంత్రి అయిన కొత్తలో కేజ్రీవాల్ ప్రజా సమస్యలపై కేంద్రంపై పోరాడేందుకు నిరసన ప్రదర్శనలు నిర్వహించేవారు. దేశ వ్యాప్తంగా ఒకప్పుడు మాయావతి నేతృత్వంలోని బహుజన సమాజ్ పార్టీ సృష్టించిన సంచలనమే ఆప్ కూడా సృష్టించింది. కేజ్రీవాల్‌తో చేతులు కలిపేందుకు ఎందరో మేధావులు అనేక రాష్ట్రాల్లో ముందుకు వచ్చారు. వారిలో లోక్‌సత్తా జయప్రకాశ్ నారాయణ్ వంటి వారు ఉన్నారు. అలాంటి ఆప్ పూర్తిగా కనుమరుగు అయ్యే ప్రమాదం ఏర్పడిరది. ఈ క్రమంలో తాజాగా ఢల్లీ ఎన్నికల్లో గెలిస్తేనే.. కేజ్రీవాల్‌కు రాజకీయ భవితవ్యం ఉన్నట్లు. లేకుంటే ఆయనకు రాజకీయ సమాధి తప్పదు. అవినీతిపై పోరాటంలో కాంగ్రెస్‌పై యుద్ధం ప్రకటించిన కేజ్రీవాల్..అనతి కాలంలోనే దేశ ప్రజల మనసులు గెల్చుకున్నారు. ప్రజలు రాజకీయ నాయకుల అవినీతి పట్ల ఎంత అసహ్యంగా ఉన్నారనడానికి కేజ్రీవాల్ ఎదుగుదలే కారణం. కానీ అనతి కాలంలోనే కేజ్రీవాల్ నిజస్వరూపం బయటపడిరది. ఆయన ముసుగు తొలగింది. అవినీతికి కేంద్రంగా కేజ్రీవాల్ రాజకీయాలు నడిచాయి. ఢల్లీ లిక్కర్ స్కామ్ ఇందుకు పరాకాష్ట. అలాగే తన ఇంటిని వందల కోట్లతో అద్భుతంగా..అంటే బిజెపి మాటల్లో శీష్‌మహల్‌గా మార్చుకున్న తీరు ఆయన ప్రతిష్టను బాగా దిగజార్చింది. కాంగ్రెస్ అవినీతిని వ్యతిరేకించిన కేజ్రీవాల్... కాంగ్రెస్ పంచనే చేరారు. ఇప్పుడు ఢల్లీలో మాత్రం ఆయనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాడు తోంది. ఆయన మంత్రులు అంతా అవినీతిలో పట్టుబడ్డారు. నిప్పులేనిదే పొగరాదన్నట్లు ...కేంద్రం ఎంతగా కక్షకట్టి కేసులు పెట్టినా..అవినీతి లేనిదే ఇవి నిలవవు. లిక్కర్ కేసులో బిఆర్ఎస్ అధినేత కవిత దూరిందం టేనే అవినీతి ఉందని స్పష్టం అయ్యింది. ఈ క్రమంలో కేజ్రీవాల్ ఎంతగా ఇప్పుడు అరిచి గీపెట్టినా ప్రజలు నమ్ముతారని అనుకోవడానికి లేదు. గెలుపు కోసం అవినీతి వ్యతిరేక పోరాటాన్ని పక్కన పెట్టిన కేజ్రీవాల్, ఉచిత పథకాలతో ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నంలో రాజకీయాలు మొదలు పెట్టారు. అవినీతి వ్యతిరేక రాజకీయాలు పక్కన పోయాయి. కేవలం తన స్వార్థ రాజకీయాలు మొదలు పెట్టారు. అందుకే పదేళ్లుగా ఢల్లీపీఠం పట్టుకుని గట్టిగా అతుక్కు పోయిన కేజ్రీవాల్‌కు ఈ ఎన్నికలు అంతు సులువు కాదు. ఆయన పక్కన ఉన్న ఎమ్మెల్యేలు అంతా పార్టీని వీడుతున్నారు. కేజ్రీవాల్నిజస్వరూప తెలిసిన వారు బయట పడుతున్నారు. అందుకే ఢల్లీలో 2013 నుంచీ ముఖ్య మంత్రిగా ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ భవిష్యత్ ఏమిటి అన్న విషయం గతంలో ఏనాడు లేని విధంగా చర్చ జరుగుతోంది. ఎందుకంటే అవినీతి అన్న వ్యవహారం నుంచి కేజ్రీవాల్ వైదొలిగారు. బిజెపిని ఢీకొంటాడన్న భ్రమలు తొలగిపోయాయి. పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ రాజకయాంగా బీజేపీని ఒంటరిగా ఢీకొంటున్నారు. ఆ తరవాత అంతటి తెగువుతొ అరవింద్ కేజ్రీవాల్ రాజకీయంగా బిజెపికి ఎదురొడ్డి నిలిచాలిచారు.. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఢల్లీలో బీజేపీ మొత్తం

ఏడు లోక్‌సభ సీట్లు దక్కించుకున్నా, ఆరునెలల తర్వాత 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి పూర్తి మెజారిటీ తెచ్చిపెట్టిందటే అది కేజ్రీవాల్ పట్ల ప్రజలకున్న విశ్వాసంగా చూడాలి. తన పథకాల్లో ప్రజల్లో ఆదరణ లభించడంతో తనకు తిరుగులేదని భావించి ఒక దశలో ప్రధానమంత్రి పదవి కోసం కూడా కలలు కన్న కేజ్రీవాల్, ఆ దిశగా రాజకీయాలు నడిపారు. అదే కేజ్రీవాల్ ఇప్పుడు ఢల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, అధునాతనంగా నిర్మించిన ప్రభుత్వ పాఠశాలలు, మహిళలు బస్సెక్కితే ఉచితంగా ప్రయాణించేందుకు గులాబీ రంగు టికెట్, మొహల్లా వైద్యశాలలు.. వీటన్నిటితో ఢల్లీ ప్రజలు కేజ్రీవాల్ వైపే మొగ్గు చూపారు. ఈ క్రమంలో పథకాలతో ప్రజలను బురిడీ కొట్టించవచ్చని కేజ్రీవాల్‌కు అర్థం అయిపోయింది. అందుకే అవినీతి వ్యతిరేక ఉద్యమకాడిని వదిలేశారు. తానే అవినీతికి కేంద్రంగా మారారు. తన పార్టీవారు, మంత్రులు పలువురు ఇందులో కూరుకుపోయారు. చివరకు లిక్కర్ కేసులో కేజ్రీవాల్ జైలుకు వెళ్లి వచ్చారు. ఈ క్రమంలో 2020లో వచ్చిన ఫలితాలు ఇప్పుడు పునరావృత మవుతాయని చెప్పలేని పరిస్థితి ఢల్లీలో నెలకొంది. 2019లో మాదిరి 2024లో కూడా బీజేపీ మరోసారి మొత్తం ఏడు లోక్‌సభ సీట్లు సాధించింది. దీన్ని బట్టి ఢల్లీ ప్రజలు జాతీయ స్థాయిలో నరేంద్రమోదీనే ప్రధాని కావాలని ఆకాంక్షిస్తున్నారని రెండోసారి రుజువైంది. కాని అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి కేజ్రీవాల్‌ను ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటారని ఖచ్చితంగా చెప్పేందుకు తగిన కారణాలు కానరావడం లేదు. ఎందుకంటే అవినీతి వ్యవహారంతో కేజ్రీవాల్ ప్రతిభ మసకబారింది. ఆమ్ ఆద్మీ పార్టీ కూడా స్వయంగా తన ప్రతిష్ఠ దిగజారిపోయేలా చేసుకుంది. ఏ అవినీతి పునాదిగా ఆయన పార్టీ అవతరించిందో ఆ అవినీతే కాలనాగులా ఆయననే చుట్టుముట్టుకుంది. తనకంటూ విలాసవంతమైన భవంతిని నిర్మించుకోవడమే కాదు, ప్రభుత్వ పథకాల్లో కూడా వాటా కొట్టేయడం గురించి విజిలెన్స్ నివేదికల్లో బయటపడిరది. మొహల్లా క్లినిక్‌లలో నకిలీ పేషంట్లను సృష్టించారని, జరగని వైద్య పరీక్షలను జరిగినట్లు చూపించారని, నాణ్యత లేని మందులు సరఫరా చేశారని ఈ నివేదికలు వెల్లడిరచాయి. ఒకప్పుడు ఎలాంటి మచ్చాలేని ఆమ్ ఆద్మీ పార్టీ అవినీతి పాఠాలు వంటబట్టించుకుంది. అణగారిన వర్గాల నుంచి అవతరించిన పార్టీలకు కూడా అవినీతి చెదలు పట్టడం రాజకీయంగా దురదృష్టం. తెలంగాణ సాధనలో కెసిఆర్ ఎంతగానో పోరాడినా అవినీతి ఇప్పుడు ఆయన పార్టీని కూడా మింగేసింది. జగన్ అవినీతి రాజకీయాలు కూడా ఎపిలో వైసిపిని ముంచాయి. అవినీతికి సంబంధించి మాట్లాడితే ప్రజలు ఛీత్కరించే పరిస్థితి వచ్చింది. దీంతో ఇప్పుడు కేజ్రీవాల్ పతనం కూడా ఆశ్చర్యానికి గురిచేయదనే చెప్పాలి.

## అక్రమ వలసదారులపై
# ఉక్కుపాదం



**వెతికి పట్టుకుని మరీ దేశం దాటిస్తున్న ట్రంప్**
**మిలిటరీ విమానంలో పలువురు భారతీయుల తరలింపు**

వాషింగ్టన్ :
అమెరికాలో అధికారం చేపట్టిన తర్వాత, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసదారులను దేశం నుండి బహిష్కరించడానికి కఠినమైన చర్యలు తీసుకుంటున్నారు. నిన్న మొన్నటి వరకు కెనడా, మెక్సికో, కొలంబియా, బ్రెజిల్ దేశాలకు చెందిన వారిని గెంటేసిన ట్రంప్.. తాజాగా భారత్ వంతు వచ్చేసింది. అమెరికాలో నివసిస్తున్న అక్రమ భారతీయ వలసదారులను స్వదేశానికి తిప్పి పంపిస్తున్నారు. అమెరికా మిలటరీకి చెందిన సి -17 ప్రత్యేక విమానం బయలుదేరింది. అమెరికన్ అధికారి ఒకరు ఈ సమాచారం ఇచ్చారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ఇమ్మిగ్రేషన్ ఎజెండాను నెరవేర్చడానికి సైన్యం సహాయం తీసుకుంటున్నారు. దీని కింద సైనిక విమానాల సహాయంతో ప్రజలను బహిష్కరించే పని ప్రారంభించారు. అమెరికాలో భారత్‌కు చెందిన దాదాపు 7లక్షల 25వేలకుపైగా మంది సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా ఉంటున్నట్టు సమాచారం. వీరిలో 18 వేల మందిని భారత్‌కు తరలించేందుకు జాబితా రూపొందించింది. ఈ విషయంలో భారత్ కూడా తమ స్పందనను తెలియజేసింది. అక్రమ వలసలకు తాము కూడా వ్యతిరేకమని స్పష్టం చేసింది. వీసా గడువు ముగిసినా సరైన పత్రాలు లేకుండా అమెరికా సహా ఎక్కడ ఉన్నా భారతీయులను వెనక్కి తీసుకొస్తామని తెలిపింది. కాగా, మెక్సికో, సాల్వెడార్ తర్వాత అమెరికాలో ఎక్కువగా ఉంటున్నది భారతీయులే అని లెక్కలు చెబుతున్నాయి. అమెరికా చరిత్రలోనే అతిపెద్ద బహిష్కరణ ఆపరేషన్ కొనసాగుతోంది. దేశంలో అక్రమంగా ఉంటున్న వారిని గుర్తిస్తున్న అధికారులు వారిని ఆయా దేశాలకు తరలిస్తున్నారు. అందులో భాగంగా భారత్‌కు ఓ విమానం బయలుదేరింది. సీ17 విమానంలో వీరిని తరలిస్తున్నారు. ట్రంప్ అధ్యక్షుడయ్యాక ఇప్పటివరకు 8వేల మంది వరకు అక్రమ వలసదారులను అరెస్ట్ చేసినట్లు సమాచారం. అక్రమ వలసదారులను ఆయా దేశాలకు తరలించేందుకు రంగం సిద్ధం చేశారు. అక్రమ వలసదారులను వెనక్కి పంపేందుకు ఒక్కో వ్యక్తిపై అమెరికా దాదాపు 4వేల 675 డాలర్లు ఖర్చు చేస్తోంది. ట్రంప్ ఆదేశాల మేరకు, అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దేశం నుండి బహిష్కరించాల్సిన 1.5 మిలియన్ల మంది వ్యక్తుల జాబితాను సిద్ధం చేసింది.

**డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా, భారతీయ అక్రమ వలసదారులను భారతదేశానికి తిప్పి పంపించారు.**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌లతో జరిగిన చర్చల సందర్భంగా ట్రంప్, విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో అమెరికాలో నివసిస్తున్న అక్రమ భారతీయుల గురించి ఆందోళన వ్యక్తం చేశారు. ఏ దేశంలోనైనా చట్టవిరుద్ధంగా నివసించడాన్ని భారత్ వ్యతిరేకిస్తుందని అన్నారు. మన పౌరుల్లో ఎవరైనా అమెరికాలో చట్టవిరుద్ధంగా నివసిస్తున్నట్లయితే, వారు భారతీయ పౌరులు అయితే, స్వదేశానికి చట్టబద్ధంగా తిరిగి రావడానికి సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రి ఎస్ జైశంకర్ అన్నారు.

# పెరుగుతున్న క్యాన్సర్ మరణాలు..

**పెరుగుతున్న క్యాన్సర్ మరణాలు..**
**ధూమపానం, గుట్కాలతో వస్తున్న వ్యధులు**
**వాటికి దూరంగా ఉండడమే మేలంటున్న వైద్యులు**

హైదరాబాద్, నినాదం:

ఈ మధ్య క్యాన్సర్ మరణలు పెరిగాయి. . పొగాకు, గుట్కా వంటి అలవాట్లతో పాటు, ఆహార పదార్థాల వల్ల కూడా క్యాన్సర్ వ్యాపిస్తోంది. క్యాన్సర్ ఆస్పత్రులు జనరల్ ఆస్పత్రుల కన్నా కిటకిటాడుతున్నాయి. ఇది సోకిన వారు బతికి బట్టికట్టిన దాఖలాలు ఉండడం లేదు. ఏ స్టేజీలో ఉన్న మరణం తప్పడం లేదు. మంగళవారం నాడు ప్రపంచ కాన్సర్ దినోత్సవం. ఈ సందర్భంగా ..స్మోకర్స్ కు పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాల పై అవగాహన కలిగి ఉంటే మంచిది. ప్రధానంగా గుట్కా,ధూమపానం ప్రాణాలను హరించేస్తోంది. ఆరోగ్యవంతమైన జీవనాన్ని ఆస్వాదించాలంటే పొగాకు, గుట్కాలకు దూరంగా ఉండాలి. పొగ తాగడం వ్యసనంగా మారక ముందే ఫుల్ స్టాప్ పెట్టడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. పొగాకు, ధూమపానం అలవాట్లను మాన్పించడంలో సమాజంలో ప్రత ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. పొగాకు ఉత్పత్తులను ముందుగా అమ్మకుండా నిషేధించాలి. వాటిని తయారు చేయకుండా ఆంక్షలు విధించాలి. యువత సైతంచెడు స్నేహం వల్లో, సాంగత్య ప్రభావం వల్లనో పొగాకు ను అలవాటు చేసుకుంటున్నారు.అందుకే కాలేజీల కు వెళ్లే విద్యార్థులపై తల్లి దండ్రులు ఓ కన్నేసి ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సరదా గా మొదలయ్యే అలవాటు వల్ల జీవితం అవాంఛనీయ ఘటనలకు దారి తీయటం వాంఛనీయం కాదు. యోగా చేయడం,ఏదైనా ఇతర పనుల పై దృష్టి పెట్టడం ద్వారా కూడా దమ్ము కొట్టాలి అన్న ఆలోచన ను క్రమ,క్రమంగా దూరం చేసుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. .అద్భుత ఫలితాన్ని సాధించవచ్చు అని చెప్పారు. పొగాకుతో క్యాన్సర్ ఎలా వస్తుంది అనే విషయం చెప్పటానికి,తెలుసుకోవటానికి వైద్యం చదవ వసరం లేదు. సిగరెట్, బీడీ తాగితే పొగాకు తో పెనవేసుకున్న రసాయనాలు శరీరం లోకి ప్రవేశించి కణాల డిఎన్ఏను నాశనం చేసే పనిలో పడతాయి. సిగరెట్ అలవాటు కు ముందు ,ఆ తర్వాత ఆరోగ్యం గురించి చెప్పొచ్చు. పొగతాగడం, గుట్కా తినం అంటే మృత్యువుకు 'దగ్గర' అయ్యే అవకాశాలే అధికంగా ఉన్నాయి. సిగరెట్ ,బీడీ కాల్చినపుడు వాటి నుంచే వెలువడే రసాయనాలు ఎంతటి ఉక్కు లాంటి కందరాల్ని ఐనా తుప్పు పట్టించే పనిలో ఉంటాయి. పటిష్ట మైన ఆరోగ్యం పునాదులను దారుణంగా దెబ్బ తీస్తాయి. కణాలుఅడ్డగోలుగా పెరిగేలా కారకం అవుతాయి తద్వారా కేన్సర్ కు దారి తీస్తాయి. ఆరోగ్యం గా ఉన్న కణాల డి ఎన్ ఏ ను దెబ్బ తీస్తాయి. అంటే శరీరం ఆకృతి ఇచ్చే కణాల పై ప్రభావం చూపుతాయి.

## అంతరిక్షంలోనే చిక్కుకున్న
# సునీతా విలియమ్స్

**భూమ్మీదకు**
**తెచ్చే ప్రయత్నంలో మరింత ఆలస్యం**

న్యూయార్క్ :
జీరో గ్రావిటీ వద్ద కొన్ని నెలలుగా తేలియాడుతుండటంతో నేలపై నడిచిన అనుభూతిని గుర్తు తెచ్చుకోలేకపోతున్నానని సునీతా విలియమ్స్ ఇటీవల చెప్పారు. ఆమె ఆరోగ్యం కూడా విషమించిందన్న వార్తలు వచ్చాయి. ఆమెను తిరిగి భూమి మీదకు రప్పించే ప్రయత్నాలపై అనుమానాలు వస్తున్నాయి. తమ మిషన్ ప్రకారం నెల రోజుల్లోపే అంతరిక్షం నుంచి తిరిగి రావాలి. కానీ, ఇంతకాలం ఇక్కడ ఉండటం కొంచెం షాకింగ్‌గా అనిపిస్తోందనీ అన్నారు. సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్ గతేడాది జూన్ 6న బోయింగ్ స్టార్‌లైనర్ క్యాప్సుల్‌లో అంతరిక్ష కేంద్రానికి వెళ్లారు. వాస్తవానికి అదే నెల 14వ తేదీన వీరిద్దరూ భూమికి తిరుగు పయనం కావాల్సి ఉండగా.. వ్యోమనౌకలో హీలియం లీకేజీ కారణంగా సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. దీంతో ఇద్దరూ ఏడు నెలలుగా అంతరిక్ష కేంద్రంలోనే చిక్కుకుపోయారు. అంతరిక్షంలో చిక్కుకుపోయిన వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్‌లను సురక్షితంగా భూమ్మీదకు తీసుకురావాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ సాయం కోరినట్లు 'స్పేస్ ఎక్స్' అధినేత ఎలాన్ మస్క్ అన్నారు.

# పవిత్ర తీరం... పారిశుద్ధ్యం అధ్వానం

- కంపు కొడుతున్న కాళేశ్వర జలం
- చెత్తశుద్ధిపై లోపించిన చిత్తశుద్ధి
- మూడు రోజుల్లో మహా కుంబాభిషేకం
- రెండు నెలల్లో సరస్వతీ పుష్కరాలు
- అసౌకర్యానికి భక్తుల అసహనం

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/ మహాదేవపూర్ (నినాదం):**



**దక్షణకాశీగా పేరుగాంచిన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ ప్రసిద్ది అధికారుల అలసత్యం మూలంగా అపవిత్రమవుతోంది. పండుగలు, పర్వదినాల సందర్బంగా పెద్ద ఎత్తున తరలివచ్చే భక్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. నిత్యం వేలాది మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించే త్రివేణి సంగమ తీరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో అధికారులు ప్రతిసారీ విఫలమవున్నారు. దీంతో గోదావరి పవిత్ర తీరంలో పారిశుద్ధ్యం లోపించి అద్దన్నంగా మారింది. గతంలో తొలి ఏకాదశి సందర్బంగా పుణ్య స్నానాల కోసం వచ్చిన భక్తులు అపరిశుభ్రతను చూసి అసహనం వ్యక్తం చేశారు. అయినా అధికారుల్లో మాత్రం మార్పు రాలేదు. మరో రెండు మూడు రోజుల్లో మహ కుంబాభిషేకం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నా.. పారిశుద్ధ్య నిర్వహణ చేయాలనే ఆలోచన చేయడం లేదు. దీంతో భక్తులు దుర్గంధం భరించలేక...కలుషిత నీటిలో పుణ్య స్నానాలు ఆచరించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ సైతం మహాకుంబాభిషేకం నిర్వహణపై ఆలయ అధికారులతో సమీక్ష నిర్వహించినా శుభ్రతపై దృష్టి సారించకపోవడం విడ్డూరం.**

### కంపుతో నిండిన గోదావరి నదీ తీరం...

నిత్యం భక్తులు పుణ్య స్నానాలు ఆచరించే గోదావరినదీ తీరం వ్యర్థాలతో కంపు కొడుతోంది. ఎప్పటికప్పుడు చెత్త తొలగించాల్సిన ఆలయ, గ్రామ పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. తెలంగాణ జిల్లాతో పాటు సరిహద్దు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి గోదావరినదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుంటారు. అయితే ముందుగా స్నానాలకు వచ్చిన భక్తులు ఇక్కడి దుర్గంధం, అపరిశుభ్రతను చూసి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

కాళేశ్వరంలో వాహన పార్కింగ్, పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ గ్రామపంచాయతీ ద్వారా టెండర్లను ఆహ్వానించారు. ఆ టెండర్ల ద్వారా వచ్చిన సొమ్ముతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా వెహికిల్ పార్కింగ్, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల పారిశుద్ధ్య పనులు తూతూ మంత్రంగా జరుగుతున్నాయి. వెహికల్ పార్కింగ్ సైతం అంతమాత్రంగానే కొనసాగుతూ ఉండటం గమనార్హం.

### 7 నుంచి 9వరకు మహా కుంభాభిషేకం...


త్రిలింగ క్షేత్రంగా పేరు గాంచిన కాళేశ్వర క్షేత్రంలో ఈ నెల 7 నుంచి 9వరకు మహా కుంభాబిషేకం నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కుంభాబిషేకం కార్యక్రమానికి రాష్ట్రాలు, జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశాలున్నాయి. భక్తులతో పాటు స్వామీజిలు, వీఐపీలు రానున్నారు. ఈ క్రమంలో ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. గోదావరి నది తీరంలో మాత్రం పారిశుద్ధ్యం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. దీంతో భక్తులకు ఇబ్బందులు పడుతున్నారు. మహా కుంబాభిషేకం ప్రారంభం కానున్న నేపధ్యంలో అపరిశుభ్రతపై మాత్రం అధికారులు దృష్టి సారించకపోవడం గమనార్హం.

### గోదావరికి మూడు పుష్కరాలు...

ఎక్కడా లేని విధంగా కాళేశ్వర క్షేత్రంలోని గోదావరినదికి మూడు పుష్కరాలు వస్తుంటాయి. సాధారణంగా ప్రతి 12 ఏండ్లకోసారి మాత్రమే గోదావరినదికి పుష్కరాలు వస్థాయి. ఇక్కడ మాత్రం మూడు పుష్కరాలు వస్తాయి. త్రివేణి సంగమంగా పేరున్న ఈ గోదావరినదికి ప్రాణహిత, గోదావరి, సరస్వతీ పుష్కరాలు వస్తాయి. తెలంగాణ ప్రాంతం నుంచి గోదావరినది, మహారాష్ట్ర నుంచి ప్రాణహిత ప్రవహిస్తుండగా అంతర్వాహినీగా సరస్వతీ నది ప్రవహిస్తుంది. దీంతో కాళేశ్వరంలోని గోదావరినదికి మూడు పుష్కరాలు వస్తాయి.

### మే మాసంలో సరస్వతీ పుష్కరాలు...

12 ఏండ్లకోసారి వచ్చే పుష్కరాల్లో ఒకటైన సరస్వతీ పుష్కరాలు మే మాసంలో రానున్నాయి. ఇప్పటికే ప్రాణహిత పుష్కరాలు పూర్తవగా మరో రెండు నెలల్లో సరస్వతీ పుష్కరాలు, అటు తర్వాత గోదావరి పుష్కరాలు రానున్నాయి. అయితే పుష్కరాలు రెండు మాసాల్లో ప్రారంభంకానున్న నేపధ్యంలో ఇప్పటి నుంచే అధికారులు ఏర్పాట్లపై అప్రమత్తంగా ఉండాల్సి ఉండగా ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టినట్లు కనబడటం లేదు. కేవలం పుష్కరాలకు సంబంధించి అభివృద్ధి పనులపైనే దృష్టిపెడుతున్నారే తప్ప భక్తులు పుణ్య స్నానాలు ఆచరించే గోదావరినది పరిశుభ్రతను మాత్రం పట్టించుకోవడం లేదు. చిన్న చిన్న పర్వదినాల సమయంలోనే ఇంత అపరిశుభ్రత నెలకొంటే ఇక మహా కుంబాభిషేకం, పుష్కరాల సమయంలో ఎలాంటి పరిస్థితులు ఏర్పడుతాయనే అభిప్రాయాలను భక్తులు వ్యక్తం చేస్తున్నారు.



# సుంకాలపై ధీటుగా స్పందించిన చైనా

## డబ్ల్యుటిఒ నిబంధనలు ఉల్లంఘించడమేనని వ్యాఖ్య

బీజింగ్ : అమెరికా విధించిన టారిఫ్‌లపై చైనా ప్రభుత్వం ధీటుగా స్పందించింది. అమెరికా నుండి దిగుమతయ్యే బొగ్గు, ఎల్ఎన్‌జి ఉత్పత్తులపై 15శాతం, ముడి చమురు, ఇతర ఉత్పత్తులపై పది శాతం సుంకాలను విధిస్తున్నట్లు చైనా ప్రభుత్వం తెలిపింది. కెనడా, మెక్సికో, చైనా దేశాల వస్తువులపై దిగుమతి సుంకాలను విధిస్తూ వాణిజ్య యుద్ధానికి ట్రంప్ తెరలేపిన సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏకపక్షంగా అధిక టారిఫ్‌లను విధించడం ప్రపంచ వాణిజ్య సంస్థ డబ్ల్యుటిఒ నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించడమేనని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ చర్య అమెరికా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోగా చైనా, అమెరికాల మధ్య నెలకొన్న ఆర్థిక, వాణిజ్య సంబంధాలను దెబ్బతీస్తుందని తెలిపింది. చైనా దిగుమతులపై ట్రంప్ విధించిన 10శాతం సుంకాలు మంగళవారం నుండి అమల్లోకి రానున్నాయి. యాంటీ ట్రస్ట్ చట్టాలను ఉల్లంఘిస్తోందనే అనుమానంతో అమెరికా టెక్ సంస్థ గూగుల్‌పైనా దర్యాప్తు చేపట్టినట్లు చైనా స్టేట్ అడ్మినిస్ట్రేషన్ ఫర్ మార్కెట్ రెగ్యులేషన్ మంగళవారం పేర్కొంది. ట్రంప్ ఆదేశాలు అమల్లోకి వచ్చిన కొద్ది నిమిషాల తర్వాత చైనా ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది.

# తిరుపతి డిప్యూటీ మేయర్‌గా ఆర్సీ మునికృష్ణ

- టీడీపీకి 26, వైసీపీకీ 21 ఓట్లు

**అమరావతి, ఫిబ్రవరి4(నినాదం న్యూస్):** తిరుపతి డిప్యూటీ మేయర్‌గా ఆర్సీ మునికృష్ణ ఎన్నికయ్యారు. తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా 26.. వైఎస్సార్‌సీపీకి 21 ఓట్లు పోలయ్యాయి. ఈ సందర్భంగా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాస్ మాట్లాడుతూ డిప్యూటీ మేయర్ ఎన్నికలో కూటమి విజయం సాధిస్తుందని నిన్ననే చెప్పామని అనుకున్నది సాధించామని అన్నారు. నిన్న తమ కార్పొరేటర్లు నలుగురిని వైఎస్సార్‌సీపీ నేతలు అడ్డుకుని, కిడ్నాప్ చేశారని.. కిడ్నాప్ అయిన వారందరూ తిరిగి వచ్చేశారని తెలిపారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 26 ఓట్లతో విజయం సాధించిందన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు అడ్డదారిన గెలవాలని చూశారని.. దానిని తిప్పి కొట్టామని ఆరణి శ్రీనివాస్ చెప్పారు. శ్రీవారి ఆశీస్సులతో ఎన్డీయే కూటమి అభ్యర్థి మునికృష్ణ ఎన్నిక లాంఛనంగా గెలుపొందారని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం మునికృష్ణ మాట్లాడుతూ.. 26 మంది సభ్యులు తనకు ఓట్లు వేసి డిప్యూటీ మేయర్‌గా ఎన్నుకున్నారని సంతోషం వ్యక్తం చేశారు. తనకు ఓట్లు వేసి గెలిపించిన కార్పొరేటర్లకు, అండగా నిలిచిన ఎమ్మెల్యేకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అలాగే స్థానిక మంత్రి, తనకు మద్దతు తెలిపిన ఇతర నాయకులకు మనికృష్ణ ధన్యవాదాలు తెలిపారు. తిరుపతి అభివృద్ధికి కృషి చేస్తామని, కూటమి నేతలను కలుపుకుని తిరుపతిలో ఎక్కడా ఏ ఇబ్బంది లేకుండా అభివృద్ధి చేస్తామని చెప్పారు. కాగా తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక ఎంతో ఉత్కంఠభరితంగా జరిగింది. సోమవారం జరగాల్సిన ఎన్నిక వాయిదా పడింది. అలాగే మంగళవారం కూడా ఏం జరుగుతుందో అన్న ఉత్కంఠ నెలకొంది. ప్రశాంతంగానే ఓటింగ్ జరిగింది. చివరికి కూటమి అభ్యర్థి గెలుపుతో కథ సుఖాంతమైంది. 47 మంది కార్పొరేటర్లు, ముగ్గురు ఎక్స్ అఫిషియో నెంబర్లు.. మొత్తం 50 మంది. అయితే ఓటింగ్‌లో 48 మంది పాల్గొన్నారు. ఇద్దరు అనారోగ్యంతో రాలేకపోయారు. దీంతో ఓటింగ్ నిర్వహించిన ఎన్నికల అధికారి ముందు వైఎస్సార్‌సీపీ వాళ్లు చేతులెత్తాలని కోరగా 21 మంది చేతులెత్తారు. తర్వాత కూటమి నేతలు 26 మంది చేతులెత్తారు. దీంతో కూటమి అభ్యర్థి మునికృష్ణ డిప్యూటీ మేయర్‌గా గెలుపొందినట్లు అధికారి ప్రకటించారు. కాగా డిప్యూటీ మేయర్ ఎన్నిక సోమవారం జరగాల్సి ఉంది. కోరం లేక ఎన్నికను అధికారులు వాయిదా వేశారు. ఆదివారం రాత్రి నుంచి తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికపై హై డ్రామా కొనసాగింది. ఆదివారం రాత్రి టీడీపీ శిబిరంపై వైఎస్సార్‌సీపీ నేతలు దౌర్జన్యానికి దిగారు. కార్పొరేటర్‌ను వైఎస్సార్‌సీపీ నేత భూమన లాక్కెళ్లినట్లు టీడీపీ నేతలు ఆరోపించారు. కోరం 25 మంది ఉండాలి. అయితే 22 మంది మాత్రమే ఉన్నారు. దీంతో అధికారులు ఎన్నికల నిబంధనల మేరకు ఎన్నికను మంగళవారం నాటికి వాయిదా వేశారు. దీంతో మంగళవారం గట్టి బందోబస్తు మధ్య డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహించారు. మరోవైపు తిరుపతిలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు తిరుగుబాటు చేశారు. కొంతమంది కూటమిలో చేరారు. పాలనలో తమకు స్వేచ్ఛలేదని కూటమిలో చేరడంవల్ల తమకు గౌరవం పెరిగిందని కార్పొరేటర్లు అన్నారు.



## నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా మండవ కృష్ణకుమారి



**విజయవాడ, ఫిబ్రవరి4(నినాదం న్యూస్):** ఎన్టీఆర్ జిల్లా నందిగామ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా మండవ కృష్ణకుమారి ఎన్నికయ్యారు. చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా పట్టణంలోని జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎక్స్ అఫీషియో సభ్యురాలు, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో పాటు 18 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. ఈ క్రమంలో నిర్వహించిన ఎన్నికలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో కలిపి కృష్ణకుమారికి 15 మంది మద్దతు లభించింది. వైకాపా అభ్యర్థి ఓర్సు లక్ష్మికి కేవలం ముగ్గురే మద్దతు తెలిపారు. దీంతో చైర్‌పర్సన్‌గా కృష్ణకుమారి ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. ధ్రువీకరణ పత్రాన్ని ఎన్నికల ప్రత్యేకాధికారి, ఆర్డీవో బాలకృష్ణ ఆమెకు అందజేశారు. 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైకాపా-13, తెదేపా-6, జనసేన-1 చొప్పున గెలిచారు. ఆ తర్వాత తెదేపా నుంచి ఒకరు వైకాపాలో చేరారు. చైర్‌పర్సన్‌గా వైకాపా నుంచి మండవ వరలక్ష్మి, వైస్‌చైర్‌పర్సన్‌గా మాడుగుల నాగరత్నం ఎంపికయ్యారు. ఆ తర్వాత వీరు చనిపోయారు. ప్రస్తుతం ఏడుగురు కౌన్సిలర్లు వైకాపాను వీడి తెదేపాలో చేరడంతో తెదేపా బలం 5 నుంచి 12కు పెరిగింది. జనసేనతో కలిపితే 13. ఎమ్మెల్యేతో కలిపి 14 ఓట్లు ఉన్నాయి. వైకాపాలో ఐదుగురు మిగలగా.. వీరిలో ఒకరు రాజీనామా చేయడంతో నలుగురే మిగిలారు. ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్‌తో కలిపి ఆ పార్టీకి ఐదు ఓట్లున్నాయి. తాజాగా జరిగిన చైర్‌పర్సన్ ఎన్నికలో వైకాపాకు కేవలం ముగ్గురే మద్దతు తెలపడం గమనార్హం.

## మూడు శాసనసభా కమిటీలకు చైర్మన్ల నియామకం

- ఉత్తర్వులు జారీచేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు



**అమరావతి, ఫిబ్రవరి4(నినాదం న్యూస్):** ఏపీ శాసన వ్యవస్థలో ఫైనాన్షియల్ కమిటీలను నియమిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ, అంచనాల కమిటీల చైర్మన్‌లను అధికారికంగా ప్రకటిస్తూ నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రజాపద్దుల సంఘం చైర్మన్‌గా పులవర్తి రామాంజనేయులు, పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్ కమిటీ చైర్మన్‌గా కూన రవికుమార్, అంచనాల కమిటీ చైర్మన్‌గా వేగుళ్ల జోగేశ్వరరావు నియామకాన్ని ఆమోదిస్తున్నట్టు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. మూడు ÷నాన్షియల్ కమిటీలకు చైర్మన్‌లను నియమిస్తూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నోటిఫికేషన్ జారీ చేశారు. ÷నాన్షియల్ కమిటీల నియామకం పూర్తైనట్టు స్పీకర్ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. 175 మంది శాసనసభ్యుల నుంచి 9 మంది చొప్పున, 58 మంది శాసనమండలి సభ్యుల నుంచి ముగ్గురు చొప్పున మూడు కమిటీల్లో నియమించారు.

# హైదరాబాద్‌లో హాస్టల్ నిర్వాహకుడి అరాచకం

- యువతిని వీడియోలు చూపి బ్లాక్‌మెయిల్




**అమరావతి, ఫిబ్రవరి4(నినాదం న్యూస్):** హైదరాబాద్‌లో హాస్టల్ నిర్వాహకుడి అరాచకం బయటపడింది. వీడియోలతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి బెదిరింపులకు పాల్పడిన సంఘటన వెలుగు చూసింది. యువతి న్యూడ్ వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డాడు. అంతే కాదు యువతిని బెదిరించి ఏకంగా రూ.2.53 కోట్ల వరకు వసూలు చేశాడు. దీంతో బాధితురాలు నిడదవోలు పోలీసులను ఆశ్రయించింది. నిందితుడు దేవనాయక్ అలియాస్ మధు సాయికుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన బాధిత యువతి హైదరాబాద్‌లోని విప్రో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నది. యువతి ఉంటున్న ఉమెన్స్ హాస్టల్‌లో అనూష దేవి అనే చిన్ననాటి స్నేహితురాలితో పరిచయం ఏర్పడింది. దేవనాయక్ అలియాస్ మధు సాయికుమార్‌ను యువతికి తన భర్తగా పరిచయం చేసిది అనూష దేవి. దేవ నాయక్ వేరే ఫోన్ నెంబర్ తో న్యూడ్ వీడియోస్ నెట్లో పెడతానంటూ యువతిని బెదిరింపులకు గురి చేశాడు. న్యూడ్ వీడియోలు నెట్లో పెట్టకుండా ఉండాలంటే డబ్బులు ఇవ్వాలంటూ డిమాండ్ చేశాడు. వీడియో విషయంలో వేరే ఒకరితో గొడవ పడ్డానని యువతిని నమ్మించి కొంత నగదు కాజేశాడు. అలాగే యువతిని కెనడా పంపిస్తానని మరికొంత డబ్బులు కాజేశాడు దేవ నాయక్. యువతి తల్లిదండ్రులను కూడా డబ్బుల కోసం బ్లాక్ మెయిల్ చేశాడు. పలు దఫాలుగా ఫోన్ పే, గూగుల్ పే ద్వారా రూ. 2.53 కోట్లు కాజేశాడు. చివరికి మోసపోయానని గ్రహించి, నిడదవోలు పోలీసులకు ఫిర్యాదు చేసింన యువతి. యువతి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, నిందితుడు దేవనాయక్‌ని పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్దనుండి రూ. 1.81 కోట్లు స్వాధీనం చేసుకున్నారు.

# భవన నిర్మాణాల్లో సెల్ఫ్ డిక్లరేషన్

- 300 చదరపు మీటర్లు మించని నిర్మాణాలకు అనుమతి
- రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల



**అమరావతి, ఫిబ్రవరి4(నినాదం న్యూస్):** సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీమ్ కింద ఆంధ్రప్రదేశ్‌లో భవన నిర్మాణ అనుమతులపై రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణ ప్రాంత స్థానిక సంస్థలే ఇక నుంచి అనుమతులు ఇచ్చేలా మార్గదర్శకాలు జారీ చేసింది. సీఆర్‌డీఏ మినహా అన్ని చోట్లా అనుమతులు జారీ చేసే అధికారాన్ని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధి నుంచి పట్టణ ప్రాంత స్థానిక సంస్థలకు బదిలీ చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. 300 చదరపు మీటర్లు మించని నిర్మాణాలకు స్వయంగా యజమానులే ప్లాన్ ధ్రువీకరించి దరఖాస్తు చేసేలా చట్టంలో మార్పులు చేశారు. ఆర్కిటెక్టులు, ఇంజినీర్లు, టౌన్ ప్లానర్లు కూడా దరఖాస్తు చేసేలా అవకాశం కల్పిస్తూ మార్గదర్శకాలు విడుదల చేసింది. లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్‌లు కూడా ఇంటి ప్లాన్‌ను ధ్రువీకరించి అప్‌లోడ్ చేసే అవకాశం కల్పించింది. కేవలం నివాస భవనాలకు మాత్రమే ప్రభుత్వం ఈ వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు పోర్టల్‌లో ప్లాన్ అప్‌లోడ్ చేసేందుకు నిబంధనలను సరళతరం చేసింది. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని మరింతగా ప్రోత్సహించేందుకే భవన నిర్మాణ అనుమతులను సరళతరం చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా భవన నిర్మాణ అనుమతుల కోసం సెల్ఫ్ సర్టిఫికేషన్ ప్రక్రియను ప్రవేశపెట్టారు. ఆన్‌లైన్ బిల్డింగ్ పర్మిషన్ సిస్టంలో ఎలాంటి ఉల్లంఘనలు చోటు చేసుకున్నా సంబంధిత భవనాల యజమానులపై కఠిన చర్యలు ఉంటాయని మార్గదర్శకాల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ మార్గదర్శకాలు జారీ చేశారు.

# ఆదర్శం ఈ కర్నూల్ పేపర్ బాయ్..

- సెపక్తక్రా క్రీడల్లో విశ్వవిజేతగా పేదింటి మాణిక్యం



**కర్నూలు, ఫిబ్రవరి4(నినాదం న్యూస్):** కర్నూలుకు చెందిన సరస్వతి ఎర్రన్నలకు నలుగురు కుమారులు. ఎర్రన్న రుమాల్ రోటి తయారు చేయడంలో సిద్ధహస్తుడు. చెఫ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అనివార్య కారణాలవల్ల 2014లో అనారోగ్యం పాలై ఎర్రన్న మృతి చెందాడు. దీంతో కుటుంబ భారం అంతా తల్లి సరస్వతిపై పడింది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు తెలుసుకున్న ముగ్గురు పిల్లలు అశోక్ కుమార్, శివకుమార్, చిరులు తల్లికి చేదోడువాదులుగా ఉండేవారు. ఇక రెండవ కుమారుడైన శివకుమార్.. తండ్రి బాటలో పయనిస్తూ పార్ట్ టైంగా ఉదయం పేపర్ బాయ్‌గా పని చేస్తూ అనంతరం మైదానంలో సెపక్తక్రా క్రీడను సాధన చేసేవాడు. ఓవైపు పనులు చేస్తూనే, మరోవైపు ఆట ఆడుతూ బీకాం పూర్తి చేశాడు. చిన్నప్పుడు చేసిన కఠోర సాధన నేడు అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి బంగారు పథకాలను తెచ్చిపెడుతోంది. అన్న అశోక్ కుమార్ కూడా సెపక్తక్రా క్రీడలో ప్రతిభ కనబరిచి స్పోర్ట్స్ కోటాలో హైదరాబాదులో పోస్టల్ శాఖలో ఉద్యోగం సాధించాడు. తమ్ముడు చిరు బెంగళూరులో సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. శివకుమార్ సెపక్తక్రాలులో దాదాపు 20 పైగా రాష్ట్రస్థాయి జాతీయస్థాయి ఛాంపియన్ షిప్‌ల్లో పాల్గొన్నాడు. ఐదుసార్లు అంతర్జాతీయ స్థాయిలో భారతదేశం తరపున ప్రాతినిధ్య వహించాడు. 2024 జులైలో ముంబైలో ఇన్కమ్ టాక్స్ ఇన్స్పెక్టర్గా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించాడు. ఈ ఉద్యోగానికి దాదాపు పదివేల మంది క్రీడాకారులు దరఖాస్తు చేసుకోగా అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించడంతో ఉద్యోగం శివకుమార్‌ను వరించింది. 2022లో సీనియర్ రెగు వరల్డ్ ఛాంపియన్షిప్ బ్యాంకాక్‌లో గోల్డ్ మెడల్ సాధించాడు. 2023లో బ్యాంకాక్ లో జరిగిన వరల్డ్ ఛాంపియన్షిప్ లో బ్రాంజ్ మెడల్ సాధించాడు. 2024లో సౌత్ ఏషియన్ ఛాంపియన్షిప్ పోటీల్లో మూడు బంగారు పథకాలు సాధించి రికార్డు సృష్టించాడు. 2024 లో థాయిలాండ్ లో జరిగిన ఛాంపియన్ షిప్ ఇండియా జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఒక లక్ష్యాన్ని ఎంచుకొని క్రీడాకారులు కష్టపడి సాధనం చేస్తే ఫలితం తప్పకుండా దక్కుతుంది అనేదానికి నేనే నిదర్శనం అంటున్నాడు ఈ అంతర్జాతీయ క్రీడాకారుడు శివకుమార్. శివకుమార్ నిజంగా అందరికీ స్ఫూర్తిదాయకం.

# ఆ చేప బంగారం..



**అనకాపల్లి, ఫిబ్రవరి4(నినాదం న్యూస్):** అనకాపల్లి జిల్లాకు చెందిన మత్స్యకారులు వేటకు బయలుదేరారు.. ఒక్కొక్కరికి ఒక్కో రకం చేపలు పడ్డాయి.. కొందరికి వంజరాలు.. మరికొందరికి రాయి చేపలు.. కానీ ఓ మత్స్యకారుడికి మాత్రం పంటపండింది.. ఏకంగా కచిడి చేప గేలానికి చిక్కడంతో ఇక ఎగిరి గంతేశాడు.. అనకాపల్లి జిల్లా పూడిమడకలో వేటకు వెళ్లారు మత్స్యకారులు.. అచ్యుతాపురం మండలం సముద్రంలో వేట చేస్తూ ఉన్నారు. పూడిమడక మత్స్యకారులకు వంజరం, రాయి చేపలు పడ్డాయి.. కానీ జాలారిపాలేనికి చెందిన మత్స్యకారునికి మాత్రం కచిడి చేప చిక్కగా.. ఒకరు 28వేలకు కొనుగోలు చేసినట్టు చెబుతున్నారు మత్స్యకారులు..

**రుచి.. ఔషధ గుణాలు..**

కచిడి చేపలు బంగారు వర్ణంలో ఉంటాయి. చూసేందుకు ఆకట్టుకుంటాయి. అందుకే వీటిని గోల్డెన్ ఫిష్ అని కూడా అంటారు. ఔషధ గుణాలు కూడా ఎక్కువే అంటున్నారు మత్స్యకారులు. కొన్ని రకాల మందుల్లో కూడా వీటి అవశేషాలు వాడతారని చెబుతున్నారు. అంతేకాదు సర్జరీ చేసిన తర్వాత వేసే కుట్ల కోసం ఈ చేప నుంచి వచ్చే పదార్థంతో తయారు చేస్తారట.

### హిందూ ధర్మాలు, ఆలయాలు కాపాడటమే

# సీఎం చంద్రబాబు లక్ష్యం

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**అమరావతి, ఫిబ్రవరి4(నినాదం న్యూస్):** హిందూ ధర్మాలు, ఆలయాలను కాపాడాలనేది సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచన అని ఏపీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. హిందువులకు ఆరాధ్య దైవమైన శ్రీ సూర్యనారాయణ స్వామి పండుగే రథసప్తమి అని చెప్పారు. భూప్రపంచానికి సూర్యోదయంతోనే వెలుగులు నిండుతాయని అన్నారు. సీఎం చంద్రబాబు సూచనతో అరసవెల్లిలో జరిగే రథసప్తమి వేడుకలను, రాష్ట్రంలో జరిగే వేడుకలను ఈ ఏడాది రాష్ట్ర పండుగగా గుర్తించామని అన్నారు. అరసవెల్లిలో జరిగే వేడుకల్లో సీఎం చంద్రబాబు పట్టవస్త్రాలు సమర్పించాల్సి ఉందని... కానీ ఎన్నికల కోడ్ వల్ల అధికారులనే పట్టువస్త్రాలు సమర్పించాల్సిందిగా ఆదేశాలిచ్చామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గుర్తుచేశారు. నెల్లూరు మూలాపేట శివాలయంలోని సూర్యభగవానుడికు ప్రత్యేక పూజలు నిర్వహించామని అన్నారు. అనాధిగా తమ కుటుంబం రథసప్తమి పూజలు నిర్వహిస్తుందని వివరించారు. రాష్ట్రంలో పలు ఆలయాల పుననిర్మాణానికి నిధుల కేటాయింపులు జరుగుతున్నాయన్నారు. నెల్లూరు జిల్లాలో 18 ఆలయాల పున నిర్మాణాలకు రూ.38కోట్ల నిధులు విడుదలయ్యాయని ప్రకటించారు. మహాశివరాత్రి రోజున శ్రీశైలం, మహానంది, శ్రీకాళహస్తి, దాక్షారామంలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామన్నారు. మూలాపేట శివాలయం అభివృద్ధికి మంత్రి నారాయణతో కలిసి ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. ఏపీలో రాతికట్టడాలకు గత జగన్ ప్రభుత్వంలో రంగులు వేయడం వల్ల పవిత్రతను కోల్పోయాయని తెలిపారు. ఆ రంగులు తొలగించి, వాటిని కాపాడుతామన్నారు. చరిత్ర, పవిత్రతను భవిష్యత్తు తరాలకు అందిస్తామని చెప్పారు. అందుకు ఎన్ని నిధులైనా ఖర్చు చేస్తాం. భక్తులు తమ ప్రభుత్వానికి అండగా ఉన్నారని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు.

# ఘనంగా రథసప్తమి వేడుకలు



**అమరావతి, ఫిబ్రవరి4(నినాదం న్యూస్):** రథసప్తమి పర్వదినం సందర్భంగా శ్రీకాకుళం, అరసవెల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం తెల్లవారుజామున వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వినయ్ చంద్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు స్వామివారి నిజరూప దర్శనం చేసుకున్నారు. అనంతరం కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. తెలుగు ప్రజలకు రథసప్తమి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారి రాష్ట్ర పండుగగా రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు జిల్లాపై ఉన్న అభిమానంతో ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. భక్తుల సౌకర్యార్థం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసామన్నారు. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్వామివారి నిజరూప దర్శనం భక్తులకు కల్పిస్తున్నారని, ఆదిత్యుడి దర్శనం కోసం సోమవారం రాత్రి నుంచే ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారని.. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయన్నారు. మూడు రోజుల పాటు జరుగుతున్న ఉత్సవాలతో శ్రీకాకుళం పట్టణానికి కొత్త శోభ వచ్చిందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ఆరోగ్య ప్రదాత దర్శనం కోసం వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తున్నారన్నారు. ఆలయం అభివృద్ధికి చర్యలు చేపట్టామని, కేంద్ర ప్రభుత్వంతో చర్చించి అరసవెల్లి ఆలయాన్ని ప్రసాదం స్కీమ్‌లో చేరుస్తామని చెప్పారు. సూర్య భగవానుని ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ప్రాచీన దేవాలయాలను కాపాడుకోవాలి అన్నదే ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. శ్రీకాకుళం జిల్లా చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా కార్యక్రమం చేయాలనే ఆలోచనతో పకడ్బంధిగా చేశామని చెప్పారు.కాగా అరసవల్లి సూర్యనారాయణ స్వామి నిజరూప దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. ప్రభుత్వ చేసిన ఏర్పాట్లపై వారు ఆనందం వ్యక్తం చేశారు. స్వామివారిని గాయని మంగ్లీ, ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, మామిడి గోవిందరావు తదితరులు దర్శించుకున్నారు. కాగా తిరుమలలో రథసప్తమి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. రథసప్తమి సందర్భంగా మంగళవారం సప్త వాహనాలపై కోనేటిరాయుడు భక్తులకు దర్శనమివ్వనున్నారు. వాహనసేవలను తిలకించెందుకు వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకొని టీటీడీ అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. గ్యాలరీలలో వేచి వుండే భక్తులు ఇబ్బందులు పడకుండా తిరు వీధుల్లోని గ్యాలరీల్లో జర్మన్ షెడ్లు ఏర్పాటు చేశారు. గ్యాలరీల్లో నిరంతరాయంగా భక్తులకు అన్నపానీయాల సరఫరాకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గ్యాలరీల్లోకి చేరుకోలేని భక్తులు.. వాహనసేవలను తిలకించేందుకు తిరుమాడ వీధులకు వెలుపల అధికారులు ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేశారు.

# ఇది ప్రజాస్వామ్య ఓటమి

- టీటీడీ డిప్యూటీ మేయర్ ఎన్నికపై రోజా ఎమ్మెల్యే మండిపాటు



**అమరావతి, ఫిబ్రవరి4(నినాదం న్యూస్):** తిరుపతి మున్సిప్ల డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో వైసీపీ ఓటమిపై రోజా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉప మేయర్ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి ఓటమిని ప్రజాస్వామ్య ఓటమిగా మాజీ మంత్రి ఆర్కే రోజా అభివర్ణించారు. తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డా. శిరీషని విధుల నిర్వహణలో అవమానించారని ఆమె మండిపడ్డారు. తిరుపతి కార్పొరేషన్ సమావేశం లోపల జరుగుతుంటే బయట మేయర్ శిరీష ఆందోళన చేసే పరిస్థితి దేనికి సంకేతమని ప్రశ్నించారు. తిరుపతి ఎంపి గురుమూర్తి ప్రయాణిస్తున్న బస్సు పై దాడి చేశారని.. నిన్న బస్సులో బయలుదేరిన వైసీపీ కార్పొరేటర్లు ఇవాళ రాలేదన్నారు. మాతో నిన్న వచ్చి నేడు ఎన్నికల్లో మాకు వ్యతిరేకంగా ఓటు వేయడం నిన్న రాత్రి జరిగిన పరిణామాలకు కొనసాగింపు కాదా అని ప్రశ్నించారు. మున్సిపల్ కార్పొరేషన్ లో ఒక్క ఓటు ఉన్న టీడీపీ కార్పొరేటర్ తిరుపతి డిప్యూటీ మేయర్‌గా గెలిచారన్నారు. వైసీపీ విప్ జారీ చేసింది. రిటర్నింగ్ అధికారి మా సభ్యులు విప్ దిక్కరించిన కారణంగా కార్పొరేటర్లను అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కానీ అవేమీ జరగలేదని, జరిగిన పరిస్థితిని గమనిస్తే తిరుపతిలో ఎన్నికలు ఎంత ప్రజాస్వామ్య బద్ధంగా జరిగాయో అందరికీ అర్థమవుతుందని ఆర్కే రోజా మండిపడ్డారు. మేము ఓడి గెలిచాం, టీడీపీ వాళ్లు గెలిచి ఓడిపోయారు. అంతిమంగా ఒకటే చెపుతున్నా.. ఇక్కడ మేం ఓడిపోలేదు.. వ్యవస్థల ఉదాసీన వైఖరి, అధికార దుర్వినియోగం తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో గెలిచాయని ఆర్కే రోజా స్పష్టం చేశారు. తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారితోపాటు రాష్ట్ర ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారు. సమయం వచ్చినప్పుడు వారే దీనికి సమాధానం చెపుతారని ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. వైసీపీ కార్పొరేటర్ లడ్డూ భాస్కర్ తరపున మేయర్ డాక్టర్ శిరీష, కార్పొరేటర్ రాధాకృష్ణ ప్రతిపాదించారు. టీడీపీ అభ్యర్థి మునికృష్ణ తరపున ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కార్పొరేటర్ అన్నె అనిత ప్రతిపాదన చేశారు. మంగళవారం ఉదయం నిర్వహించిన ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థికి 21 ఓట్లు పడగా... టీడీపీ అభ్యర్థి మునికృష్ణకు 26 ఓట్లు వచ్చాయి. దాంతో తిరుపతిలో ఏకైక టీడీపీ కార్పొరేటర్ గా ఉన్న ఆర్సీ మునికృష్ణ ఇప్పుడు తిరుపతి డిప్యూటీ మేయర్ గా విజయం సాధించారు.

# ప్రపంచానికి సవాల్‌గ క్యాన్సర్ మరణాలు

- వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్



**అమరావతి, ఫిబ్రవరి4 (నినాదం న్యూస్):** ప్రపంచ వ్యాప్తంగా క్యాన్సర్ వ్యాప్తి పెను సవాల్ గా మారిందని ఎపి వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. ఇప్పటి వరకు 17.5 శాతం కాన్సర్ కారణంగా మరణిస్తున్నారని తెలిపారు. 9 శాతం మరణాలు క్యాన్సర్ వాళ్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్నాయి. ప్రజలకు సరైన అవగాహన లోపం, సరైనా టైంలో చికిత్స లేకపోవడంతో మరణాలు కొనసాగుతున్నాయి. క్యాన్సర్ రోగానికి చికిత్స పోందితే నయం అవుతాయి.. కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాలు క్యాన్సర్ బాధితులను అదుకోవడానికి పెద్ద ఎత్తున చర్యలు తీసుకున్నామని మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు.ఇక, ఆంధప్రదేశ్ రాష్ట్రంలో క్యాన్సర్ బాధితులను గుర్తించే పక్రియ చేస్తున్నామని మంత్రి సత్య కుమార్ అన్నారు. సినీ నటులు కాన్సర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొనాలని కోరుతున్నాం.. ప్రజలు కూడా క్యాన్సర్ పరీక్షలను భయపడకుండా చేయించుకోవాలి.. అప్పుడు, ఈ క్యాన్సర్ అనే భూతాన్ని మన రాష్ట్రం నుంచి తరమి కొడతామని తెలిపారు. అలాగే, కేంద్రం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బ్జడెట్ పై అన్ని వర్గాల నుంచి విశేష స్పందన లభించింది అని చెప్పారు. ఈ బ్జడెట్ లో ప్రధాని మోడీ పేద, మధ్య తరగతి, రైతులకు న్యాయం జరిగేలా చూశారని మంత్రి సత్య కుమార్ యాదవ్ వెల్లడించారు.

# పోలీస్ స్పోర్ట్స్అండ్ గేమ్స్ మీట్- 2025 జిల్లాకు 26 పతకాలు

● పతకాలు సాధించిన పోలీసులను అభినందించిన ఇంచార్జి సీపీ





నిజామాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్) : తెలంగాణ రాష్ట్ర 3 వ పోలీస్ స్పోర్ట్స్అండ్ గేమ్స్ మీట్- 2025 కరీంనగర్ లో జరిగింది. పోలీస్ మీట్ లో బాసర జోన్-2తరపున నిజామాబాద్ క్రీడాకారులు సత్తా చాటడం జరిగింది. వివిధ రంగాలలో 61 మంది క్రీడాకారులు పాల్గొని 26 పతకాలు సాధించారు. క్రీడాకారులను నిజామాబాద్ ఇంచార్జి పోలీస్ కమిషనర్ సి.హెచ్.సింధు శర్మ అభినందించినారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీ.సీ.పీ (అడ్మిన్) జి.బస్వారెడ్డి,అడిషనల్ డీ.సీ.పీ (ఏ.ఆర్) కె. రామ్ చందర్ రావ్ ,స్పెషల్ బ్రాంచ్ ఏ.సి.పి శ్రీనివాసరావు,రిజర్వ్ ఇన్స్పెక్టర్ లు హెచ్ .సతీష్(అడ్మిన్), యు. తిరుపతి (ఎంటిఓ) కె. శ్రీనివాస్ (వెల్ఫేర్),శేఖర్ క్రీడాకారులు ఉన్నారు.

## మోడీకి పాలాభిషేకం



వైరా, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్): మంగళవారం వైరాలో భారతీయ జనతా పార్టీ వైరా అర్బన్ మండలం టౌన్ అధ్యక్షులు మనుబోలు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లో సన్నా చిన్నకారు రైతులకు మరియు చిన్న మధ్య తరగతి ఉద్యోగులకు అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరిగేలాగా 12 లక్షల లోపు టాక్స్ బెనిఫిట్ ను కలిగిస్తూ వీధి వ్యాపారులకు 10,000 నుండి 30000 రూపాయల వరకు పెంచుతూ కిసాన్ క్రెడిట్ కార్డు లిమిట్ ను 3 లక్షల నుండి 5 లక్షల వరకు పొడిగించి అన్ని వర్గాల ప్రజలకు స్వయం సమృద్ధి కలిగేలా బడ్జెట్ను తీర్చిదిద్దిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్, ప్రధానమంత్రి నరేంద్రమోడీకి ధన్యవాదాలు తెలుపుతూ పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గోపాలకృష్ణ, ఓర్సు శ్రీనివాస్, చింత నిప్పు రామారావు, మాదినేని సత్యనారాయణ, పల్లె పోగు వెంకటేష్ యాదవ్, వాంకుడోత్ శ్రీను నాయక్, మెరుగు ముత్తయ్య, రంగు రమేష్ కూరగాయల దిలీప్ అయ్యప్ప పాల్గొన్నారు.

## ఘనంగా యుగంధర్ జన్మదిన వేడుకలు



సత్తుపల్లి, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్): సత్తుపల్లి పట్టణంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఇంటి ఆవరణలో తుమ్మల యుగంధర్ జన్మదిన వేడుకలకు ప్రజలు భారీగా హాజరయ్యారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు తనయుడు కాంగ్రెస్ యువ కెరటం తుమ్మల యుగంధర్ జన్మదిన వేడుకలను సత్తుపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. తుమ్మల నాగేశ్వరరావు జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామానికి చేసిన అభివృద్ధి ఆనవాళ్లు కనిపిస్తాయి. ఈ క్రమంలో తుమ్మల అభిమానులు భారీ ఎత్తున ప్రతి పంచాయతీలోనూ యుగంధర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చలసాని సాంబశివరావు, చల్లగుండ్ల నరసింహారావు, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ ఆనంద్ బాబు, దొడ్డ శ్రీనివాసరావు, సత్తుపల్లి మండల అధ్యక్షుడు శివ వేణు, పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు, కమల్ పాషా, వ్యవసాయ శాఖ కల్లూరు ఏఎంసి చైర్మన్ భాగం నీరజా ప్రభాకర్ చౌదరి, ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు పసుమర్తి చందర్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు సత్యంబాబు, కొండ్రుపాడు బాబురావు నియోజకవర్గం నుంచి తుమ్మల అభిమానులు కాంగ్రెస్ అభిమానులు మట్ట అభిమానులు భారీ స్థాయిలో పాల్గొన్నారు.

## పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న ఆర్యవైశ్య సంఘం

● దశదిన కర్మకు బియ్యం అందజేత



ఆళ్లపల్లి: ఫిబ్రవరి 4 నినాదం న్యూస్ : మండల కేంద్రంలోని కాలనీకి చెందిన సుతారి జగ్గయ్య, భార్య ఆదిలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో చనిపోవడంతో గుండాల మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దశదినకర్మకు వారి కుటుంబానికి 25 కేజీల బియ్యం, ఐదు కేజీల నూనె డబ్బా అందించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సేవ కార్యక్రమాలు చేస్తూ మానవ దృక్పథంతో పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పెద్దలు మానాల నారాయణమూర్తి, సంఘం అధ్యక్షులు మానాల వెంకటేశ్వర్లు, మానాల ప్రభాకర్, గౌరిశెట్టి ప్రభాకర్, మానాల శ్రావణ్, ఉపేందర్, శరత్, తవిడిశెట్టి నాగరాజు, రాంబాబు, తాటిపల్లి సత్యం, శ్రీశైలం, పూజిత్, వీరన్న, కిరణ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన మరమ్మతులను చేపట్టండి

● కలెక్టర్ ప్రతీక్ జైన్

కొడంగల్, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్) : కొడంగల్ మండలం అంగడి రాయిచూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆకస్మిక తనిఖీ చేశారు.ఆస్పత్రిలోని ఇన్ పేషెంట్, లాబరేటరీ, మందుల నిల్వ గదితో పాటు ఔట్ పేషెంట్, ఏఎంసీ తదితర రిజిస్టర్ లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా భవన లీకేజీలను పరిశీలించిన కలెక్టర్ మరమ్మతులు చేపట్టాలని అదేవిధంగా ఆసుపత్రి, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో అవసరాలకు అనుగుణంగా లైట్లు, ఫ్యాన్లు సమకూర్చాలని కలెక్టర్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న 7 ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రాలకు సరఫరా చేసిన మందుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో నిర్వహిస్తున్న వివిధ పరీక్షలపై ఆయన ఆరా



తీశారు.కలెక్టర్ ఆకస్మిక పర్యటనలో తహసిల్దార్ విజయ కుమార్, డాక్టర్లు బుస్రా, జ్యోతి, ఇతర వైద్య సిబ్బంది ఉన్నారు.

## జోగిని ఒంటరి మహిళలకు ఆరు గ్యారంటీల్లో

# మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలి

● బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత


నిజామాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్): గతంలో గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యూడల్ వ్యవస్థ సృష్టించిన జోగిని వ్యవస్థకు బలైపోయిన ఎస్సీ, బిసి మహిళలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల్లో జోగిని ఒంటరి మహిళలకు మొదటి ప్రాధాన్యతగా ఎన్నిక చేసిన అమలు చేయాలని బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో సబ్బని లత మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న జోగిని కుటుంబాలకు గ్రామాల వారీగా ప్రత్యేకంగా గుర్తించి ప్రతి జోగిని కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పది లక్షల రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో జోగిని కుటుంబ సభ్యులకు ప్రత్యేక అవకాశాలు కల్పించాలని,విద్య అర్హత లేని కుటుంబానికి స్వయం ఉపాధి కోసం జోగిని మహిళల కుటుంబాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పిన కింద 25 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు.గతంలో జోగిని మహిళలకు ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన విధంగా, మిగిలి పోయిన వారికి మూడెకరాల వ్యవసాయ భూమి ఇవ్వాలని, రేషన్ కార్డు లేని కుటుంబానికి తక్షణమే మంజూరు చేసి కుటుంబానికి 35



కిలోల బియ్యం అందజేయాలని విజ్ఞప్తి చేశారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం జోగిని వ్యవస్థ నిర్మూలనకు నియమించిన జస్టిస్ రఘునాథ్ రావు ఏక సభ్య కమీషన్ సిఫార్సులను అమలు చేయాలి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా, డివిజన్ నాయకులు విమల, ప్రమీల, శంకర్, బోజమ్మలతోపాటు నంది పేట, బీంగల్, కమ్మర్ పల్లి, మోర్తాడ్, బాల్కొండ, డొంకేశ్వర్ ఆర్మూర్ మండలాల నుండి జోగిని ఒంటరి మహిళలు హాజరయ్యారు.

## ఘనంగా శ్రీ సీతారామచంద్ర స్వామి మూడవ వార్షికోత్సవం

● పాల్గొన్న మాజీ జెడ్పిటిసి పైడి



దమ్మపేట, ఫిబ్రవరి 4 నినాదం న్యూస్: మండల పరిధిలోని చిల్లగుంపు గ్రామంలో శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో మూడవ వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారి ఆహ్వానం మేరకు మాజీ జెడ్పిటిసి పైడి వెంకటేశ్వరావు పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పైడి తో పాటు జిల్లా నాయకులు కొయ్యల అచ్యుతరావు, ఆలయ కమిటీ పాల్గొన్నారు.

## ప్రజలలో బిఆర్ఎస్‌కు పెరుగుతున్న ఆదరణ చూసే అక్రమ అరెస్టులు

● పార్టీ మండల అధ్యక్షులు తెల్లం భాస్కర్



ఆళ్లపల్లి, ఫిబ్రవరి 4 నినాదం న్యూస్: రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసే నాయకులను అక్రమ అరెస్టులు చేస్తున్నారని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తెల్లం భాస్కర్ అన్నారు. మంగళవారం బిఆర్ఎస్ పార్టీ పిలుపుమేరకు చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళుతున్నారని ముందస్తు అరెస్టులు చేశారని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో బిఆర్ఎస్ పార్టీ ఏ ఎన్నికలొచ్చినా ప్రభంజనం సృష్టించడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. అరెస్ట్ అయిన వారిలో బిఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి తిరుకొల్లూరి రాము, గడ్డం వీరన్న, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నిట్ట రాములు, యువజన విభాగం అధ్యక్షులు గంగాధరి ప్రమోద్ ఉన్నారు.

## మేడ్చల్ జిల్లా రూరల్ నూతన అధ్యక్షుడిగా బుద్ధి శ్రీనివాస్

● బుద్ధి శ్రీనివాసును శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన కొమ్ము మంగమ్మ



కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్): భారతీయ జనతా పార్టీ మేడ్చల్ జిల్లా (రూరల్) నూతన అధ్యక్షుడిగా బుద్ధి శ్రీనివాస్ ఎంపికయ్యారు. బౌరంపేట మాజీ సర్పంచ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు కొమ్ము మంగమ్మ మంగళవారం షామీర్పేట్ మండలం అలియాబాద్ చౌరస్తా లోని పార్టీ కార్యాలయం వద్ద పలువురు కార్యకర్తలతో కలిసి ఆమె బుద్ధి శ్రీనివాసును శాలువా కప్పి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా బుద్ధి శ్రీనివాస్ భారతీయ జనతా పార్టీలో కొనసాగుతూ పార్టీకి ఆయనచేసిన సేవ లకు జిల్లా అధ్యక్ష పదవి దక్కడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా నూతన జిల్లా పార్టీ అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ పురోభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేణు గోపాల్ రెడ్డి కుటుంబానికి పరామర్శ





కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ రాయల్ పార్క్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారి వేణు గోపాల్ రెడ్డి గత నాలుగు సంవత్సరాల నుండి నివాసం ఉంటున్నారు.. కొద్ది రోజుల క్రితం తన వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకొని మరణించిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంత్ రావు, కూన శ్రీశైలం గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతి రెడ్డి లు అతని కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాల్టి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రశాంత్ గౌడ్,బొంగురి కిషోర్ రెడ్డి, కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్,గారిశే రాజు, రాజేష్ ఉప్పల, శివ కుమార్ గౌడ్, పూర్ణచందర్ రావు, శ్రీనివాస్ యాదవ్, అంజి ముదిరాజ్, శ్రీనివాస్ గౌడ్, సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

## మిగిలిన ధాన్యం కొనుగోలు చేయాలి



వైరా, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్): వైరా మండలం లో విప్పలమడక సిరిపురం గ్రామాలలో మిగిలిన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు నిరసన వ్యక్తం చేశారు.చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది అని మంత్రులు ప్రకటించిన అధికారులు కొనుగోలు చేయడం లేదని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు.మంగళవారం వైరా మండలం విప్పల మడక గ్రామంలో ధాన్యం రాశులు వద్ద రైతులు నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం రాసులు జనవరి 31 వరకు కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది చివరి తేదీ గడువు కంటే నాలుగు రోజుల ముందుగానే కొనుగోలు నిలుపుదల చేశారన్నారు.మిగిలిన ధాన్యం కొనుగోలు సమస్యపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ దృష్టికి రైతులు తీసుకువచ్చారు అని ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా అధికారులను రెవెన్యూ మంత్రి అందేశించిన ధాన్యం కొనుగోలు జరగడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో విప్పలమడక మాజీ సర్పంచ్లు పారుపల్లి కృష్ణారావు తుమ్మల జాన్ పాపయ్య రైతు సంఘం మండల అధ్యక్షులు మేడా శరబంధి ఎస్ కె జానిమీయా నీటి సంఘం మాజీ అధ్యక్షులు కొల్లా వెంకటేశ్వరరావు రుద్రాక్షల వెంకటయ్య దేవభక్తిని అర్జున్ రావు భద్రయ్య మురళి సాంబశివరావు రామారావు పుల్లారావు రైతులు పాల్గొన్నారు.

## మోడీ చిత్రపటానికి పాలాభిషేకం



మణుగూరు, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్) : కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు లో ప్రవేశపెట్టిన బడ్జెట్ పై ఆనందం వ్యక్తం చేసిన స్థానిక బిజెపి నాయకులు జంపన్న, రామరాజు ఆధ్వర్యంలో, బిజెపి కార్యకర్తలు మంగళవారం అంబేద్కర్ సెంటర్లో మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేంద్ర బడ్జెట్ పై దేశమంతా పేదలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు, ఐదు లక్షల నుంచి 12 లక్షల వరకు ఇన్కమ్ టాక్స్ లో పన్ను రాయితీ ఇచ్చిన ఏకైక పార్టీ బిజెపి పార్టీ అని వాళ్లు అభివర్ణించారు. బడ్జెట్ పై నిరుపేద లందరికీ మేలు చేసే విధంగా ఉన్నదని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీకి కమ్యూనిస్టు పార్టీలకి బీఆర్ఎస్ పార్టీకి కేంద్ర బడ్జెట్ రుచించడం లేదని వారు పేర్కొన్నారు. మోసపూరిత హామీలతో రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టి 14 నెలలు గడిచిపోతున్న ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోతున్నారని వారు ఆరోపించారు. స్థానిక పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బడ్జెట్‌ని నిరసిస్తూ నిరసన వ్యక్తం చేయడం ప్రజాస్వామాన్ని అవహేళన చేసినట్లేనని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించాలని లేనిపోని ఆరోపణలతో కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించడం తగదని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కాంగ్రెస్‌పై పార్టీకి నిరసన వ్యక్తం చేశారు.

## 10న ఛలో హైదరాబాద్



వైరా, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్): కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకంగా ఉందని తెలంగాణకు మొండి చేయి చూపించిన కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ బడ్జెట్ సవరించి తెలంగాణకు తగిన స్థాయిలో నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా వేలాది మందితో జరుగుతుందని ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ కోరారు. మంగళవారం వైరా బోడెపుడి భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం వైరా మండలం కార్యదర్శి తూము సుధాకర్ అధ్యక్షతన జరిగిన ప్రజాసంఘాల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు బడ్జెట్లో నిధులు కోత విధించి పేదలకు పనులు దొరకకుండా చేసిందని విమర్శించారు. ఈ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లపల్లి కృష్ణ తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు చింతనిప్పు చలపతిరావు బాణాల శ్రీనివాసరావు సిఐటియు జిల్లా నాయకులు తోట నాగేశ్వరరావు వ్యవసాయ కార్మిక సంఘం వైరా పట్టణ కార్యదర్శి గుమ్మ నరసింహారావు షేక్ రెహానా బి షేక్ మజీద్ బి యనమద్ది రామకృష్ణ ఓర్సు సీతారాములు శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## దేశానికి క్యాన్సర్ పెను సవాలుగా మారింది

● ప్రముఖ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రోహిత్



నిజామాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్) : సర్వేకల్ క్యాన్సర్ దేశానికి ముఖ్యమైన ప్రజారోగ్య సవాలుగా మారనున్నదని, దీనిని నివారించడానికి ప్రభుత్వం , సామాజిక సేవా కార్యకర్తలు, కృషి చేయాలని ప్రముఖ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రోహిత్ అన్నారు. వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా దాస్ నగర్ లోని మహిళ రెసిడెన్షియల్ కాలేజ్ లో మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్ మరియు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన క్యాన్సర్ అవేర్నెస్ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. క్యాన్సర్ నివారణ కు ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించాలని, మందుల ధరలను నియంత్రించాలని, అప్పుడే నానాటికి పెరుగుతున్న క్యాన్సర్ ను అరికట్టవచ్చు అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ రామ్మోహన్ రావు మాట్లాడుతూ తాను క్యాన్సర్ని జయించానని, ముందుగా గుర్తించి క్యాన్సర్ని అరికట్టవచ్చని ఆయన అన్నారు. మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ ప్రమాదకరంగా మారాయని వాటిని ముందుగా గుర్తించి నివారించుకోవచ్చని, ప్రభుత్వం ఉచితంగా క్యాన్సర్ వ్యాక్సినేషన్ మహిళలకు అందించాలని ఆయన కోరారు. మల్లు స్వరాజ్యం ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ రవీంద్రనాథ్ సూరి మాట్లాడుతూ క్యాన్సర్ గురించి అవగాహన కల్పించేందుకు జిల్లాలో ఇందూరు క్యాన్సర్ ఆసుపత్రి సహకారంతో అనేక క్యాంపులు నిర్వహించామని, విద్యార్థులు అయిన మీరు గ్రామాలలో మీ తల్లిదండ్రులకు, సమాజానికి క్యాన్సర్ ప్రమాదాన్ని గురించి అవగాహన కల్పించాలని ఆయన కోరారు. కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరావు అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్ నందు ఆల్ పెన్షనర్స్%ఢ% రిటైర్డ్ ఉద్యోగుల నాయకులు కే రామ్మోహన్రావు , మదన్మోహన్, ఈవిల్ నారాయణ, అద్దంకి ఉషాన్, కళాశాల సిబ్బంది, అత్యధికంగా విద్యార్థులు పాల్గొన్నారు.

# క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే తగిన చికిత్స సాధ్యమే

- డాక్టర్ శశిధర్
- ప్రపంచ క్యాన్సర్ దినం సందర్బంగా మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ర్యాలీ



**మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి4,(నినాదం న్యూస్):** మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్యాన్సర్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మంగళ వారం జరిగిన కార్యక్రమం ఎన్ఎస్ఎస్ విభాగం, మహిళా సాధికారత విభాగం, అరుంధతి మెడికల్ కాలేజ్ సంయుక్తంగా నిర్వహించడం జరిగింది. కళాశాల నుండి నేరేడ్ మెట్ క్రాస్ రోడ్స్ వరకు విద్యార్థులు, అధ్యాపకులు కాన్సర్ నివారణకు సంబంధించిన నినాదాలతో ర్యాలీని నిర్వహించారు. తదనంతరం కళాశాలలో ఇంఛార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. అడవిరాజు అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా డా. అభిలాష గైనకాలజిస్ట్ ప్రపంచ వ్యాప్తంగా రోజు రోజుకు ప్రబలుతున్న కాన్సర్ గురించి ముఖ్యంగా ఈ మధ్యకాలంలో ఎక్కువగా ప్రభావం చూపుతున్న బ్రెస్ట్ కాన్సర్ గురించి వివరించారు. కాన్సర్ గురించి ప్రాథమిక అవగాహన కల్పిస్తూ కాన్సర్ బారిన పడకుండా తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మరొక ముఖ్య వక్త డాక్టర్ శశిధర్ మాట్లాడుతూ కాన్సర్ ను ముందుగా గుర్తించి నట్లైతె తగిన చికిత్సతో మెరుగుపర్చుకునే అవకాశాలు పుష్కలంగా ఉంటాయని వివరించారు. ఇంఛార్జ్ ప్రిన్సిపాల్ డా అడవి రాజు మాట్లాడుతూ కాన్సర్ వ్యాధి సోకినట్లుగా తెలిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ మనోధైర్యాన్ని కోల్పోవద్దని హితవు పలికారు. ఈ రోజు కళాశాలలో తెలుసుకున్న అంశాలను విద్యార్థులు తమ ఇంట్లో వారికి, బంధువులకు, చుట్టుపక్కల వారికి వివరించాల్సిందిగా సందేశాన్నం దించారు. అనంతరం అరుంధతి మెడికల్ కళాశాల విద్యార్థులు స్కిట్ వేసి కాన్సర్ గురించి చక్కగా అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా జి ఎన్ జగన్, డా కె హరిత, డా ఇ ప్రదీప్, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ శ్రీమతి జి స్వాతి అధ్యాపకులు పాల్గొన్నారు.

## శాసనసభ బీఆర్ఎస్ పార్టీ విప్‌గా ఎమ్మెల్యే

- పార్టీ శ్రేణుల్లో పెరిగిన జోష్



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్):** తెలంగాణ శాసనసభలో బీఆర్ఎస్ పార్టీ విప్‌గా కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ను నియమించడంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నిండుకున్నది. తెలంగాణ శాసనసభ టిఆర్ఎస్ పార్టీ విప్‌గా నను ప్రకటించిన సందర్భంగా ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ పార్టీ అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "నాపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, తన బాధ్యతలను నిబద్ధతతో పార్టీ ఆదేశాలను పాటిస్తూ శాసనసభలో బిఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులకు తగిన ప్రాధాన్యత ఇచ్చే విధంగా కృషి చేస్తానని, పార్టీ ప్రతిష్టను మరింత పెంచేలా పనిచేస్తానని పేర్కొన్నారు. బిఆర్ఎస్ పార్టీ నాయకత్వం తనకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సమర్ధవంతంగా వినియోగించుకుని, పార్టీ అభివృద్ధికి, ప్రజల ఆకాంక్షల నెరవేర్చేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద ప్రకటన ద్వారా వివరించారు.


## ఉచిత వైద్యం శిబిరం అభినందనీయం



**మహేశ్వరం, ఫిబ్రవరి 4 ( నినాదం న్యూస్):** ఓనస్ ఆసుపత్రి ఎండి డాక్టర్ బాలరాజు నాయుడు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని భారత్ గోర్ బంజారా సేవ సమితి రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జగన్ నాయక్ విస్లావత్ అన్నారు, మంగళవారం హైదరాబాద్ జిల్లా యాకుత్ పురా నియోజకవర్గం సైదాబాద్ మండలం ఐ ఎస్ సదన్ డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మీ నగర్ కాలనీ పార్క్ లో వాకింగ్ జిమ్ మహిళలు పెద్దలు విద్యార్థుల కు ఒనస్ రోబోటిక్ హాస్పిటల్ మల్టీ స్పెషాలిటీ సహకారం వైద్యుల నేతృత్వంలో వైద్య సిబ్బంది ఆరోగ్య శిబిరాన్ని చేపట్టారు. ఉచిత వైద్యం శిబిరాన్ని నిర్వహించారు, ముఖ్యఅతిథిగా హాజరైన వైద్యుల డాక్టర్ శేఖర్, డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ సుశీల్, సోనీ ఆధ్వర్యంలో వైద్యాధికారుల తో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు, శిబిరంల 245 మంది స్థానిక ప్రజలు కోసం హెల్త్ క్యాంప్ నిర్వహించి తదితర, వైద్య జలుబు దగ్గు గొంతు, డెంగు మలేరియా, నొప్పి వైరల్ ఫీవర్ వంటి వ్యాధుల బారిన రోగాలకు బిపి షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... చలికాలం ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, సీజన్ వ్యాధుల గ్రామలలో వ్యాపిస్తున్నాయని, ఆరికట్టేందుకు ఆస్పత్రి ఎండి డాక్టర్ బాలరాజు నాయుడు ఆదేశాల మేరకు పిలుపుమేరకు సంక్షేమం కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నామని అందులో భాగంగానే ప్రజలకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు, సమాజ సేవలో భాగంగా ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు, పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారుల సిబ్బంది, పెద్దలు, నాయకులు, అభిమానులు, యువకులు, వైద్య సిబ్బంది స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు

## కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి మొండిచేయి

- కార్పొరేటీకరణ ప్రైవేటీకరణ కోసం బాటలు వేస్తున్న బిజెపి
- ఎస్ఎఫ్ఐ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్



**కొడంగల్, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్):** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దేశ విద్యారంగానిక మొండి చేయి ప్రదర్శిస్తూ విద్యను కార్పొరేట్, ప్రైవేటీకరణకు దగ్గర చేస్తున్న విధంగా బడ్జెట్ ను ప్రవేశపెట్టిందని ఎస్ఎఫ్ఐ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు సి. అనిల్ మండపడ్డారు. శనివారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ను నిరసిస్తూ కొడంగల్ పట్టణ కేంద్రంలో నినాదం పాత్రికేయునితో మాట్లాడుతూ.. గతం కంటే విద్యారంగానికి బడ్జెట్లో నామమాత్రంగా 0.2% మాత్రమే పెరిగింది 12467.39 కోట్ల నుండి 12500 మాత్రమే విద్యారంగానికి నిధులు పెరిగాయి. ఈ నిధులు విద్యారంగా అభివృద్ధికి ఏమాత్రం సరిపోవు ఇప్పటికే పాఠశాల విద్యకు దేశంలో నిధుల కొరత తీవ్రగా ఉంది ఈ నేపథ్యంలో పాఠశాల విద్యకు 73008 కోట్ల నుండి 78572 కోట్లకు నిధులు కేటాయించారు. 500 కోట్లు మాత్రమే పెంచారు ఇలా బడ్జెట్ లో పేద విద్యార్థులను విద్యకు దూరం చేసే విధంగా ఈ బడ్జెట్ ఉందని వారు అన్నారు. ఉన్నత విద్య కోసం నామమాత్రంగానే 2025-2026 బడ్జెట్ కనిపిస్తుంది. రూ. 47619.77 కోట్ల నుండి రూ.50077.95 కోట్లకు కేవలం 5% మాత్రమే పెరుగుదల చూడవచ్చు. కాబట్టి విద్యారంగానికి నిధులు కేటాయించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయింది మండిపడ్డారు.

# నీటి సరఫరాకు అంతరాయం కలుగకుండా అబివృద్ధి పనులు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**కొడంగల్, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్):** నీటిసరఫరాకు అంతరాయం కలగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి శాఖలు చేపట్టే పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ... నియోజక వర్గంలో ఇప్పటికే మంజూరు అయిన పనులను మొదలు పెట్టాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు ఉమ్మడి సర్వేలు చేపట్టి సమస్యలు తలెత్తకుండా పనులు చేపట్టాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో నీటి సరఫరాకు సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పనులు చేపట్టే క్రమంలో విద్యుత్తు, నీటి సరఫరాకు నిలిపి వేసేటప్పుడు ముందస్తుగా మీడియా ద్వారా ప్రజలకు సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ భవనాల మరమ్మత్తులతో పాటు విద్యుత్తు, పెయింటింగ్ పనులు చేపట్టి భవనాలను అందంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ తెలిపారు. కడలో మంజూరు ఆయిన అంగన్ వాడి, మండల సమీకృత భవనాలు, ప్రహరి గోడ, అదనపు తరగతి పనులను వెంటనే ప్రారంభించాలని కలక్టర్ తెలిపారు. ఎస్సీ సబ్ ప్లాన్ కింద మంజూరు ఆయిన 5 లక్షల లోపు సీసీ రోడ్డు పనులను చేపట్టాలని అదేవిధంగా గ్రామ కూడళ్ళలో నాణ్యమైన హైమాక్స్ వీధి దీపాలు సమకూర్చాలని తెలిపారు. సమీక్ష సమావేశంలో కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఇ వసంత్ నాయక్, మిషన్ భగీరథ ఏస్ఇ జగన్మోహన్ , ఇఇ చల్మారెడ్డి , విద్యుత్తు శాఖ ఎస్ఇ నీలావతి, వివిధ శాఖల డిఇ, ఏఇ లు పాల్గొన్నారు.

## ప్రపంచ క్యాన్సర్ డే సందర్బంగా మానవహారం






- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు

**మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి4,(నినాదం న్యూస్):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్, డయాగ్నోస్టిక్స్ సెంటర్ (సి డి ఎఫ్ డి) సమావేశ మందిరంలో ప్రపంచ క్యాన్సర్ డే నిర్వహించారు. కార్యక్రమానికి స్వస్తవ క్యాన్సర్ కేర్ మద్దతు అందించింది. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ టి. రఘునాథస్వామి మాట్లాడుతూ క్యాన్సర్ నివారణ, నియంత్రణ కోసం జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్ హెచ్ ఎం) ద్వార అమలు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా నోటి, రొమ్ము, గర్భాశయ ముఖం క్యాన్సర్ల స్క్రీనింగ్ ఎన్ పిసిడిసిఎస్ లో కీలక భాగమని తెలిపారు. క్యాన్సర్ నియంత్రణలో స్క్రీనింగ్, ముందస్తు గుర్తింపు, నిర్వహణ, తగిన ఆరోగ్య సంస్థలకు రెఫరల్ కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టితో ఆరోగ్య మహిళా కార్యక్రమాలు ప్రతి మంగళవారం నాడు జిల్లా వ్యాప్తంగా 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పి హెచ్ సి ) 38 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (యూ పి హెచ్ సి) 117 బస్తీ దవాఖానాలు, 70 పల్లె దవాఖానాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. క్యాన్సర్ పరిశోధన, నివారణ మార్గాలు, టీకాలపై పలువురు నిపుణులు విలువైన సూచనలు ఇచ్చారు. క్యాన్సర్ నుండి కోలుకున్న సర్వైవర్లు తమ అనుభవాలను పంచుకుంటూ.. సాధారణ ప్రజల్లో క్యాన్సర్ పై అవగాహన పెంపొందించడంతో పాటు, ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రోత్సాహించాలన్నది అత్యవసరం అని రఘునాథ్ స్వామి పేర్కొన్నారు. ఈ లక్ష్యాన్ని గ్రామ స్థాయిలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు సమర్థవంతంగా అమలు చేయగలరని తెలిపారు. తదుపరి సీడీఎఫ్ డి కార్యాలయం నుండి ఉప్పల్ ఎక్స్ రోడ్ వరకు క్యాన్సర్ అవేర్నెస్ వాక్ నిర్వహించి మానవహారం నిత్వహించారు. డైరెక్టర్, బిఆర్ఐసి ప్రొఫెసర్ ఉల్లాస్ కోల్తూర్ సీతారాం, సిడిఎఫ్ డి డాక్టర్ వి. చతుర్వేది, డాక్టర్ రామచంద్ర మూర్తి, డాక్టర్ సత్యవతి, కీసర డివిజన్ డాక్టర్ శోభా రాణి, మల్కాజిగిరి డివిజన్ డాక్టర్ మల్లిశ్వరి, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్, ఎన్ సి డి డాక్టర్ శ్రీదేవి, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్,డాక్టర్ గీత, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్, డాక్టర్ చంద్రకళ, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్, డాక్టర్ శౌషీల్య, వైద్య అధికారి, ఉప్పల్ డాక్టర్ రఘునాధరావు దిగుమర్తి, ప్రొఫెసర్ ఆఫ్ మెడికల్ ఆంకాలజీ, క్యాన్సర్ హాస్పిటల్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ డాక్టర్ లీలా దిగుమర్తి, గైనకాలజిస్టు గైనకాలజికల్ ఆంకాలజిస్టు, సెయింట్ థెరిసా మల్టీ-స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ రమేశ్ యేలగండుల, స్టాఫ్ సైంటిస్ట్, సీడీఎఫ్డీ శ్రీమతి లలిత ధార, క్యాన్సర్ సర్వైవర్ బోగి ప్రకాష్ , సూపర్వైజర్ జిల్లా ఎన్సీడీ కోఆర్డినేటర్ ఉమాపతి రెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉప్పల్ సిబ్బంది పాల్గొన్నారు.

# గొప్ప ఆర్థిక వ్యవస్థగా భారత్

- ఇది మధ్యతరగతి ప్రజల బడ్జెట్
- ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన బిజెపి శ్రేణులు



**చేవెళ్ల, ఫిబ్రవరి 04 (నినాదం న్యూస్):** ఇది సామాన్య మధ్య తరగతి పేద ప్రజల అభివృద్ధి కొరకు కేటాయించిన బడ్జెట్ అని రానున్న రోజుల్లో భారత్ ప్రపంచంలో గొప్ప ఆర్థిక వ్యవస్థగా నిలువనుందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే, భాజపా నాయకులు కేఎస్ రత్నం అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా రంజక బడ్జెట్ ప్రవేశపెట్టిన నేపథ్యంలో మంగళవారం చేవెళ్లలో ప్రధాని మోదీ చిత్రపటానికి భాజపా శ్రేణులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం చేవెళ్ల పట్టణ కేంద్రంలో భాజపా మండల అధ్యక్షుడు అతెల్లి అనంత్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో పేదరిక నిర్మూలన దిశగా అడుగులు పడుతున్నాయి అన్నారు. ప్రపంచమంతా ఆర్థిక సంక్షోభం నెలకొన్న భారత్ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తోందన్నారు. అన్ని వర్గాలకు ప్రాధాన్యత నిస్తూ ప్రవేశపెట్టిన బడ్జెట్ పై ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్రా కార్యవర్గ సభ్యులు కంచర్ల ప్రకాష్, వెంకట్రామ్ రెడ్డి డాక్టర్ మాల్గారి వైభవ్ రెడ్డి వెంకట్ రెడ్డి జి కృష్ణ గౌడ్ చేగురి ప్రవీణ్ రెడ్డి ,పిసరి శ్రీకాంత్ రెడ్డి పత్తి సత్యనారాయణ ,అభిలాష్ బాబు బాల రెడ్డి బొబ్బిలి కుమార్ అదిరే రమేష్ ,సమ కృష్ణ ,వెంకటేష్ పాగ,బార్ల కృష్ణ ,ఉమాశంకర్, కర్ణాకర్, పెద్దోళ్ల కృష్ణ,కె కృష్ణ ,టి మధుమోహన్ రెడ్డి లక్ష్మీనారాయణ,మల్గారి భార్గవ్ రెడ్డి మధుకర్ రెడ్డి ప్రకాష్ జయసింహ భాస్కర్ రాజు,యాదయ్య రుషి, కె కర్ణాకర్,అభిషేక రెడ్డి భాస్కర్,గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## గౌతమ్ నగర్ డివిజన్‌కు నిధులు మంజూరు చేయండి

- జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన కార్పొరేటర్




**అల్వాల్, జనవరి 4 (నినాదం న్యూస్):** గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ మంగళవారం జోనల్ కమీషనర్ రవి కిరణ్ కు వినతిపత్రం అందజేశారు. గత కొంతకాలంగా పెండింగ్ లో ఉన్న పనులు ఆగిపోవడంతో పలు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరలో నిధులు మంజూరుకు చర్యలు చేపడతారని హామీ ఇచ్చారు కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్, మల్లికార్జున నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి అచ్యుతరావు, కావాలి శ్రీనివాస్, నర్సింగ్ రావు తదితరులు ఉన్నారు.

## వేసవిలో నిరంతరాయంగా విద్యుత్ అందించేందుకు చర్యలు



**కొడంగల్, జనవరి 4 (నినాదం న్యూస్):** వేసవిలో డిమాండ్ కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎన్ లీలావతి. , డివిజనల్ ఇంజనీర్ వి.భానుప్రసాద్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ తాండూర్ కె. శంకర్ మరియు అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కొడంగల్ అర్జున్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం తాండూర్‌లోని డిఇ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారులు, అధికారులతో సమీక్ష సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. తాండూర్ డివిజన్ పరిధిలో గత ఏడాది అత్యధికంగా 136 మెగావాట్ల విద్యుత్ రికార్డు అయ్యిందని, ఈ ఏడాది మరో 15 శాతం అధిక డిమాండ్ ఉంటుందని అంచనా వేసినట్లు తెలిపారు. 33/11కెవి సబ్‌స్టేషన్ కొత్తూర్, భురాన్పూర్, బాపల్లి తండా పరిధిలో అదనంగా 5ఎంవిఏ పవర్ ట్రాన్స్ పార్మర్ ఏర్పాటు చేయడం జరిగిందని మరియు తాండూర్ సుర్రైపల్లి 33/11కెవి సబ్ స్టేషన్ లో ఒక్క కెపాసిటి 5 నుంచి 8 ఎంవిఏకు పెంచడం జరిగిందని తెలిపారు. కొత్తగా మరో మూడు 33/11కెవి సబ్‌స్టేషన్లు (కందనెల్లి, చెంద్ర వంచ మరియు జంటుపల్లి)ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 82 కొత్త డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు మంజూరు చేసినట్లు తెలిపారు. 12 కొత్త 11 కెవి ఫీడర్ల పనులు జరుగుతున్నాయని, రాబోయే వేసవిలో 24 గంటలు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు అన్ని రకాలుగా సిద్ధం చేసినట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలు ఉంటే 1912కు సమాచారం అందించాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడిన సమయంలో 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా ప్రత్యేక సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధి కారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తా..

- కూన శ్రీశైలం గౌడ్






**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్‌లో తన నివాసం వద్ద రోజువారి కార్యాచరణలో భాగంగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ నియోజకవర్గం ప్రజలతో కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆహ్వాన పత్రికలను అందజేశారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరము కృషి చేస్తానని,ప్రజాపాలనలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం దూసుకెళ్తుందాన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## 'వేయి గొంతులు లక్ష డప్పులు'ను విజయవంతం చేయండి




**అల్వాల్, జనవరి 4 (నినాదం న్యూస్):** ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 7న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియం నుండి సచివాలయం వద్దనున్న 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించ తలపెట్టిన లక్ష డప్పులు వేయి గొంతులు వాల్ పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మార్పీఎస్ నాయకులు అల్వాల్ బాబు జగ్జీవన్ రాం, అంబేద్కర్ విగ్రహాల వద్ద వాల్ పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మార్పీఎస్ నాయకులు మనమెంతో మనకంత వాటాకోసం జరుగుతున్న పోరాటంలో ప్రతీ మాదిగ సోదరులు 52 ఉపకులాల సోదరులు కదిలి రావాలని ఎమ్మార్పీఎస్.టిఎస్.మహిళ విభాగం అధ్యక్షురాలు బట్టు అమృత, ముత్యాలు,రఘునాథ్ లు జాతీ సోదరులకు పిలుపు నించారు.మంగళవారం భూదేవినగర్ లోని రైల్ కట్టవద్ద గల బాబూ జగ్జీవన్ రాం, అంబేద్కర్ విగ్రహాల వద్ద లక్ష డప్పులు, వెయ్యిగొంతుల పోస్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముప్పై సంవత్సరాలుగా జరుగుతున్న పోరాటం అనేక మలుపులు తిరిగి పడిలేచి లక్ష్యానికి చేరుకుని ముగింపు దశకు చేరుకుందని అన్నారు. ఈ ఆఖరి పోరాటంలో ఒక చారిత్రకమైన మలుపులో మనం భాగస్వాములు కావడం అదృష్టంగా భావించాలనీ కోరారు. మాదిగ జాతి దాని ఉపకులాల యువత ముందువరుసలో ఉండాలనీకోరారు.వెంకటాపురం డివిజన్ నుండి వేలాదిగా కదిలి మన వాట మనం దక్కించుకుందాని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆర్టీసీ ముత్యాలు, రఘునాథ్, మాజీ కౌన్సిల్ శాంసుందర్, ప్రభాకర్, మెంటే ఉపేందర్,బండబాల నర్సయ్య,దేవేందర్, ఉపేందర్, బాలకృష్ణ,భగవాన్,ప్రకాష్,కన్న పాల్గొన్నారు

## గురుకుల పాఠశాల నూతన భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్



**కొడంగల్, జనవరి 4 (నినాదం న్యూస్):** కొడంగల్ లో నిర్మించే మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల స్థలాన్ని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పరిశీలించారు. భవన నమూనా మ్యాపులను పరిశీలించి , నిర్మాణ పనులపై తగు సూచనలు సలహాలు ఇచ్చారు. కలెక్టర్ తో పాటు కడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఉన్నారు.

## ఘనంగా రథసప్తమి వేడుకలు



**అల్వాల్, జనవరి 4 (నినాదం న్యూస్):** రథసప్తమి పురస్కరించుకొని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయము లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ అర్చకులు. తదనంతరం స్వామివారిని సూర్యప్రభ వాహనం స్వామివారు పురవీధులలో ఊరేగింపుగా ప్రజలకు దర్శనం గావించారు. సాయంత్రం చంద్రప్రభ వాహనంపై స్వామివారిని ఊరేగింపు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రఘువంతులు, వంశీ పంతులు, కృష్ణ కృష్ణమాచార్యులు పంతులు, ఆలయ సిబ్బంది వెంకట్ రెడ్డి, సురేందర్ రెడ్డి, స్వామి, రాజు సంఘ సేవకులు శివరామకృష్ణ, నాగి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నిరుపయోగంగా డబుల్ ఇళ్లు

- పదేళ్లు అధికారంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు ఇవ్వలేదు
- ప్రజాధనాన్ని బిఆర్ఎస్ దుర్వినియోగం చేసింది.
- కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు తీవ్ర అన్యాయం
- ఎంపీగా బండి సంజయ్ హుజురాబాద్ కు నిధులు తేవడంలో విఫలం.
- జమ్మికుంట,ఉప్పల్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి సహకరించాలి.
- హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జి ప్రణవ్




**జమ్మికుంట, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్):** హుజురాబాద్ పట్టణంలోని 2 వ వార్డు గణేష్ నగర్ లో గల డబుల్ బెడ్ రూమ్ లను మంగళవారం నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ్ పరిశీలించారు. హుజురాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా పూర్తైన డబుల్ బెడ్ రూమ్ లను గుంటలేని అర్హులైన నిరుపేద లబ్ధిదారులకు డబుల్ ఇండ్లతో పాటు, ఇందిరమ్మ ఇళ్లను పంపిణీ చేస్తామని తెలిపారు. వందల కోట్లు ఖర్చుచేసి కట్టిన ఇళ్ళు నిరుప యోగంగా మిగిల్చారని, ప్రజాధనాన్ని బీఆర్ఎస్ దుర్వినియోగం చేసిందని మండిపడ్డారు.ప్రభుత్వ విప్,ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో కూడా కౌశిక్ రెడ్డి పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇళ్ల రిపేర్ల గురించి త్వరలోనే గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ కు సమస్యను వివరించి నిధులు తేవడానికి కృషి చేస్తానని తెలిపారు.

**కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం....**

కేంద్ర ప్రభుత్వం,ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ లో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశారనీ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ప్రణవ్ అన్నారు.కరీంనగర్ ఎంపీగా,కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంటు అభివృద్ధికి కేంద్ర బడ్జెట్ లో నిధులు తేవడంలో విఫలమయ్యారని,రాష్ట్రం నుండి ఎనమిది మంది ఎంపిలు,ఇద్దరు కేంద్ర మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్రానికి రావాల్సిన నిధులు తేలేదని అన్నారు.హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలోని జమ్మికుంట రైల్వే స్టేషన్ అభివృద్ధికి పదేళ్లుగా సహకరించలేదని,కమలాపూర్ మండల పరిధిలోని ఉప్పల్ రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జికి ఈ బడ్జెట్ లో కూడా మొండి చెయ్యి చూపించారని,ప్రజల అవసరాలను తీర్చడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు.గతంలో 2009 లో ఎంపీగా పొన్నం ప్రభాకర్ చేసిన అభివృద్ధి పనులే ఇప్పటికీ సాక్ష్యాలుగా ఉన్నాయని అన్నారు.మరోవైపు గతంలో హుజురాబాద్ నుండి ప్రాతినిధ్యం వహించిన ఈటెల కూడా ఉప్పల్ రైల్వే పనులకు సహకరించకపోవడం అన్యాయమని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### రైతులకు మెరుగైన సేవలు నాణ్యమైన ధరలు అందించాలి

### వ్యాపారస్తుల తో ఏఎంసీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం



**జమ్మికుంట, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్) :** రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ నాణ్యమైన ధరలను పొందేలా చర్యలు తీసుకోవాలని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం అన్నారు. మంగళవారం మార్కెట్ కార్యాలయంలో అడ్తి, ఖరీదు దారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని రాష్ట్రంలోనే జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కు మంచి పేరు ఉందని ధరల విషయంలో కూడా మిగతా మార్కెట్ల కన్నా ఇక్కడ ఎక్కువగా ఉండేలా చూడాలని వారికి సూచించారు. పత్తిని ఖరీదు చేసేటప్పుడు ఎక్కువ మంది వ్యాపారులు వేలం పాటలో పాల్గొనే విధంగా చూడాలని పోటీ తత్వం పెరిగితే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని ఆ విధంగా వ్యాపారులను ప్రోత్సహించాలని మార్కెట్ అధికారులకు సూచించారు. మార్కెట్లో ఏమైనా సమస్యలు ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని మార్కెట్లో ఎలాంటి అవినీతికి తావు లేకుండా రైతుకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అంతరం పని చేయాలని వారు పేర్కొన్నారు. అనంతరం జమ్మికుంట పట్టణంలో సిసిఐ కి కేటాయించిన వైభవ్ కాటన్ కార్పొరేషన్ జిన్నింగ్ మిల్లులో రైతులు తీసుకు వచ్చిన పత్తి విక్రయాలను సందర్శించి తనిఖీ చేశారు. రైతులకు ఇబ్బంది లేకుండా పత్తిని దిగుమతి చేసుకోవాలని వ్యాపారస్తులకు సూచించారు. రైతులు కూడా నాణ్యమైన సరుకును ప్రేమ లేకుండా మార్కెట్కు తీసుకురావాలని అలా తీసుకువచ్చిన పత్తికి నాణ్యమైన ధర లభిస్తుందని వారికి సూచించారు. అలాగే హుజురాబాద్ రోడ్డులో గల మార్కెట్ పోస్టులు తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి 6 మల్లేశం ద్వితీయ శ్రేణి కార్యదర్శి ఎన్ రాజా మార్కెట్ సిబ్బంది పలువురు వ్యాపారులు అర్థి దారులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ తొలిదశలో గుర్తిస్తే జయించవచ్చు

### -డా. కె. వెంకటరమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, కరీంనగర్



**కరీంనగర్, ఫిబ్రవరి 4(నినాదం న్యూస్ ):** ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్బంగా మున్సిపల్ సిబ్బందికి క్యాన్సర్ పై అవగాహన కల్పించారు. ఐఎంఏ అసోసియేషన్ సహకారంతో, మున్సిపల్ సిబ్బందికి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించడం జరిగింది. అదేవిధంగా క్యాన్సర్ వ్యాధి యొక్క లక్షణాలు, తొలి దశలోనే గుర్తించినట్లయితే, చికిత్స తీసుకోవాలని తెలియజేశారు. ఆరోగ్య మహిళా పథకంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించడం ప్రధానంగా మహిళల్లో వచ్చే 8 రకాల వ్యాధులు అవి క్యాన్సర్ స్క్రీనింగ్, సూక్ష్మ పోష లోపాలు, మూత్రణాల ఇన్ఫెక్షన్స్, రుతుస్రావ సమస్యలు, మెనూపాస్ నిర్వహణ, లైంగిక వ్యాధుల నిర్వహణ, శరీర బరువు నిర్వహణ మొదలగు వ్యాధులకు కి పరీక్షలు నిర్వహించి చికిత్స అందించడం జరుగుతుందని డా. కె. వెంకటరమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, కరీంనగర్ తెలియజేశారు. ఈ కార్యక్రమములో మునిసిపల్ కమీషనర్ . చహత్ బజ్పై, మున్సిపల్ కమీషనర్, డా. సుజాత, డీప్యూటీ.డిఎంఎచ్ఓ , డా. సనా జవేరియా, ఐఎంఏ అసోసియేషన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. డా. కె. వెంకటరమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, కరీంనగర్ గారు శ్రీ. వెంకటేశ్వర స్వామి బ్రాంహోత్సవాలలో ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స కేంద్రాన్ని సందర్శించారు.

## జాతీయస్థాయి ఒలింపియాడ్‌లో సత్తాచాటిన పారమిత విద్యార్థులు



**కరీంనగర్, ఫిబ్రవరి 4(నినాదం న్యూస్ )** యునిఫైడ్ ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ ఒలింపియాడ్ జాతీయస్థాయిలో సత్తాచాటిన పారమిత విద్యార్థులు ఇటీవల జరిగిన యునిఫైడ్ ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ ఒలింపియాడ్ లో స్థానిక కొత్తపల్లి మండలం పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ ఆంగ్ల ఒలింపియాడ్ లో బి.దివ్యాన్ష్ 1వ తరగతి, వి.అక్షయ్, జె.సుదీక్ష, యం.ఆధ్య శ్రీ 2వ తరగతి, కె.రుషిక,పూరవ్ మిట్టల్, వశిష్ట నందన్ 3వ తరగతి, ఇ.ప్రద్యుమ్న 4వ తరగతి, ఎ.లౌక్య, జి.విహాన్ రెడ్డి 5వ తరగతి, ఎ.హాస్య పటేల్ 7వ తరగతి, ఎ.తపస్య, జోయా మెహ్వాన్, వి.స్వేత, ఆర్.ఆర్యన్ 8వ తరగతి, వి.వైష్ణవి, ఆన్య రమీన్, జి.అక్షయ 9వ తరగతి, సి.శ్లోక, ఆధ్య చౌదరీ, ఎ.హంసిని 10 వ తరగతి కి చెందిన విద్యార్థులు జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు, మెరిట్ సర్టిఫికెట్లు సాధించారని పాఠశాల డైరెక్టర్ హన్మంత రావు తెలిపారు.ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన,అనూకర్ రావు, రశ్మిత, రాకేష్, వియుయం. ప్రసాద్, వినోద్ రావు, టియస్వి.రమణ, హన్మంత రావు, ప్రధానోపాధ్యాయుడు గోపీకృష్ణ, సమన్వయకర్తలు సరిత, భవానీ, రబీంద్ర పాత్రో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ఆమోదం నిలిపివేయాలి

### -తప్పుల తడకగా ఎస్సీ వర్గీకరణ...

### -బేడ బుడగ జంగం జన సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిరిపాటి వేణు



**జమ్మికుంట, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుల గణన సర్వే తప్పుల తడకల ఉందని దానిని క్యాబినెట్ ఆమోదించ కూడదని బేడ బుడగ జంగా జన సంఘ రాష్ట్ర అధ్యక్షులు సిరిపాటి వేణు డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ పై వచ్చిన నివేదిక తప్పు అని 2011 లోనే 6444578 ఎస్సీల జనాభా ఉందని 2025లో ఎస్సీల జనాభా 6184319 గా ప్రభుత్వం ధ్రువీకరించడం హాస్యాస్పదంగా ఉందని అప్పటికి ఇప్పటికీ రెండు లక్షలు తేడా ఉందని దీనిపై అనుమానాలు ఉన్నాయని వేణు పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్వహించిన కుల గణన సరిగా జరగలేదని తిరిగి కులగనన జరపాలని ఆయన డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాలుగా ఎస్సీ జనాభా పెరగలేదని కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సర్వే సరైన విధంగా జరగలేదని ఈ లెక్కలు చూస్తే అర్థమవుతున్నాయని దీనిని అసెంబ్లీలో ఆమోదించడం సరికాదని ఆయన తెలిపారు. రీ సర్వే చేసిన తర్వాత అసెంబ్లీలో ఆమోదం తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే బేడ బుడగ జంగాల ఆధ్వర్యంలో భారీగా నిరసనలు తెలుపుతామని ఆయన పేర్కొన్నారు.

## పోలీస్ స్టేషన్‌లో దాడి చేశారని ఇరు వర్గాల ఫిర్యాదు

### -కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**జమ్మికుంట, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్) :** జమ్మికుంట పట్టణానికి చెందిన కనకం లక్ష్మి (38) అనే వివహిత తనపై లింగయ్య అనే వ్యక్తి బూతులు తిడుతూ శారీరకంగా తనతో ఉండాలని చేతులతో కొట్టినట్లు ఫిర్యాదు చేసిందని సిఐ వరగంటి రవి తెలిపారు. మహిళ ఫిర్యాదు మేరకు లింగయ్య పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు సిఐ తెలిపారు.జమ్మికుంట పట్టణానికి చెందిన కనకం లక్ష్మీ అనే వివాహిత తనను బూతులు తిట్టి చెప్పుతో కొట్టడానికి వచ్చిందని మారుతి నగర్ కు చెందిన తూర్పాటి లింగయ్య అనే వ్యక్తి ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయగా ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సిఐ ఒక ప్రకటనలో తెలిపారు.

## హుజురాబాద్ పట్టణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : ప్రణవ్



**జమ్మికుంట, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్):** హుజురాబాద్ పట్టణంలోని రెండవ వార్డులో గల గణేష్ నగర్ ను హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వొడితల ప్రణవ్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో సందర్శించారు.అనంతరం స్థానికులు అక్కడున్న పరిస్థితులను,సమస్యలను ప్రణవ్ కు వివరించారు .డ్రైనేజ్,త్రాగు నీరు సమస్య ఉందని వివరించగా వెంటనే సంభంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా కాలనీలో ఉంటున్న వారికి అర్హులైన ప్రతి లబ్ధిదారునికి రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా హుజరాబాద్ పట్టణ అభివృద్ధికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని,జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ హాస్పిటల్‌ను సందర్శించిన తమిళ వైద్య బృందం





**జమ్మికుంట, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్) :** జమ్మికుంట ప్రభుత్వ హాస్పిటల్ ను తమిళనాడు వైద్య బృందం మంగళవారం సందర్శించారు. తమిళనాడుకు చెందిన పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ డాక్టర్ వి శ్రావణ కుమార్ డాక్టర్ టి స్వామి పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటల్ ను సందర్శించారు. తమిళనాడు వైద్య బృందానికి హాస్పిటల్ సూపర్డెంట్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం వైద్య బృందం హాస్పిటల్ లోని అన్ని వార్డులను సందర్శించి వైద్యం అందుకుంటున్న రోగులతో మాట్లాడారు. వారికి వైద్య సేవలు ఎలా అందుతున్నాయి ఇంకేమైనా కావాలా ముఖ్యంగా రవాణా సౌకర్యం ఎలా ఉంది అనే అంశాలపై రోగులతో ఆ బృందం మాట్లాడినట్లు హాస్పిటల్ సూపర్డెంట్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆపరేషన్ థియేటర్ లేబర్ రూమ్ జనరల్ వార్డులను సందర్శించి పరిసరాల పరిశుభ్రతను చూసి సంతోషం వెలిబుచ్చినట్లు వారు తెలిపారు. ప్రస్తుతం హాస్పిటల్లో జనరల్ మెడిసిన్ గైనకాలజిస్ట్ సేవలు మాత్రమే ఉన్నాయని భవిష్యత్తులో మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించాలని మెరుగైన వైద్య సేవలు అందించేలా కృషి చేయాలని అవసరమైన పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని వారికి సూచించినట్లు తెలిపారు. తమిళనాడు వైద్య బృందానికి జమ్మికుంట ప్రభుత్వ హాస్పిటల్స్ సిబ్బంది శాలువాతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా తమిళనాడు బృందం ప్రభుత్వ హాస్పిటల్స్ ని సందర్శిస్తున్నారని అందులో భాగంగా మంగళవారం జమ్మికుంట ప్రభుత్వ హాస్పటల్ ను సందర్శించడం జరిగిందని ఆయన తెలిపారు. హాస్పటల్లో రోగులకు అందిస్తున్న సేవలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారని ఇంకా మెరుగైన వైద్య సేవలు అందించాలని అలాగే ఆర్థోపెడిక్ కార్డియాలజిస్ట్ చిల్డ్రన్స్ కు సంబంధించిన సేవలను కూడా అందించే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని వారు తెలిపినట్లు శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ చందు డిపిఓ స్వామి డిస్టిక్ హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళా ఎస్సై మృతి



**వెల్గటూర్,ఫిబ్రవరి04(నినాదం న్యూస్):** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చిల్వకోడూరు గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వెల్గటూర్ ఎస్సై గా గతంలో పనిచేసిన యువ మహిళా ఎస్సై కొక్కుల శ్వేత(30) మృతి చెందారు.స్థానికుల తెలిపిన సమాచారం మేరకు.. జగిత్యాల జిల్లా డిసిఆర్బి లో విధులు నిర్వర్తిస్తున్న శ్వేత కారులో ధర్మారం నుండి జగిత్యాల వెళ్తుండగా చిల్వాకోడూర్ గ్రామంలోని మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న బైక్ ను డీ కొట్టి పక్కనే ఉన్న చెట్టును బలంగా డీ కొట్టింది.ఈ ప్రమాదంలో తలకు, ముక్కుకు తీవ్ర గాయలవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందింది.ఎదురుగా బైక్ పై వస్తున్న కొండగట్టు మల్యాల గ్రామానికి చెందిన మల్యాల నరేష్(26) అనే యువకుడు కూడా తీవ్ర గాయాలతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు.మృతుడు మంచిర్యాల జిల్లా లక్షెట్టి పేట పట్టణంలోని డిబి ఎస్ బ్యాంక్ లో అసిస్టెంట్ మేనేజర్ గా విధులు నిర్వర్తిస్తున్నాడు.రోజూ మల్యాల నుండి లక్షెట్టి పేట కు గొల్లపల్లి మీదుగా వచ్చి వెళ్తుంటాడు.ఎస్సై శ్వేత కొన్ని రోజుల క్రితం వరకు కూడా వెల్గటూర్ మండల ఎస్సై గా విధులు నిర్వర్తించింది.ఎస్సై అకాల మరణంతో ఆమెతో పాటు పనిచేసిన పోలీస్ సిబ్బంది,మండల నాయకులు,ప్రజలు,తీవ్ర విచారం వ్యక్తం చేశారు.ఒకే ప్రమాదంలో ఇరువురు మృతి చెందడంతో రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది.

## కుల జనగణన చారిత్రాత్మక విజయం

- సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతంగా పూర్తి చేసిన అధికారి, యంత్రాంగానికి ప్రభుత్వానికి కృతజ్ఞతలు
- పులి ఆంజనేయులు గౌడ్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్



**కరీంనగర్, ఫిబ్రవరి 4(నినాదం న్యూస్ ):** ఎన్నికల హామీ మేరకు తెలంగాణ రాష్ట్రంలో జరిపిన సమగ్ర కుటుంబ సర్వే ద్వారా బీసీ కుల జన గణన చేపట్టి కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం చారిత్రక విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లాకు చెందిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారికి ధన్యవాదాలు తెలియజేస్తూ నేడు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, నగర కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరా చౌక్ వద్ద సంబరాలు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ,భారత్ జూడో యాత్రలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ గారు రాష్ట్రంలో బీసీ కులగన చేపడతామని ఇచ్చిన మాట కట్టుబడి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారి ఆధ్వర్యంలో సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతంగా పూర్తి చేసిన అధికార యంత్రంగానికి, ప్రభుత్వానికి బీసీల పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని, నేడు అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నివేదికను ప్రవేశపెడుతున్న సందర్భంగా కొంతమంది ప్రతిపక్ష నేతలు చేస్తున్న విమర్శలను తెలంగాణ ప్రజలు పట్టించుకోవడంలేదని, సమగ్ర కుటుంబ సర్వేలో 96% ప్రజలు తమ వివరాలను వెల్లడించడమే ఇందుకు నిదర్శనమని, ఇప్పటికైనా బిజెపి బీఆర్ఎస్ నేతలు సమగ్ర కుటుంబ సర్వే కుల గణనపై తమ వైఖరిని మార్చుకొని ప్రభుత్వానికి సహకరించి సలహాలు సూచనలు అందజేయాలి తప్ప ప్రభుత్వాన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తే రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల ఆవేశానికి బలి కాక తప్పదని హెచ్చరించారు.ఈ సమావేశంలో కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి,ఎండి తాజోద్దీన్,రహమత్ హుస్సేన్, ముత్యం శంకర్, పురం రాజేశం, బొబ్బిలి విక్టర్, ఎస్ఏ మోసిన్, లింగంపల్లి బాబు,హైమద్ అలీ, పంజాల స్వామి గౌడ్, రోళ్ల సతీష్, వంగల విద్యాసాగర్, నాగుల సతీష్, సిరిపురం నాగప్రసాద్, మెతుకు కాంతయ్య, రామిడి రాజిరెడ్డి, నెల్లి నరేష్,రామిడి తిరుపతి, మాదాసు శ్రీనివాస్,అజయ్ స్వప్న శ్రీ,కుంభాల రాజకుమార్,అనరాసు కుమార్, తోట ఆంజనేయులు,కలీం, ముల్కలయోన, శ్రీనివాస్, తోట ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సెలవు దరఖాస్తుకు ప్రత్యేక పోర్టల్

### -జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, ఫిబ్రవరి 4(నినాదం న్యూస్ ):** వివిధ ప్రభుత్వ శాఖల్లో అధికారులు, ఉద్యోగుల సెలవు దరఖాస్తు, మంజూరు విధానం ఆన్లైన్ లో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక సాఫ్ట్ వేర్ రూపొందించింది టీం ఇండియా సంస్థ సీఈవో చైతన్య ఆధ్వర్యంలో ఈ లీవ్ మేనేజ్మెంట్ పోర్టల్ సాఫ్ట్ వేర్ తయారుచేసి మంగళవారం జిల్లా కలెక్టర్ కు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, పేపర్ వర్క్ తగ్గించేందుకు, సెలవు మంజూరులో పారదర్శకతకు ఈ పోర్టల్ రూపొందించినట్లు తెలిపారు. అధికారులు సెలవు కోసం ఈ పోర్టల్ లో దరఖాస్తు చేస్తే జిల్లా యంత్రాంగం పరిశీలించి తగిన చర్య తీసుకుంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో టీమ్ అప్ సంస్థ కోఫౌండర్ రంజిత్ రెడ్డి, లక్ష్మీప్రసన్న, అనిల్ శర్మ పాల్గొన్నారు.

## భూ కబ్జా చేసిన వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు

### -కేసు నమోదు చేసిన జమ్మికుంట ఎసులు



**జమ్మికుంట, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్):** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లికి చెందిన ఎండి అరిఫ్ వుద్దీన్ అనే వ్యక్తి గతంలో జయపాల్ రెడ్డి అనే వ్యక్తి దగ్గర ప్లాట్ కొనుగోలు చేయగా ఆ ప్లాట్ లోకి కొందరు వ్యక్తులు అక్రమంగా ప్రవేశించారని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సిఐ వరగంటి రవి తెలిపారు. ఈ విషయంపై పట్టణ సీఐ వరగంటి రవి మాట్లాడుతూ మొగిలి లింగారెడ్డి అనే వ్యక్తి నుండి తేదీ 6/ 12 /2023 రోజున సర్వేనెంబర్ 464 లోని ఫ్లాట్ నంబర్ నాలుగుని కొనుగోలు చేసి అట్టి భూమిని 4776 /2023 భూమిని తన భార్య అయిన ఉమ్మే రూమాన్ అను ఆమె పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకొని తన ఫ్లాట్ వరకు హద్దులు పాతుకున్నారని వారి సొంత ప్లాటులోకి కొంతమంది వ్యక్తులు అక్రమంగా చొరబడి కబ్జా చేసినట్లు బాధితులు ఫిర్యాదు చేశారని సిఐ తెలిపారు. ప్రతివాదులు అయిన కాటిపల్లి రాజు కాటిపల్లి సంధ్య కాటిపల్లి లక్ష్మి అనువారు ఆ భూమికి నకిలీ పేపర్లు తయారు చేసి అక్రమంగా ఆ భూమిని షేక్ షబీర్ అలీ అంబాల రాజు ల సహకారంతో భూమిని కబ్జా చేయడానికి సోమవారం తాటిపల్లి రాజు సంధ్య లక్ష్మి షేక్ షబ్బీర్ అలీ అంబాల రాజు కలిసి మా ఫ్లాట్లోకి అక్రమంగా ప్రవేశించి ఫ్లాట్ యొక్క హద్దురాల్లు పీకేసి మొరం కొట్టించి టెంటు వేసుకున్నారని బాధితులు తెలిపారు.ఈ భూమి మాది అని అడగగా వారు మమ్మల్ని బూతులు తిడుతూ చంపుతానని బెదిరిస్తున్నారనీ ప్రెస్ మీట్ పెట్టి ఈ భూమి మాదే అని మీడియా ముందు మమ్మల్ని బదనం చేస్తున్నారనీ ఓనర్స్ అయినా మమ్మల్ని దొంగలుగా చూపిస్తున్నారని దరఖాస్తు ఇవ్వగా మంగళవారం తాటిపల్లి రాజు తాటిపల్లి లక్ష్మి కాటిపల్లి సంధ్య షేక్ షబ్బీర్ అలీ అంబాల రాజు లపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు సిఐ తెలిపారు.

## వైభవంగా మార్కెట్ రోడ్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు



**కరీంనగర్, ఫిబ్రవరి 4(నినాదం న్యూస్ )** కరీంనగర్ మార్కెట్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రోజున అంకురార్పన శ్రీ గౌరిశంకర స్వామి దేవస్థానము (శివాలయం)పాత బజార్ నుండి పుట్టమన్ను తీసుకువచ్చే కార్యక్రమంలో పాల్గొన్న సుడా చైర్మన్,నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, సన్నాయి మేళాల నడుమ స్వామి వారి పూజాది, కైంకర్యాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించి బ్రహ్మోత్సవాలను ప్రారంభించగా చైర్మన్ ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం లో మాజీ ఏంఎల్ఏ అరెపెల్లి మోహన్, నాయకులు అంజన్ కుమార్, ధన్నుసింగ్, చింతలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

అవని

# కొబ్బరి నీళ్లు తాగడం ప్రమాదకరమే

ఎవరు... దూరంగా ఉంటే మంచిది



**కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. కొబ్బరి నీళ్లు సహజంగా తీపిగా, తాజాగా, పోషకాలతో నిండి ఉంటుంది. ఇందులో విటమిన్లు, ఖనిజాలు, ఎలక్ట్రోలైట్లు, యాంటీ ఆక్సిడెంట్లు, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడంలో, శక్తిని కాపాడటంలో సాయపడతాయి. శరీరంలో నీటి లోపాన్ని అధిగమించడానికి కొబ్బరి నీరు అద్భుత ఎంపిక. కొబ్బరి నీళ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది, ఇది మీ శరీరం నుంచి అదనపు నీటిని, వ్యర్థ పదార్థాలను తొలగిస్తుంది.**

**ఇవి కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. అయితే, ఆరోగ్య ప్రయోజనాలున్నప్పటికీ కొబ్బరి నీళ్లకి కొందరు దూరంగా ఉండాలి.**

**కొబ్బరి నీళ్లు ఎవరికి హానికరమో తెలుసుకుందాం.**



### కిడ్నీ సమస్యలు

కొబ్బరి నీళ్లలో పొటాషియం పరిమాణం చాలా ఎక్కువగా ఉంటుంది. ఒక కొబ్బరికాయలో దాదాపు 600 మి.గ్రా పొటాషియం ఉంటుంది. ఇది శరీరానికి చాలా అవసరం, కానీ మూత్రపిండాల సంబంధిత వ్యాధులు ఉన్నవారికి ఇది హానికరం. మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు తమ శరీరాల ద్వారా అదనపు పొటాషియంను సరిగ్గా ఫిల్టర్ చేయలేరు. ఇది హైపర్‌కలేమియా (రక్తంలో అధిక స్థాయి పొటాషియం) కు దారితీస్తుంది. దీనివల్ల కండరాల బలహీనత, క్రమరహిత హృదయ స్పందన, తీవ్రమైన సందర్భాల్లో గుండెపోటు కూడా వచ్చే ప్రమాదం ఉందంటున్నారు నిపుణులు

### లో బీపీ ...

కొబ్బరి నీళ్లు తాగడం వల్ల రక్తపోటు తగ్గుతుంది. అధిక రక్తపోటుతో బాధపడేవారికి ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే, ఇప్పటికే తక్కువ రక్తపోటు ఉన్నవారు కొబ్బరి నీళ్లు ఎక్కువగా తీసుకోకూడదు. ఎక్కువ తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం. కొబ్బరి నీళ్లు తీసుకోవడం వల్ల



రక్తపోటు మరింత తగ్గుతుంది. ఇది తల తిరగడం, అలసట, మూర్ఛ వంటి సమస్యలకు దారితీస్తుంది. అందుకే లోబీపీ సమస్యతో బాధపడేవారు కొబ్బరి నీళ్లు తాగకండి.

### డయాబెటిస్

కొబ్బరి నీళ్లలో సహజ చక్కెర అధిక మోతాదులో ఉంటుంది. ఇది కొబ్బరి నీళ్ల రుచికి తీపిని అందిస్తుంది. అయితే, ఈ చక్కెర డయాబెటిక్ రోగులకు మంచిది కాదు. వారికి సమస్యలను కలిగిస్తుంది. మధుమేహ రోగులు కొబ్బరి నీళ్లు ఎక్కువగా తీసుకుంటే వారి రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. అంతేకాకుండా షుగర్ లెవల్స్ అదుపులో ఉండకపోవచ్చు. అందుకే డయాబెటిక్ రోగులు కొబ్బరి నీళ్లు తాగే ముందు వైద్యుడి సలహా తీసుకోవడం మంచిది.

### శస్త్రచికిత్సకు ముందు...


ఏదైనా శస్త్రచికిత్స చేయించుకోబోతున్నట్లయితే, కొన్ని రోజుల ముందు కొబ్బరి నీళ్లు తాగకూడదు. కొబ్బరి నీళ్లలో ఉండే ఎలక్ట్రోలైట్లు, ఖనిజాలు శరీర రక్తపోటు, ఎలక్ట్రోలైట్ సమతుల్యతను ప్రభావితం చేస్తాయి. ఇది శస్త్రచికిత్స సమయంలో లేదా తరువాత సమస్యలను కలిగిస్తుంది. అందువల్ల, శస్త్రచికిత్సకు ముందు కొబ్బరి నీళ్లు తాగకుండా ఉండటం మంచిది.

### జీర్ణ సమస్యలు

ఈ రోజుల్లో చాలా మంది కడుపులో గ్యాస్, ఉబ్బరం, విరేచనాలు, మలబద్ధకం వంటి జీర్ణసమస్యలతో బాధపడుతున్నారు. ఇలాంటి వారికి కొబ్బరి నీళ్లు ఎక్కువ తీసుకోకూడదు. ఎక్కువ పరిమాణంలో తీసుకుంటే వివిధ రకాల సమస్యలు ఎదుర్కోవచ్చు. ఇప్పటికే ఇరిటబుల్ బవల్ సిండ్రోమ్ లేదా అల్సరేటివ్ కొలైటిస్ వంటి కడుపు సమస్యలు ఉన్నవారు కొబ్బరి నీళ్ళు జాగ్రత్తగా తీసుకోవాలి. అదనంగా, కొబ్బరి నీళ్లలో ఫైబర్ కూడా ఉంటుం ది. ఇది కొంతమందికి జీర్ణ సమస్యలను కలిగిస్తుంది.



### అలెర్జీ సమస్యలు



కొంతమందికి కొబ్బరి లేదా కొబ్బరి నీళ్ల వల్ల అలెర్జీ వచ్చే అవకాశం ఉంటుంది. అలాంటి వారు కొబ్బరి నీళ్లు తాగడం హానికరం. కొబ్బరి నీళ్ల వల్ల అలెర్జీ, చర్మంపై దద్దుర్లు, దురద, వాపు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తీవ్రమైన సందర్భాల్లో అనాఫిలాక్సిస్ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. మీకు కొబ్బరి నీళ్ల వల్ల అలెర్జీ ఉంటే, దూరంగా ఉండటమే మేలు.

### గమనిక,...

ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ఆరోగ్యాన్ని బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం. అలాగే, హెల్తీ లైఫ్ స్టైల్, సరైన ఆహారం కూడా తీసుకోవడం మీ ఆరోగ్యానికి ఎంతో మేలు.

మార్కెట్

## ఓలా నుంచి కొత్త ఎలక్ట్రిక్ బైక్

**బిజినెస్, (నినాదం):**

మార్కెట్‌లో ఓలా వాటా దాదాపు 25 నుంచి 30 శాతం వరకూ ఉంటుంది. ఈ నేపథ్యంలో కస్టమర్లకు ఓలా వ్యవస్థాపకుడు భవీష్ అగర్వాల్ ఓ శుభవార్త చెప్పారు. ఫిబ్రవరి 5వ తేదీ ఓలా ఎలక్ట్రిక్ బైక్‌ను విడుదల చేస్తున్నట్టు వెల్లడించారు. ఓలా ఎలక్ట్రిక్ బైక్ విడుదల విషయాన్ని వ్యవస్థాపకుడు భవీష్ అగర్వాల్ సోషల్ మీడియా ప్లాట్ ఫాం ఎక్స్ లో పంచుకున్నారు. ఆ బైక్ ను ఫిబ్రవరి 5న అధికారికంగా విడుదల చేస్తున్నట్టు వెల్లడించారు. ఇది ఈవీ మార్కెట్ లో విప్లవమని, దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల తదుపరి దశ తమ కొత్త ఉత్పత్తితో మొదలవుతుందన్నారు. గతంలో తాము సాధించిన మైలురాళ్లును కొత్త బైక్ అధిగమిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఎలక్ట్రిక్ బైక్ ను నడుపుతున్న వీడియోను సైతం అగర్వాల్ పోస్టు చేశారు. ఫిబ్రవరి 5వ తేదీ ఉదయం 10.30 గంటలకు రెడీగా ఉండాలని కోరారు. ఆ బైక్ కు సంబంధించిన చిత్రాలను కూడా పంచుకుంటున్నారు. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన రంగంలో ఓలా ఎలక్ట్రిక్ తన మార్కెట్ లీడర్ స్థానాన్ని తిరిగి పొందినట్టు ఇటీవల ప్రకటించింది. ఒక్క జనవరిలోనే 22,656 యూనిట్లను నమోదు చేసి ముందుకు దూసుకుపోయింది. గత నెలతో పోల్చితే 65 శాతం వృద్ధిని సాధించింది. ఎస్ 1 పోర్టు పోలియో, దేశంలో 4 వేల స్థానాలకు విక్రయాలు, సేవా నెట్ వర్క్ ను విస్తరించడం తదితర కారణాలతో ఓలా మార్కెట్ వాటా ఇప్పుడు 25 శాతానికి చేరింది. 2024 జనవరి 31వ తేదీ ఓలా నుంచి ఎస్1 బ్రాండ్ నుంచి 8 ఎలక్ట్రిక్ స్కూటర్లు విడుదలయ్యాయి. వీటిని జనరేషన్ 3 ప్లాట్ ఫాంలో విడుదల చేయడం విశేషం. వీటి ధరలను రూ.79,999 నుంచి రూ.1,69,999గా నిర్ధారణ చేశారు. కాగా.. జెన్ 3 స్కూటర్లతో తమ సమర్థత, పనితీరు, భద్రత, విశ్వసనీయత మరింత పెరుగుతుందని కంపెనీ ఆశాభావం వ్యక్తం చేసింది. ఎలక్ట్రిక్ వెహికల్స్ విభాగంలో ఓలా సంస్థ నంబర్ వన్ అని చెప్పవచ్చు. ఈ కంపెనీ తయారు చేసిన స్కూటర్లకు మార్కెట్ లో ఎంతో డిమాండ్ ఉంది. ఇప్పుడు ఎలక్ట్రిక్ బైక్ విభాగంలోనూ సత్తా చాటాలని కంపెనీ ప్రయత్నిస్తోంది. దీనిలో భాగంగా వ్యవస్థాపకులు భవీష్ అగర్వాల్ తమ కొత్త బైక్ చిత్రాలను ఎక్స్ లో పోస్టు చేశారు. ఓలా కంపెనీ హెడ్ క్వార్టర్ బెంగళూరులో ఉండగా, మ్యాన్యుఫాక్చరింగ్ యూనిట్ మాత్రం తమిళనాడుతో ఏర్పాటు చేశారు. అక్కడ తయారైన స్కూటర్లను దేశం వ్యాప్తంగా విక్రయిస్తారు.






**బిజినెస్, (నినాదం):**

దేశీయ ఈక్విటీ మార్కెట్లలో భారీ లాభాలు నమోదయ్యాయి. ఇటీవల కేంద్ర బడ్జెట్ విడుదలైనప్పటికీ అంతర్జాతీయ పరిణామాల వల్ల సూచీలు వరుస నష్టాలను ఎదుర్కొన్నాయి. అంతకుముందు సెషన్‌లో ఉత్తర అమెరికాలో జరుగుతున్న వాణిజ్య యుద్ధం కారణంగా మార్కెట్లు దెబ్బతిన్నాయి. తాజాగా మంగళవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెనడా, మెక్సికో దేశాలపై విధించిన పన్ను అమలును వాయిదా వేయడంతో మార్కెట్లకు సానుకూల మద్దతు లభించింది. ఈ నిర్ణయం ఆసియా మార్కెట్లలోనూ ర్యాలీకి కారణమైంది. మరోవైపు దేశీయంగా బుధవారం నుంచి జరగనున్న ఆర్‌బీఐ ఎంపీసీ సమావేశంలో వడ్డీ రేట్ల తగ్గింపు ఉంటుందనే అంచనాలతో కీలక బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లలో కొనుగోళ్లు పుంజుకున్నాయి. ఈ ఏడాది జనవరి నెలకు సంబంధించి వాహన మార్కెట్లో అమ్మకాలు ఊపందుకోవడం,

తాజా బడ్జెట్‌లో ప్రకటించిన వినియోగ సంబంధిత నిర్ణయాలతో వాహనాల అమ్మకాలు పెరగనున్నాయనే సంకేతాలు ర్యాలీకి మరింత దోహదపడ్డాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స ఇండెక్స వెయ్యికి పైగా పాయింట్లు పుంజుకుంది. గత కొన్ని సెషన్లుగా బలహీనపడిన తర్వాత కనిష్టాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపించడం కూడా భారీ లాభాలకు కారణమయ్యాయి. దీంతో మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స 1,397.07 పాయింట్లు ఎగసి 78,583 వద్ద, నిఫ్టీ 378.20 పాయింట్లు లాభపడి 23,739 వద్ద ముగిశాయి. నిఫ్టీలో ఎఫ్ఎంసీజీ మినహా అన్ని రంగాలు పెరిగాయి. సెన్సెక్స ఇండెక్సలో ఎల్అండ్‌టీ, అదానీ పోర్ట్స్, ఇండస్ఇండ్ బ్యాంక, టాటా మోటార్స్, రిలయన్స్, ఆల్ట్రా సిమెంట్, ఏషియన్ పెయింట్ వంటి షేర్లు అధిక లాభాలను చూశాయి. ఐటీసీ హోటల్స్, జొమాటో, నెస్లె ఇండియా, మారుతీ సుజుకి షేర్లు నష్టాలను నమోదు చేశాయి. అమెరికా డాలరుతో రూపాయి మారకం విలువ రూ. 87.10 వద్ద ఉంది.

## కొత్త కారుతో మార్కెట్‌లోకి హోండా ఎంట్రీ..

**బిజినెస్, (నినాదం):**

ప్రస్తుతం మన దేశంలో సిటీ, అమేజ్, ఎలివేట్ అనే మూడు రకాల కార్లను హోండా కంపెనీ విక్రయిస్తోంది. అయితే వీటి అమ్మకాలు మాత్రం అనుకున్నంత ఆశాజనకంగా లేవు. దీంతో మార్కెట్ లో విక్రయాలు పెంచుకునేందుకు కంపెనీ నిరంతరం అనేక ప్రయత్నాలు చేస్తోంది. దానిలో భాగంగానే హోండా సిటీ అపెక్స్ ఎడిషన్ ను విడుదల చేసింది. హోండా సిటీ అపెక్స్ ను చూడగానే ఆకట్టుకునేలా మంచి లుక్ తో తీర్చిదిద్దారు. కొన్ని ఫీచర్లను అప్ గ్రేడ్ చేశారు. కస్టమర్లను ఆకర్షించే ఆరు రకాల రంగుల్లో అందుబాటులోకి తీసుకువచ్చారు. వీ, వీఎక్స్ అనే రెండు రకాల వేరియంట్లలో హోండా సిటీ అపెక్స్ ఎడిషన్ విడుదలైంది. సాధారణ మోడల్ కంటే భిన్నంగా చూపించడానికి కొన్ని చర్యలు తీసుకున్నారు. ఫ్రంట్ ఫెండర్, టెయిల్ గేట్ పై అపెక్స్ ఎడిషన్ అని ప్రత్యేకంగా బ్యాడ్జ్ డిజైన్ చేశారు. ఇంటీరియర్ ను గోధుమరంగులో తీర్చిదిద్దారు. సీటు బ్యాక్ రెస్ట్ పై అపెక్స్ ఎడిషన్ ఎంబోస్ వేశారు. కుషన్లపై కూడా ఇలాంటి బ్రాండింగ్ ఉంది. డాష్ బోర్డు, డోర్ ప్లాడ్లు, ఇన్ స్ట్రుమెంట్ క్లస్టర్ పై సాఫ్ట్ టచ్ ఫినిషింగ్, మల్టీ కలర్ యాంబియంట్ లైటింగ్ ఆకట్టుకుంటోంది. ఫీచర్లు, భద్రతా విషయాలకు వస్తే దాని సాధారణ మోడల్ మాదిరిగానే ఉంటాయి. 8 అంగుళాల టచ్ స్క్రీన్, వైర్ లెస్ ఫోన్ చార్జర్, సింగిల్ – పేన్ సన్ రూఫ్, సెమీ – డిజిటల్ ఇన్ స్ట్రుమెంట్ క్లస్టర్ తదితర ఫీచర్లు బాగున్నాయి. అలాగే సిటీ సెడాన్ కారులో మాదిరిగానే సెఫ్టీ ఏర్పాటు చేశారు. ఆరు ఎయిర్ బ్యాగులు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్, అడాస్ వంటి



వాటిని స్టాండర్డ్ గా ఇచ్చారు. హోండా సిటీ అపెక్స్ ఎడిషన్ పవర్ ట్రెయిన్ విషయానికి వస్తే 1.5 లీటర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్ అమర్చారు. దీని నుంచి 121 పీఎస్ పవర్, 145 న్యూటన్ మీటర్ టార్క్ విడుదల అవుతుంది. ఈ కారు రూ.13.30 లక్షల నుంచి రూ.15.62 లక్షల (ఎక్స్ షోరూమ్)కు అందుబాటులో ఉంది.

## రాకెట్‌లా దూసుకెళ్తున్న పసిడి

### 90 వేలకు చేరువైన బంగారం

**బిజినెస్, (నినాదం):**

పండుగలు, పెళ్లిళ్లు.. ఇలా శుభకార్యాలు ఏవైనా ముందుగా గుర్తొచ్చేది బంగారం. ముఖ్యంగా భారతీయ మహిళలకు బంగారం అంటే ఎంతో ఇష్టం. ఇక బంగారాన్ని కేవలం ఆభరణంగానే కాదు.. పెట్టుబడి సాధనంగా కూడా భావిస్తారు. అయితే, అంతర్జాతీయ మార్కెట్‌లో అనిశ్చితి కారణంగా.. దేశీయంగా పసిడి ధరలు పైపైకి దూసుకెళ్తున్నాయి. 2025లో బంగారం ధరలు ఆల్ టైమ్ రికార్డుకు చేరుకుంటాయని మార్కెట్ల విశ్లేషకులు అంచనా వేసినట్లుగానే రాకెట్‌లా దూసుకెళ్తున్నాయి. ఇవాళ (ఫిబ్రవరి 4) ఒక్కరోజే ఏకంగా తులం బంగారంపై రూ.1150 పెరిగి.. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.85,200కు చేరింది. దీంతో త్వరలోనే తులం బంగారం ధర రూ.90 వేలకు చేరే అవకాశాలు కనిపిస్తోన్నాయి. పెరుగుదలకు కారణాలు.. అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయాలు అంతర్జాతీయంగా బంగారం ధరలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కెనడా, మెక్సికో, చైనా ఉత్పత్తులపై భారీగా టారిఫ్‌లు ప్రకటించిన ట్రంప్.. తదుపరి మెక్సికోకు మాత్రం విరామం కల్పించారు. ఈ క్రమంలో అమెరికా వస్తువులపై పన్ను విధిస్తామని కెనడా, చైనా ప్రకటించిన నేపథ్యంలో సోమవారం అంతర్జాతీయంగా స్టాక్ మార్కెట్లు నష్టపోయాయి. ఈ నేపథ్యంలో మదుపర్లు తమ పెట్టుబడులను సురక్షితంగా ఉండేందుకు బంగారం వైపు మళ్లించటంతో పుత్తడి ధర కొండెక్కింది. ముమ్ముందూ పరిస్థితులు ఇలాగే కొనసాగితే బంగారం ధరలు కొత్త రికార్డుల్నే సృష్టించే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు పెళ్లిళ్ల సీజన్ కావటంతో దేశీయంగా బంగారం కొనుగోళ్లు విపరీతంగా పెరిగాయి. ఇది కూడా ధరల పెరుగుదలకు కారణంగా చెబుతున్నారు. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ 2,827.50 డాలర్లుగా నమోదైంది. క్రితంతో పోల్చితే 7.50 డాలర్లు పెరిగింది. ఔన్స్ సిల్వర్ 32.10 డాలర్లు పలికింది. బంగారంతో పాటు వెండి కూడా ఈ ఏడాది ఆకాశమే హద్దుగా పరుగులు పెట్టవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇందులో భాగంగానే దేశీయ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.1,25,000 వరకు వెళ్లొచ్చని పేర్కొంటున్నారు. ప్రస్తుతం కిలో వెండి ధర రూ.1,06,000 వద్ద కొనసాగుతోంది. ఇక 2024లో రూ.1,02,000 ల ధరతో దేశీయంగా సిల్వర్ ఆల్‌టైమ్ హై రికార్డుకు చేరిన సంగతి తెలిసిందే.



## తాటి చెట్టు పై నుండి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



**సుల్తానాబాద్, ఫిబ్రవరి 04 (నినాదం న్యూస్):** తాటి చెట్టు పై నుండి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే సుల్తానా బాద్ మండల కేంద్రానికి చెందిన మంద కిషన్ గీత కార్మికుడు తన గీత వృత్తి లో భాగంగా సుగ్లాంపల్లి లో ఉన్న తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమా దవశాత్తు చెట్టు పైన కింద పడడంతో పక్క ఎము కలు,తొంటి విరిగి తీవ్ర గాయాలు కాగా కరీంన గర్ లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న మంద కిషన్ ను ప్రభుత్వం ఆదుకోవాలని తోటి గీత కార్మికులు కోరుతున్నారు.

## దుమ్ము దూళి నుంచి ప్రజలను కాపాడండి

### -కమిషనర్ కు వినతి పత్రం అందించిన బిఆర్ఎస్ శ్రేణులు



**సుల్తానాబాద్, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్):** దుమ్ము ధూళితో ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారని బీ ఆర్ ఎస్ యూత్ ప్రెసిడెంట్ ఎం డి వా యిద్ వైస్ ప్రెసిడెంట్ గాజుల అరుణ్ కుమార్, లు కమిషనర్ కు వినతి ప త్రంఅందజేశారు. మంగళ వారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ను కలిసి వినతిపత్రం అందించిన అనంతరం వారు మాట్లాడుతూ సుల్తానాబాద్ మండల కేంద్రంలోని తెలం గాణ చౌరస్తా నుండి వడ్డెర కాలనీ వరకు ని త్యం వేలాది వాహనాల రాకపోకలతో నిత్యం దు మ్ము దూళితో ప్రజలు,వ్యాపారులు,ద్విచక్ర వాహ నదారులు,పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారని అన్నారు. అలాగే స్థానికంగా నివసించే ప్రజల గృహాలు ఉండడంతో వారి గృహాలలో సై తం దుమ్ము చేరి వివిధ రోగాల బారిన పడిన సం దర్భాలు ఉన్నా యని చెప్పారు. కాబట్టి నిత్యం దు మ్ము లేవకుండా రోడ్డుపై నీరు చల్లించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్ర మంలో అర్జున్, సంపత్, విజయ్,లతోపాటు పలు వురు పాల్గొన్నారు.

## ఈ నెల 9న జాబ్ మేళా..

**పెద్దపల్లి, ఫిబ్ర వరి 04(ని నాదం న్యూస్):**
డిజిటల్ ఎం ప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ ఢీ.ఈ.ఈ.టీ,మరియు శ్రీ చైతన్య విద్యాసంస్థలు సంయుక్తంగా ఆదివారం శ్రీ చైతన్య స్కూల్ క్యాంపస్,సారథి స్టూడియో పక్కన, మెట్రో పిల్లర్ 1463,యూసఫ్ గూడ రోడ్, అమీర్ పేట్,హైదరాబాద్ వేదికగా ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.హైదరాబాదులోని శ్రీ చైతన్య విద్యా సంస్థల శాఖలలో ప్రిన్సిపాల్, లెక్చరర్స్ అడ్మినిస్ట్రేషన్ మొదలగు 33 కేటగిరీలలో 500కు పైగా ఉద్యోగ ఖాళీలను ఈ జాబ్ మేళా ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపారు టీచింగ్, నాన్ టీచింగ్,అడ్మిని స్టేషన్ మరియు మేనేజ్మెంట్ రంగంలో ఆసక్తి కలిగిన నిరుద్యోగులు కనీస డిగ్రీ విద్యార్హత కలిగి ఉండాలని,ప్రిన్సిపాల్ మరియు లెక్చరర్ పోస్టులకు నిర్దేశిత పీజి డిగ్రీ కలిగి ఉండాలని,టీచింగ్ పోస్టులకు 2-5 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని ఈ సందర్భంగా వారు తెలిపారు.ఈ జాబ్ మేళాకు 5 కాపీల బాయోడాట తో పాటు దరఖాస్తు చేసిన పోస్ట్ కు సంబంధిత జిరాక్స్ సర్టిఫికెట్ లతో హాజరు కావలసి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## గౌరవ వేతనం విడుదల చేయండి



**వెల్గటూర్,ఫిబ్రవరి04(నినాదం న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆర్థిక,రాజకీయ,విద్య కుల సర్వేలో పాల్గొన్న సిబ్బందికి ప్రభుత్వం ద్వారా రావాల్సిన గౌరవ వేతనం విడుదల చేయాలని ఎండపల్లి మండల పీఆర్టియు శాఖ సభ్యులు ఎంపీడీవో జక్కుల శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎండ పల్లి మండల నూతన ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ ను ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో నిమ్మ రవి, జోగం శ్రీనివాస్,మామిడి సంతోష్,ధర్మేందర్,దెందుకూరు జగన్నాథ రావు,తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన అన్నయ్యగౌడ్



**సుల్తానాబాద్, ఫిబ్రవరి 04(నినాదం న్యూస్):** సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్గా మహమ్మద్ నియాజ్ ఇటీవల నూతనంగా బాధ్యతలు తీ న్న సందర్భంగా ఆయనను మంగళవారం జి ల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అంతటి అన్న య్య గౌడ్, పలువురు కౌన్సిలరు మైనారిటీ సంఘం నాయకులు తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాం క్షలు తెలిపారు.సందర్భంగా సు ల్తానాబాద్ పట్టణ స్థితిగతులపై అన్నయ్య గౌడ్ కమిషనర్ కు వివరించారు. ఈ కా ర్యక్రమంలో దున్నపోతుల రాజయ్య,రఫీక్, పుచ్చు,వసీం తది తరులు ఉన్నారు.

## చెన్న కృష్ణారెడ్డి పట్టా భద్రుల ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయం ప్రారంభం



**కరీంనగర్, ఫిబ్రవరి 4(నినా దం న్యూస్ ):** కరీంనగర్ పట్టణం కేంద్రంలో తెలంగాణ యువశక్తి ఆధ్వర్యం లో ఉమ్మడి కరీంనగర్, నిజామాబాదు, ఆదిలాబాద్, మేదక్ ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థి ప్రొఫెసర్ చెన్న కృష్ణారెడ్డి క్యాంప్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఉద్దేశ్యంను కృష్ణా రెడ్డి వివరిస్తూ, ఈ ఎన్నికల్లో విజయవంతంగా పోరాడే నాయకుడు కావాలని అందుకే పట్టభద్రుల తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా ముందుకు వస్తున్నానని తనను బలపరిచి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. వారంతా అనుకూలంగా స్పందించి గెలుపుకి తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దుర్గం రవీందర్, ఎసి రెడ్డి, సంతోష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమంలో తెలంగాణ యువ శక్తి నాయకులు, చెన్న కృష్ణా, అభిమానులు, విద్యార్థులు, యువకులు, ఆత్మీయ మిత్రులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## బాధితులకు అండగా నిలిస్తే అక్రమ కేసులా.?

### -సామాజిక కార్యకర్త సాబీర్ అలీ దళిత నేత అంబాల రాజు

**జమ్మికుంట, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్) :**
నిరుపేద కుటుంబానికి చెందిన దళిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ నిరాహార దీక్ష చేస్తున్న వారికి అండగా నిలిచిన మాపై అక్రమ కేసులు పెడితే భయపడేది లేదని సామాజిక కార్యకర్త సాబీర్ అలీ దళిత నేత అంబాల రాజు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ భూమిని అక్రమంగా కబ్జా చేశారని గత కొన్ని నీళ్లుగా కాటిపల్లి లక్ష్మి అధికారుల చుట్టూ తిరిగి చేసేది ఏమీ లేక అదే స్థలంలో రిలే నిరాహార దీక్షకు దిగడంతో వారికి మద్దతు తెలిపామని ఆయన అన్నారు. నిరుపేద కుటుంబానికి న్యాయం కోసం మద్దతు తెలిపితే మాపై కావాలని అక్రమ కేసులు పెడుతున్నారని ఇలాంటి కేసులకు భయపడేది లేదని వారు వీడియో విడుదల చేశారు.

### మంత్రులు పొన్నం, ఉత్తమ్ కుమార్ రెడ్డిలను

# సన్మానించిన కాంగ్రెస్ నేతలు

- కుల గణన ఒక చరిత్రత్మక నిర్ణయం
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేశిని కోటి



**జమ్మికుంట, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్):**
తెలంగాణ రాష్ట్రంలో బీసీల ఆర్థిక సామాజిక రాజకీయ అభివృద్ధి కోసం కులగణన చేపట్టి విజయవంతంగా పూర్తి చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లను సన్మానించిన కాంగ్రెస్ నేత దేశిని కోటి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల గణన చేయడం అనేది ఒక చరిత్రత్మక నిర్ణయమని అలాంటి సాహసాన్ని చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం విజయమని ఆయన కొనియాడారు. కులగణన నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టి బీసీల జనాభా ప్రకారము వారికి రాజకీయ ఆర్థిక ఉద్యోగ ఉపాధి రంగాలలో అవకాశాలు రిజర్వేషన్లు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న సందర్భంగా కులగణన కోసం ఎంతగానో కృషిచేసిన ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కు గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఘన సన్మానం చేసాము కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్న కోటి. దొంత రమేష్ . జిల్లెల్ల తిరుపతి రెడ్డి .తడక శ్రీకాంత్ .బొంగోని వీరన్న . పంజాల అజయ్ పాల్గొన్నారు.

# కుల గణన చారిత్రాత్మక నిర్ణయం

### -కుల గణన పై వారు ప్రస్తావించడం క్షమించరాని నేరం కింద లెక్కే
### -కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు



కరీంనగర్,ఫిబ్రవరి 4(నినాదం న్యూస్ )
కాంగ్రెస్ మాట ఇస్తే మడమ తిప్పదని, ఇచ్చిన మాట ప్రకారం కుల గణన, సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి, ఆ నివేదికను అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టడం చారిత్రాత్మకమని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. ఈరోజు సువర్ణ అక్షరాలతో లెక్కించదగ్గ రోజు అని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం మీడియాతో వెలిచాల రాజేందర్ రావ్ మాట్లాడుతూ, అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో భాగంగా ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య, రాజకీయ, కుల సర్వే -2024 నివేదికను ఇవాళ శాసనసభలో సీఎం రేవంత్, మండలిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రవేశ పెట్టడం హర్షనీయమని పేర్కొన్నారు. 4 ఫిబ్రవరి, 2024 కులగణనకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. సర్వేలో 3.54 కోట్ల కుటుంబాలు పాల్గొన్నాయని, 75 అంశాల ప్రాతిపదికగా సర్వే జరిగిందని రాష్ట్రవ్యాప్తంగా 1,03,889 ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లతో సర్వే నిర్వహించడం రికార్డు అని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 6 నవంబర్, 2024న ప్రారంభమైన సర్వే 25 డిసెంబర్, 2024 వరకు 50 రోజుల పాటు కొనసాగడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు గొప్ప నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు రాజేందర్ రావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సరిగ్గా ఏడాదిలోపు ఈ నిర్ణయం నివేదికగా మారి సభముందుకు వచ్చిందని, ఇది ఓ చరిత్రాత్మక సందర్భం అని పేర్కొన్నారు. సర్వే తయారీలో కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ సంఘాలు, మేధావుల అభిప్రాయాలతో పాటు కర్ణాటక, బిహార్ సహా వివిధ సర్వేలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిందని, ఇది ఆషామాషీగా చేసిన సర్వే కాదని పేర్కొన్నారు. ఈ సర్వే ద్వారా సేకరించిన డేటాను షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, రాష్ట్రంలోని ఇతర బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి విధానాల రూపకల్పన చేయడానికి ప్రభుత్వం ఉపయోగిస్తుందని తెలిపారు. కులగణన సమగ్ర సర్వేలో పాల్గొనని కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్ కులగణన పై మాట్లాడే అర్హత లేదని రాజేందర్ రావ్ మండిపడ్డారు.

## ఆన్ లైన్ మోసాలపై విద్యార్థులకు అవగాహన



పెద్దపల్లి,ఫిబ్రవరి 04(నినాదం)
పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్తులకు ఆన్ లైన్ మోసాలపై రామగుండం సీ.పీ ఆదేశాల మేరకు షీటీం ఇంచార్జీ లావణ్య ఆద్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం ఇంచార్జ్ ఎస్.లావణ్య మాట్లాడుతూ మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు ఆంటీ డ్రగ్స్ పై జాగ్రత్తగా ఉండాలని సూచించారు.మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన కూడళ్లలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీటీం నిరంతరంగా ఉంతుందని తెలిపారు.ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా ఈ ఫోన్ నం.6303923700 కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు.ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటి జోలికి పోకుండా ఉండాలని,ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి తక్షణమే సమాచారం ఇవ్వాలని,అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 కు డయల్ చేయాలని తెలిపారు.అమ్మాయిలు జాగ్రత్తగా ఎలా ఉండాలో వివరించారు.షీటీమ్ సభ్యులు స్నేహలత,మౌనిక, ప్రిన్సిపాల్ డా.శ్రీనివాస్, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓట్ల కోసం కాదు, అభివృద్ధి చేయడం కోసం వచ్చా



సుల్తానాబాద్, ఫిబ్రవరి 04 (నినాదం న్యూస్):
ఓట్ల కోసం కాదు అభివృద్ధి చేయడం కోసం వచ్చా, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒకసారి అవకాశం ఇవ్వండి అ ని కరీంనగర్, నిజామాబాద్,ఆదిలాబాద్ మెదక్ జి ల్లా పట్టబద్రులనియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి రవీందర్ సింగ్ వాకర్స్ ను కోరారు. మంగళవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూ నియర్ కళాశాల మైదానంలో ఎమ్మెల్సీ అభ్యర్థి రవీందర్ సింగ్ మాట్లాడుతూ,పట్టభద్రుల టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో లోగడ గెలిచిన అభ్యర్థులు ఎ వరైనా సమస్యల పరిష్కారం కోసం కొట్లాడారా.... గెలుపు కోసమే ఆరాటపడ్డారే తప్ప ఎనాడు సమ స్యల పరిష్కారం కోసం కొట్లాడింది లేదని అన్నా రు. తాను కౌన్సిలర్ గా ఎన్నో మార్లు ఎన్నికయ్యా అని, ఏనాడు ఎవరి దగ్గర ఒక రూపాయి తీసుకు న్న దాఖలు లేదని అన్నారు. రాష్ట్ర మంతా రూపా యికి నల్ల కలెక్షన్ తీసుకొచ్చిన ఘనత తన దేనని అన్నారు. అలాగే రూపాయికే అంత్యక్రియలు క రీంనగర్ మున్సిపాలిటీలో తీసుకొచ్చింది కూడా నే నే అన్నారు. నన్ను ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఎంతమం ది నిరుద్యో గులు ఉన్న రూపాయికే ఇన్సూరెన్స్ చే పిస్తానని హామీ ఇచ్చారు. సుల్తానాబాద్ వాకర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇ చ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అయిల రమే ష్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యద ర్శులు బైరగౌనిరవీందర్ గౌడ్,మంద శ్రీనివాస్ గౌడ్,కొమురవెల్లి భాస్కర్,చొప్పరి సుమన్, పరశు రాం,రవీందర్,ఉల్లంగుల శ్రీనివాస్,ప్రశాంత్, కందు నూరి కుమార్, నిట్టూరి శ్రీనివాస్,వెంకన్నతోపాటు వాకర్స్,బిఆర్ఎస్ నాయకులు తదితరులు పా ల్గొన్నారు.

## పేదలకు అండగా మంత్రి శ్రీధర్ బాబు



**మంథని ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్):**
తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్ర మల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన లక్ష్మి అనారోగ్యం తో బాధపడుతుండగా లక్ష ఎల్ ఓ సి మంజూరు చేయించారు. లక్ష్మి ఆస్పత్రిలో అనారోగ్యంతో చేరి చికిత్స పొందుతున్నట్లు సహాయం కొరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి తెలుపగా వెంటనే సీఎం సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తము వీరికి లక్ష రూపాయలు మంజూరు చేయించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకులు మంగళవారం ఎల్ ఓ సి మంజూరు కాపీని హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజే శారు. ఎల్ఓసి మంజూరు చేయించిన మంత్రి శ్రీధర్ బాబుకు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## తేజ విద్యాలయ సరి కొత్త రికార్డు

**కోదాడ, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్):** సంపూర్ణ బ్యాంకింగ్ ఖాతాదారుల పాఠశాలగా తేజ విద్యాలయ సరికొత్త రికార్డు సృష్టించింది. మంగళవారం పాఠశాలలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోదాడ మేనేజర్ వీరస్వామి ఆర్థిక అక్షరాస్యత ప్రాముఖ్యత వివరించారు. పాఠశాలలో అర్హత ఉన్న 192మంది విద్యార్థులు బ్యాంకు ఖాతాలు తెరవడం శుభపరిణామం అని పేర్కొన్నారు. మొత్తం అర్హత ఉన్న విద్యార్థులు బ్యాంక్ ఖాతా దారులుగా అకౌంట్స్ తెరవడం కొత్త రికార్డుగా నిలిచిపోతుందని ఈ సందర్భంగా తెలిపారు. నేటి విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత చాలా ముఖ్యం అని వివరించారు. దీని రిజర్వ్ బ్యాంకు వారు పాఠశాల విద్యలో భాగం చేయడం జరిగిందని పేర్కొన్నారు. విద్యార్థులకు ఆర్థిక పరంగా పొదుపు విలువ తెలుసు కోవడం, డబ్బును డిజిటల్ టెక్నాలజీ సహాయంతో వాడటం ,ఆర్థిక పరమైన సైబర్ నేరాల నుంచి జాగ్రత్త వహించడం వంటి అంశాలపై చైతన్యం చేయడం జరిగింది. విద్యార్థులకు అందరికి ఉచితంగా జీరో ఎకౌంట్ బ్యాంకు ఖాతాలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోదాడ వారి సహకారంతో ఖాతాలను తెరిపించడం జరిగింది.

## ప్రాక్టికల్స్, ఒకేషనల్ పరీక్షలు ప్రశాంతం

**పెద్దపల్లి,ఫిబ్రవరి04(నినాదం):**
పెద్దపల్లి జిల్లాలో 33 కేంద్రాలలో జంతు శాస్త్రం,ఫిజిక్స్,కెమిస్ట్రీ,ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి కల్పన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా వ్యాప్తంగా వివిధ కేంద్రాల్లో మంగవారం జరిగిన ప్రాక్టికల్ పరీక్షలో 563 మంది విద్యార్థులకు గాను 556 మంది విద్యార్థులు ఒకేషనల్ ఎగ్జామ్ కు గాను 776 మంది విద్యార్థులకు గాను 712 మంది విద్యార్థులు ఉదయం హాజరు కాగా మధ్యాహ్నం జరిగిన పరీక్షలో ప్రాక్టికల్స్ కు 329 మంది విద్యార్థులకు గాను 327 మంది విద్యార్థులు ఒకేషనల్ ఎగ్జామ్ కు 686 మంది విద్యార్థులకు గాను 642 మంది విద్యార్థులు హాజరైనట్టు ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి కల్పన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.


## ఎస్ఎస్సి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

### -మండల విద్యాధికారి ఏ రాజయ్య
### -ఎస్ఎస్సి విద్యార్థులకు అల్పహారం పంపిణీ చేసిన ఎంఈఓ




**సుల్తానాబాద్, ఫిబ్రవరి 04 (నినాదం న్యూస్):**
ఎస్ఎస్సి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించా లని సుల్తానాబాద్ మండల విద్యాధికారి ఆరేపల్లి రాజయ్య విద్యార్థులకు సూచించారు.మంగళవా రం పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉద్దేశంతో ఉదయం,సాయంత్రం ప్ర త్యేక తరగతులు నిర్వహించాలని,.. అందులో భా గంగా పదవ తరగతి విద్యార్థులు జడ్.పి. హెచ్.ఎ స్ కనుకుల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల సుల్తానా బాద్ లో మండల విద్యాధికారి రాజయ్య పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం ప్రారంభించా రు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రభు త్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10 వ తర గతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించా లని లక్ష్యంతో ప్రణాళిక సిద్ధం చేయాలని అన్నా రు.సీ గ్రేడ్ విద్యార్థుల పైన ప్రత్యేకంగా శ్రద్ధ వహిం చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు టి. దివాకర్, శ్రీ ఎస్ ర త్నాకర్ రెడ్డి, సిఆర్పిలు సదానందం రామచంద్రం ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



**మంచిర్యాల ప్రతినిధి. ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్):**
నేరాల నియంత్రణ, కేసుల చేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర వహిస్తాయని శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్ పేర్కొన్నారు. మంగళవారం కృష్ణ కాలనీ లో ప్రజల సహకారంతో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు తదితర సంఘటనలు జరిగినప్పుడు సీసీ కెమెరాలు ద్వారా పట్టుకోడానికి పోలీసులకు సహకరిస్తాయని పేర్కొన్నారు. శ్రీరాంపూర్ ఏరియా లోని అన్ని వార్డుల ప్రజలు కూడా సీసీ కెమెరాలు అమర్చుకోవాలని తెలిపారు. సీసీ కెమెరాలు పనిచేయడం నేరాలు తగ్గుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్ పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుడి మృతి

**చౌటుప్పల్, ఫిబ్రవరి 4 (నినాదం న్యూస్):** ప్రమాదవశాత్తు 4వ అంతస్థు నుండి భవన నిర్మాణ కార్మికుడు క్రింద పడి మృతి చెందినట్లు ఎస్సై యాదగిరి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునూరు గ్రామం, యుద్దనపూడి మండలం, బాపట్ల జిల్లాకు చెందిన చిన్న నాగ భూషణం (43) జీవనోపాధికై పట్టణంలోని రామ్ నగర్లో నివాసముంటు జీవిస్తున్నాడు. హెచ్ఎండీ వెంచర్‌లోని వలిగొండ రోడ్డు సమీపంలోని టోపి కృష్ణ, బ్రహ్మయ్య వద్ద తాపీ పనికి వెళ్లిన నాగభూషణం ప్రమాదవశాత్తు 4వ అంతస్తు నుంచి కింద పడి కాళ్లు, కడుపుకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే చుట్టుపక్కల వారు ప్రథమ చికిత్స అనంతరం చౌటుప్పల్ సీహెచ్‌సీకి తరలించారు.

### లాభసాటి పంట ఆయిల్ ఫామ్ సాగు పెంపుకు

# ప్రణాళికాబద్ధంగా చర్యలు

- నిర్దేశిత లక్ష్యం మేరకు ఆయిల్ పామ్ పంట సాగు పూర్తి చేయాలి
- ప్రతి మండలంలో అవసరమైన మేర యూరియా స్టాక్ అందుబాటులో పెట్టుకోవాలి
- ఆయిల్ ఫామ్ మొక్కల గ్రౌండింగ్, ఎరువుల లభ్యత పై సమావేశం
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ.హర్ష



**పెద్దపల్లి,ఫిబ్రవరి04(నినాదం)**

జిల్లాలో లాభసాటి పంట ఆయిల్ ఫామ్ సాగు పెంపుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ. హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఆయిల్ ఫామ్ మొక్కల గ్రౌండింగ్, ఎరువుల లభ్యత పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరంలో మన జిల్లాలో 750 ఎకరాలలో ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ జరిగిందని,ఈ సంఖ్యను నిర్దేశిత లక్ష్యం మేరకు 1000 ఎకరాలకు తీసుకొని పోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఆయిల్ పామ్ సాగు పురోగతి పై వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు రెగ్యులర్ మానిటరింగ్ చేయాలని అన్నారు.ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి పరిధిలో లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని, దాని సాధన కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని అన్నారు. జిల్లాలో పెద్ద రైతులను ముందుగా లక్ష్యం చేసుకొని, ఆయిల్ పామ్ సాగు వల్ల కలిగే ఉపయోగాలు వివరిస్తూ,వారిలో ఉన్న భూమిలో కొంత మేర ఆయిల్ పామ్ కు డైవర్ట్ అయ్యేలా చూడాలని అన్నారు. ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తి కనబర్చే రైతుల నుంచి త్వరితగతిన మొక్కలకు,డ్రిఫ్ట్ కు డీ.డీ.,లు కట్టించాలని అన్నారు.ఆయిల్ పామ్ మొక్కలు నాటిన రైతుకు సబ్సిడీ అందేలా చూడాలని,డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోనీ ప్రతి మండలంలో అవసరమైన మేర యూరియా స్టాక్ అందుబాటులో పెట్టుకోవాలని, ఎక్కడ ఎటువంటి కొరత రావడానికి వీలు లేదని అన్నారు. మండలంలో ప్రైవేట్ వ్యాపారుల వద్ద ఉన్న స్టాక్ తనిఖీ చేస్తూ ఎక్కడ కృత్రిమ కొరత సృష్టించకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఎరువుల కొరత సంబంధించి ఎక్కడైనా చిన్న సమస్య వచ్చిన వెంటనే స్పందించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో పంటల క్రాప్ బుకింగ్ పకడ్బందీగా పూర్తి చేయాలని, ఏం పంటలు ఎంత విస్తీర్ణంలో సాగు అవుతున్నాయో పక్కా వివరాలు మన వద్ద ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డి.హెచ్.ఎస్.ఓ జగన్మోహన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రోన్ సర్వేతో మాస్టర్ ప్లాన్

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**




**మంచిర్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 4(నినాదం):**

మంచిర్యాల కార్పొరేషన్ డ్రోన్ సర్వే ద్వారా మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపం పేర్కొన్నారు. మంగళవారం నస్పూర్ లోని కలెక్టర్ కార్యాలయంలో మాస్టర్ ప్లాన్ ప్రతిపాదన రూపకల్పనపై అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల మున్సిపాలిటీని ప్రభుత్వం కార్పొరేషన్ గా మార్చినందున మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు జి.ఐ.ఎస్. ఆధారిత ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అన్నారు. మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్ గా నవీకరించడం జరుగుతుందని, ఈ క్రమంలో డ్రోన్ సర్వే ద్వారా సంబంధిత వివరాలను సేకరించడం జరిగిందని తెలిపారు. సంబంధిత శాఖల ద్వారా కార్పొరేషన్ రూపకల్పనతో పాటు నివాస ప్రాంతాలు, పారిశ్రామికంగా, వ్యాపార పరంగా అభివృద్ధి చెందే ప్రాంతాలను గుర్తించడం జరుగుతుందని, ఆయా ప్రాంతాలలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, నెట్వర్క్, ట్రాఫిక్ ప్లానింగ్, మెడికల్, నీటి వనరులు, పరిశ్రమల స్థాపన ఇతరత్రా అంశాలకు సంబంధించిన వివరాలను సంబంధిత శాఖల నుండి సేకరించడం జరుగుతుందని తెలిపారు.

డ్రోన్ సర్వే ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, బేస్ మ్యాప్ రూపొందించి సంబంధిత శాఖల ద్వారా వివరాలను సేకరించి పరిశీలించడం జరుగుతుందని పేర్కొన్నారు. స్టడీ మ్యాప్స్ తయారు చేసి సంబంధిత శాఖలతో సమావేశం నిర్వహించి ముసాయిదా మాస్టర్ ప్లాన్ రూపొందించి ప్రభుత్వ ఆమోదం కోసం ప్రతిపాదించడం జరుగుతుందని తెలిపారు. ఆమోదిత ముసాయిదా ప్లాన్ ను ప్రచురించి అభ్యంతరాలు, ఫిర్యాదులు, సలహాలు స్వీకరించడం జరుగుతుందని, అనంతరం తుది ప్రణాళికను నిర్ధారించి అమలు చేసే దిశగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. మాస్టర్ ప్లాన్ సంబంధించి వివరాలతో కూడిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా శాఖల వారిగా అందించవలసిన సమాచారం, విధులు, బాధ్యతలు, వివిధ అంశాలను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అవగాహనే ఆయుధం




### క్యాన్సర్‌పైతో ముందస్తుగా గుర్తిస్తే వ్యాధిని నయం చేయవచ్చు

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ
- ముఖ్య అతిథిగా హాజరైన సినీ నటి గౌతమి

**వరంగల్ బ్యూరో, (నినాదం న్యూస్);**

క్యాన్సర్ వ్యాధి పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అవగాహనే ఆయుధం లా పని చేస్తుందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాన్సర్ అవగాహన కార్యక్రమానికి సినీ నటి గౌతమితో కలిసి వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుండి కాళోజీ కళాక్షేత్రం వరకు నిర్వహించిన వాక్ ను ఎంపీ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కాళోజీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన వేదికపై ఎంపీ మాట్లాడుతూ... గ్రామీణ స్థాయిలో క్యాన్సర్ అవగాహన కార్యక్రమాలు చేపట్టి, తొలిదశలో గుర్తిస్తే నివారించడం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రాణాంతకమైన క్యాన్సర్ నుంచి కాపాడుకోవడానికి ఏకైక మార్గం ఆ వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త పడటమేనని ఎంపీ చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్యాన్సర్ చికిత్స అందుబాటులోకి వస్తే పేద మధ్యతరగతి వారికి ఎంతగానో ఉపయోగపడుతుందని



తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్యాన్సర్ చికిత్సకు, మందులకు వెసులుబాటు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మద్యపానం, ధూమపానం, జంక్ ఫుడ్ తదితర వాటికి దూరంగా ఉండాలన్నారు. క్యాన్సర్ బారిన పడినవారు భయపడాల్సిన పనిలేదని, ధైర్యంతో క్యాన్సర్ జయించవచ్చని పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలో మొదటిసారిగా క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహిస్తున్న ప్రతిమ ఫౌండేషన్ యాజమాన్యాన్ని ఎంపీ అభినందించారు. కార్యక్రమంలో ప్రతి మా ఫౌండేషన్ ఫౌండర్ డా. హరిణి, ప్రతిమ ఇన్స్టిట్యూట్ చైర్మన్ డా. రమేష్, డైరెక్టర్లు డా. ప్రతీక్, డా.రాహుల్, డా.అవినాష్ ఇతర వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ పై అవగాహన పెంచుకోవాలి: జీఎం సూర్యనారాయణ

**మంచిర్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 4 (నినాదం):**

ప్రతి ఒక్కరూ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సూర్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం సీసీసీలో డివై సీఎంఓ రమేష్ బాబు ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, నివారణ చర్యలకు సంబంధించిన అవగాహన సదస్సులో సేవా సమితి అధ్యక్షురాలు మాలతితో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణలో శ్రీరాంపూర్ ఏరియా వైద్య అధికారులు, సిబ్బంది ఎల్లవేళలా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగా ఈ అవగాహన, వ్యాధి నిర్ధారణ పరీక్షల సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఉద్యోగుల కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉంటే సంస్థ అభివృద్ధి చెందుతుందని కావున ఉద్యోగులందరూ తమ తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటూ ఉండాలని, ఎల్లవేళలా చెక్ చేసుకుంటూ మందులను వాడాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అనేది ముఖ్యమని, వ్యాధి నిర్ధారణ చేసుకుని దానికి సంబంధిత మందులను వాడాలని తెలియజేశారు. జనరల్



సర్జన్ డాక్టర్ వి శ్రీకాంత్, గైనకాలజిస్ట్ డాక్టర్ జి హరిత గారు, డాక్టర్ లోకనాథ్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ వ్యాధులకు సంబంధించిన అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా తదితరులు పాల్గొన్నారు.



# ఐటెంసాంగ్‌లో శ్రియ

యంగ్ హీరోల దగ్గర నుంచి సీనియర్ హీరోల వరకు అందరి సరసన సినిమాలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకుంది వయ్యారి భామ శ్రియ. ఈ ముద్దుగుమ్మ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఒకప్పుడు స్టార్ హీరోయిన్ గా రాణించింది ఈ ముద్దుగుమ్మ. తెలుగులో స్టార్ హీరోలు కూడా ఈ అమ్మడి డేట్స్ కోసం ఎదురుచూసేవారు అప్పట్లో అంత బిజీగా గడిపింది శ్రియ. తెలుగులోనే కాదు తమిళ్ లోనూ సినిమాలు చేసి మెప్పించింది. నటనతో పాటు అందంలోనూ ఈ అమ్మడు అదరగొట్టింది. ఇక ఇప్పుడు నాలుగు పదుల వయసులోనూ శ్రియ తన అందా లతో ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం శ్రియ సినిమాలకు గ్యాప్ ఇచ్చింది. అడపదడపా సినిమాల్లో నటిస్తుంది. మొన్నామధ్య ఆర్ఆర్ఆర్ సినిమాలో చిన్న రోల్ లో కనిపించింది. ఇక ఇప్పుడు భర్త కూతురితో సమయాన్ని గడుపుతుంది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ రెగ్యులర్ గా ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. హాట్ హాట్ ఫొటోలతో కుర్రాళ్లను కవ్విస్తుంది ఈ చిన్నది. ఇక ఇప్పుడు అంతగా అవకాశాలు లేక ఫ్యామిలీతో విదేశాల్లో గడుపుతోంది. ఇదిలా ఉంటే శ్రియ ఫామ్‌లో ఉన్నప్పుడు హీరోయిన్ గా చేస్తూనే స్పెషల్ సాంగ్స్ లోనూ మెరిసింది. ఇదిలా ఉంటే ఇప్పుడు మరోసారి శ్రియ స్పెషల్ సాంగ్ లో కనిపించనుంది. ఓ స్టార్ హీరో సినిమాలో ఐటెం సాంగ్ లో శ్రియ నటిస్తుందని తెలుస్తుంది. ఆ హీరో ఎవరో కాదు తమిళ్ టాప్ హీరో సూర్య. సూర్య ప్రస్తుతం కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో రెట్రో అనే సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమా యాక్షన్ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతుంది. ఈ సినిమాలో స్పెషల్ సాంగ్ లో శ్రియ నటిస్తుందని తెలుస్తుంది. ప్రేమికుల రోజు సందర్భంగా ఫిబ్రవరి 14న విడుదల చేయనున్నారని తెలుస్తుంది. త్వరలోనే దీని పై క్లారిటీ రానుంది. సంతోష్ నారాయణన్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది సమ్మర్ లో విడుదల కానుంది. మే నెలలో ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# దూసుకుపోతున్న మినాక్షిచౌదరి




ఇండస్ట్రీలో చాలా మంది ఓవర్ నైట్ లో స్టార్స్ గా మారిపోయారు. కొంతమంది స్టార్ డమ్ కోసం ప్రయత్నిస్తున్నారు. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో దూసుకుపోతున్నారు. కొంతమంది కొన్ని సినిమాలతోనే కనిపించకుండా పోయారు. ఇక మరికొంతమంది వరుస సినిమాలు చేస్తున్నారు. అయితే చాలా మంది భామలు వరుసగా సినిమాలు చేస్తున్నప్పటికీ అదృష్టం కలిసి రాక హిట్స్ అందుకోలేకపోతున్నారు. మరి కొంతమంది మాత్రం హిట్స్ తో దూసుకుపోతున్నారు. పై ఫొటోలో కనిపిస్తున్న బ్యూటీ 4 నెలల్లో 3 హిట్లు అందుకుంది. అంతే కాదు ఆ సినిమాలు 850 కోట్ల కలెక్షన్స్ రాబట్టాయి ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? ఇప్పుడు స్టార్ హీరోలు కూడా ఆమె డేట్స్ కోసం ఎదురుచూస్తున్నారు. ఇంతకూ ఆ బ్యూటీ ఎవరో తెలుసా.? ఆమె ఎవరో కాదు ఇప్పుడు టాలీవుడ్ లో ఎక్కడ చూసినా ఆమె పేరే వినిపిస్తుంది. ఆ భామ ఎవరో కాదు లేటెస్ట్ సెన్సేషన్ మీనాక్షి చౌదరి. మీనాక్షి చౌదరి ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ.. బిజీగా మారింది. అక్కినేని హీరో సుశాంత్ హీరోగా నటించిన ఇచ్చట వాహనములు నిలుపరాదు సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది మీనాక్షి చౌదరి. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసింది. రవితేజ హీరోగా నటించిన ఖిలాడి సినిమాలో తన అందంతో ఆకట్టుకుంది. ఇక బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసింది. తెలుగుతో పాటు తమిళ్ లోనూ సినిమాలు చేస్తుంది ఈ అమ్మడు. తమిళ్ లో రీసెంట్ గా విజయ్ గోట్ సినిమాలో నటించింది. తెలుగులో వరుస హిట్స్ అందుకుంది. 4 నెలల్లో 3 హిట్లు అందుకుంది ఈ చిన్నది. గత నాలుగు నెలల్లో మూడు హిట్స్ అందుకుంది ఈ చిన్నది. విజయ్ హీరోగా వెంకట్ ప్రభు దర్శకత్వం వహించిన ఈసినిమా 450 కోట్లకు వసూల్ చేసింది. ఈ సినిమాలో మీనాక్షి హీరోయిన్ గా చేసింది. మీనాక్షి హిట్ లిస్ట్‌లో చేరిన చిత్రం 'లక్కీ భాస్కర్'.



### రెండు సినిమాల
# నటనతోనే యమ క్రేజీ

ప్రస్తుతం ఈ క్రేజీ హీరోయిన్ పేరు టాలీవుడ్‌లో బాగా వినిపిస్తోంది. అలాగనీ ఈ ముద్దుగుమ్మ పెద్దగా సినిమాల్లో నటించలేదు. ఇప్పటివరకు కేవలం రెండంటే రెండు సినిమాల్లో హీరోయిన్ గా యాక్ట్ చేసింది. అందులో ఒకటి యావరేజ్ కాగా మరొకటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ మూవీ. దీంతో ఈ అమ్మడికి సినిమా అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా మరో తెలుగు సినిమాలో ఈ అందాల తారకు అవకాశం దక్కించి. క సినిమాతో బ్లాక్ బస్టర్ కొట్టిన కిరణ్ అబ్బవరం నటిస్తున్న తాజా చిత్రం కే ర్యాంప్ లో ఈ ముద్దుగుమ్మకు కథానాయికగా అవకాశం లభించింది. దీంతో ఈ బ్యూటీ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ప్రస్తుతం టాలీవుడ్ లో క్రేజీ హీరోయిన్లలో ఒకరిగా గుర్తింపు తెచ్చుకుంటోన్న ఆమె మరెవరో కాదు యుక్తి తరేజా. నాగ శౌర్య నటించిన రంగబలి మూవీతో తెలుగు సినిమాకు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ మార్కో సినిమాతో పాన్ ఇండియా ఫేమస్ అయ్యింది. ఇందులో ఆమె నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఇప్పుడు కిరణ్ అబ్బవరం సినిమాలోనూ కథానాయికగా అవకాశం దక్కించుకుంది. దీంతో పాటు ఓ కన్నడ సినిమాలోనూ ఈ ముద్దుగుమ్మకు హీరోయిన్‌గా ఛాన్స్ దొరికింది. హరియాణాలోని ఓ మధ్య తరగతి కుటుంబంలో పుట్టింది యుక్తి తరేజా. చిన్న వయసులోనే మోడలింగ్ రంగంలోకి అడుగు పెట్టింది. 2017లో ఢల్లీ టైమ్స్ ఫ్రెష్ ఫేస్ అందాల పోటీల్లో విజేతగా నిలిచింది. డిగ్రీ ఆఖరి సంవత్సరంలో ఎమ్ టీవీ సూపర్ మోడల్ కాంటెస్ట్ లో పాల్గొనే అవకాశం దక్కించుకుంది యుక్తి.

# వరుస సినిమాలతో ప్రభాస్ బిజీ



రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైనప్ చేసి బిజీగా ఉన్నాడు. రీసెంట్ డేస్ లో వరుస హిట్స్ తో దూసుకుపోతున్నాడు. దాదాపు ఆరేళ్ళ తర్వాత సలార్ సినిమాతో సూపర్ హిట్ ఆ అందుకున్నాడు ప్రభాస్. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఈ సినిమా యాక్షన్ ఎంటర్టైనర్ గా తెరకెక్కింది. ఈ సినిమాలో మరో హీరోగా మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ నటించాడు. ఈ సినిమా తర్వాత ప్రభాస్ కల్కి సినిమాతో మరో హిట్ అందుకున్నాడు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన కల్కి సినిమా ఏకంగా వెయ్యికోట్లకు పైగా వసూల్ చేసింది. ఇక ఇప్పుడు బ్యాక్ టు బ్యాక్ సినిమాలు లైనప్ చేశారు. ఇక ప్రభాస్ లైనప్ చేసిన సినిమాల్లో సలార్ 2, కల్కి 2, రాజా సాబ్, ఫౌజీ, స్పిరిట్ సినిమాలను లైనప్ చేశారు. ఇదిలా ఉంటే ప్రభాస్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సెలబ్రెటీలందరూ ప్రభాస్ ను తెగ పొగిడేస్తుంటారు. ప్రభాస్ మంచితనం గురించి.. ప్రభాస్ పంపించే ఫుడ్ గురించి ఎప్పుడు మాట్లాడుతూ ఉంటారు. తాజాగా నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రభాస్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ ప్రభాస్ పై ప్రశంసలు కురిపించారు. అలాగే పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ.. ప్రభాస్ చాలా మంచి వ్యక్తి. అతనికి చిన్న చిన్న ఆనందాలు ఎక్కువ ఇష్టం. స్టార్ డమ్ గురించి అస్సలు పట్టించుకోడు. సోషల్ మీడియాకు చాలా దూరంగా ఉంటాడు. ఇన్ స్టా గ్రామ్ లో ప్రభాస్ అకౌంట్ నుంచి షేర్ అయ్యే పోస్ట్ లు కూడా ప్రభాస్ షేర్ చేసేవి కాదు. ఈ మాట చెప్పి మీ అందరినీ నిరాశ పరిచినందుకు క్షమించండి అని అన్నారు పృథ్వీరాజ్. ప్రభాస్ ఎక్కువగా ఫామ్‌హౌస్‌లో సంతోషంగా ఉంటాడు. ఎక్కడైనా మొబైల్ పనిచేయని ప్రాంతానికి వెళ్దాం అని ఎప్పుడూ అడుగుతుంటాడు. అంత పెద్ద స్టార్ అయ్యుండి చిన్న చిన్న ఆనందాలను ఇష్టపడటం చూస్తుంటే ఆశ్చర్యంగా అనిపిస్తుంది అని అన్నారు. అలాగే సలార్ 2 త్వరలోనే ఈ సినిమా రానుందని అన్నారు. పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో వస్తున్న లూసిఫర్2: ఎంపురాన్ కూడా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుందని అన్నారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288, CELL : +91 80742 79741